S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక | తెలుగు దినపత్రిక



సమయం
విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131



సంపుటి: 18 | సంచిక: 344 | ఎడిటర్ : విక్రం కుమార్ | శుక్రవారం 29 ఆగస్టు 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |





# జలవిలయం

## అల్పపీడనంతో అతలాకుతలం ■ కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో తీరని నష్టం

- రోడ్లు, కల్వర్లుకు గండ్లు.. రాకపోకలు అంతరాయం
- నీట మునిగిన దాదాపు అన్ని పంటలు
- ఊళ్లన్నీ చెరువుల్లా మారడంతో ప్రజల అవస్థలు
- డ్రోన్ల ద్వారా ఆహార పొట్లాల అందచేత
- ముమ్మరంగా సహాయక కార్యక్రమాలు
- జంటజలాశయాలకు భారీగా వరద
- హిమాయత్ సాగర్ నాలుగు గేట్లు ఎత్తివేత
- నిండుకుండలా హుస్సేన్ సాగర్

అల్పపీడనం అతలాకుతలం చేసింది. అల్పపీడన ప్రభావంతో కామారెడ్డి, మెదక్, నిర్మల్ జిల్లాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు కుంభవృష్టి కురియడంతో భారీ నష్టం జరిగింది. చెరువుల, కాలువులు పొంగిపొర్లాయి. కల్వర్లు, రోడ్లు తెగాయి. ముఖ్యంగా కామారెడ్డి, మెదక్ జిల్లాలు భారీ వర్షాలతో ఉక్కిరిబిక్కిరి అయ్యాయి. తెలంగాణలోని పలు ప్రాంతాల్లోనూ అత్యంత భారీ వర్షాలు కురిశాయి. భారీ వర్షాల నేపథ్యంలో కామారెడ్డి, మెదక్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. కామారెడ్డి జిల్లాలో కురిసిన భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పంట పొలాలు, నివాస ప్రాంతాలు చెరువులను తలపించాయి. దాదాపు పంటలన్నీ దెబ్బతిన్నాయి.

మిగతా 2 లో



### వరదల్లో చిక్కుకున్న ఐదుగురిని కాపాడిన ఆర్మీ

2



## గోదావరి జలాల తరలింపులో

# శ్రీపాద కీలకం

- మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారంలలో నీరు నిల్వ అసాధ్యం
- ఈ మూడింట్లో నిర్మాణ, నిర్వహణ లోపాలు ఉన్నాయి
- కూలిపోయిన ప్రాజెక్టు, నిలబడిన ప్రాజెక్టుకు మధ్య తేడా అదే
- అల్లుడు స్వాతిముత్యం.. మామ ఆణిముత్యం అంటూ సెటైర్లు
- వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం రేవంత్ ఏరియల్ సర్వే

**పెద్దపల్లి, ఆగస్టు 28:** గోదావరి జలాలను తెలంగాణలో ఎక్కడికి తరలించాలన్నా ఎల్లంపల్లి ప్రాజెక్టు కీలకమైనదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌తో కలిసి వరదప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, నిజామాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో వచ్చిన వరదలతో పలువురు చిక్కుకుపోయారు. ఈ నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో

మిగతా 2 లో

## ప్రతి కుటుంబానికి

# ఫ్యామిలీ కార్డు

### త్వరలో పాపులేషన్ పాలసీ.. స్కీంల రీ-డిజైన్

### అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

### ఫ్యామిలీ బెనిఫిట్ మానిటరింగ్ స్కీం సమీక్షలో చంద్రబాబు



**అమరావతి:** రాష్ట్రంలోని ప్రతీ కుటుంబ సంక్షేమం, కనీస అవసరాలు తెలుసుకునేలా క్షేత్రస్థాయిలో సమాచార వ్యవస్థను పటిష్ట పరచాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో ఫ్యామ్లీ బెనిఫిట్ మానిటరింగ్ వ్యవస్థపై సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. " రాష్ట్రంలో అన్ని సంక్షేమ

మిగతా 5 లో


## ఉల్లి రైతులకు భరోసా

- క్వింటాకు రూ.1200 చెల్లించి కొనుగోలు
- ఉల్లి రైతులు నష్టపోకూడదు.. కష్ట పడకూడదు
- కొనుగోలు చేసిన ఉల్లిని రైతు బజార్లకు తరలించండి
- ఉల్లి రైతుల ఇబ్బందులపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

5

## హైదరాబాద్‌కు బీచ్

### 225కోట్ల వ్యయంతో త్వరలో తీసుకరాబోతున్న సీఎం



**హైదరాబాద్, ఆగస్టు 28 :** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో ఆర్టిఫిషియల్ బీచ్‌ను ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. ఈ క్రమంలోనే నగర శివారులోని కొత్వాల్‌గూడలో ఆర్టిఫిషియల్ బీచ్ నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సుమారు 35 ఎకరాల్లో రూ. 225కోట్ల వ్యయంతో డిసెంబర్ నుంచి దీని నిర్మాణం మొదలుకానున్నట్లు సమాచారం. బీచ్‌లో ఫ్లోటింగ్ విల్లాస్, లగ్జరీ హోటళ్లు, వేవ్ పూల్స్, థియేటర్లు, ఫుడ్ కోర్టులు వంటివి చేర్చనున్నట్లు తెలుస్తోంది. ఈ బీచ్ నిర్మాణం వల్ల నగరానికి మరింత మంది పర్యాటకులు వచ్చే అవకాశం ఉంది.

# యూరియా వచ్చేసింది

### రాష్ట్ర రైతాంగానికి శుభవార్త తెలిపిన మంత్రి అచ్చెన్నాయుడు

### 10,350 మెట్రిక్ టన్నుల యూరియా గంగవరం పోర్టులో దిగుమతి

### కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**నంబర్ వన్-అమరావతి:** రాష్ట్ర రైతాంగానికి వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుభవార్త తెలిపారు. యూరియా సరఫరా విషయంపై కేంద్ర వ్యవసాయ ఎరువుల రసాయనిక మంత్రితో మాట్లాడటంతో నేడు రాష్ట్రానికి 10,350 మెట్రిక్ టన్నుల యూరియా గంగవరం పోర్టునకు చేరుకుంటున్నదని మంత్రి అచ్చెన్న తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనకు సత్వరమే సానుకూలంగా స్పందించి రాబోయే సెప్టెంబర్ 6న

మిగతా 5 లో

## ఏపీ వ్యాప్తంగా భారీ వర్షాలు

2

### పొంగిపొర్లుతున్న వాగులు వంకలు

పరిస్థితిని సమీక్షించిన హోంమంత్రి అనిత





## ప్రతి జంటా ముగ్గురిని కనాలి

### జనాభా తగ్గకుండా కాపాడుకోవాలి

### ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

.. వివరాలు 4లో

## రేవంత్ నీరో చక్రవర్తి

- ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టింపులేదు
- వరదలు ముంచెత్తుతున్నా మూసీ, క్రీడలపై సమీక్షలా?
- సీఎంపై కేటీఆర్‌ఫైర్

3

# గేట్లపై నుంచి వరద ప్రవాహం

- వరదను తట్టుకున్న 103 ఏళ్ల నాటి పోచారం ప్రాజెక్టు
- డ్యామ్ తెగిపోతుందేమోనని రాత్రంతా టెన్షన్
- వరద తగ్గడంతో తప్పిన ముప్పు
- ఇది గర్వించదగ్గ సమయం అన్న మంత్రి ఉత్తమ్ ప్రకటన



**కామారెడ్డి ,ఆగస్టు 28:** కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం డ్యామ్ సామర్థ్యానికి మించి వరద పోటెత్తడంతో గేట్లు తెరిచి ఉంచినా డ్యాంపై నుంచి వరద ఉప్పొంగింది. భయానకంగా ప్రవహిస్తున్న వరదతో బుధవారం రాత్రి అంతా పరిసర ప్రాంతాల ప్రజలు టెన్షన్‌తో గడిపారు. కట్ట తెగే ప్రమాదం పొంచి

మిగతా 3 లో

## సీఎస్ సర్వీసు పొడిగింపు

- తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి
- కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు
- మార్చి వరకు రామకృష్ణారావు కొనసాగింపు

3

తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామకృష్ణారావు సర్వీసును పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.





# ఐదుగురిని కాపాడిన ఆర్మీ

**కరీంనగర్, ఆగస్ట్ 28:** సిరిసిల్ల జిల్లాలో వరదలో చిక్కుకున్న ఐదుగురిని ఆర్మీ సిబ్బంది రక్షించారు. గంభీరావుపేట మండలం నర్మాల వద్ద ఎగువ మానేరు ప్రాజెక్టుకు అవతలివైపు పశువులను మేపేందుకు బుధవారం ఐదుగురు వ్యక్తులు వెళ్లారు. ఒక్కసారిగా వరద రావడంతో వారంతా అక్కడే చిక్కుకున్నారు. విషయం తెలుసుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ తక్షణమే స్పందించారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో మాట్లాడి రెండు హెలికాప్టర్లను తెప్పించారు. ఈక్రమంలో వరదలో చిక్కుకున్న వారిని గురువారం ఆర్మీ అధికారులు రెండు హెలికాప్టర్ల ద్వారా సురక్షిత ప్రాంతానికి తరలించారు. సహాయక చర్యలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు.

# విద్యాసంస్థలకు సెలవులు ప్రకటన

**హైదరాబాద్, ఆగస్టు 28:** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో 13 జిల్లాల్లో పాఠశాలలకు విద్యాశాఖ సెలవులు ప్రకటించింది. నల్లగొండ, యాదాద్రి భువనగిరి, కరీంనగర్, సిద్దిపేట, జగిత్యాల, సిరిసిల్ల,కామారెడ్డి, మెదక్, నిర్మల్, ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు- విద్యాసంస్థలకు అధికారులు సెలవు ప్రకటించారు. భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయకు రాకూడదని అధికారులు సూచించారు. వర్ష ప్రభావం కారణంగా కామారెడ్డి జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు ఆగస్టు 29, 30 వరకు సెలవులు ప్రకటించినట్లు- ప్రభుత్వం తెలిపింది. భారీ వర్షాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సెలవులను మరో రెండు రోజులు పొడిగించింది. అందువల్ల పాఠశాలలు, కళాశాలలు బంద్ కానున్నాయి.సిద్దిపేట జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల ప్రభావంతో కామారెడ్డి, మెదక్ జిల్లాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

# ఉత్తర భారతంలో భారీ వర్షసూచన

**న్యూఢిల్లీ,ఆగస్టు 28 :** దేశ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిం చింది. ఉత్తరాఖండ్‌లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని చెప్పింది. చమోలీ, భా గేశ్వర్, పథోరాగర్ జిల్లాలకు ఆరెంజ్ ఆలర్ట్ జారీ చేసింది. అదే విధంగా ఉత్తర కాశీ, తెహ్రీ గర్వాల్, రుద్రప్రయాగ్, హరిద్వార్, అల్మోరా, నైనీతాల్ ఉదంసింగ్ నగర్‌కు యెల్లో అలర్ట్ జారీ చేసింది. అదే విధంగా హిమాచల్ ప్రదేశ్ లోనూ భారీ వర్షాలు కురుస్తాయన్న ఐఎండీ.. సోలన్, సిర్మోర్ ప్రాంతాలకు యెల్లో అలర్ట్ జారీ చేసింది. పంజాబ్‌లోని గురుదాస్పుర్, పఠాన్ కోట్ జిల్లాలకు భారీ వరద ముంపు ఉందన్న హెచ్చరికలతో ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ సహా ఇతర అన్ని విభాగాల సిబ్బందిని మోహరించారు.

# మూసీలో పడి వ్యక్తి గల్లంతు

**హైదరాబాద్,ఆగస్టు 28 :** రంగారెడ్డి, హైదరాబాద్‌లో కురుస్తున్న వర్షాలకు మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఒక వ్యక్తి మూసీ నదిలో పడి గల్లంతవ్వడం కలకలం రేపింది. గురువారం సాయంత్రం మూసీనదిలో పడిపోవడంతో ప్రమాదం చోటు-చేసుకుంది. చాదర్‌ఘాట్ శంకర్‌నగర్ దగ్గర జరిగింది ఈ ఘటన. సలీం అనే వ్యక్తి ప్రమాదవశాత్తు మూసీ నదిలో పడిపోవటం కలకలం రేపింది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గల్లంతైన సలీం కోసం హైడ్రా, బృందాలు గాలిస్తున్నాయి. ఘటనా స్థలానికి స్థానికులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. కుటు-ంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటి వరకు వ్యక్తి ఆచూకీ దొరకలేదు. రాత్రి సమీపిస్తుండటంతో గాలింపు చర్యలకు ఇబ్బంది కలిగే అవకాశం ఉంది.

# కాకతీయ పరిధిలో పరీక్షలు వాయిదా

## డిగ్రీ, పిజి పరీక్షలు వాయిదా వేస్తూ ప్రకటన

**వరంగల్, ఆగస్టు 28:** పలు జిల్లాల్లో ఇప్పటికే పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో ఆగస్టు 28, 29 తేదీల్లో జరగాల్సిన డిగ్రీ, పీజీ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు- రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రాజేందర్ ప్రకటించారు. వర్షాల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని, మిగిలిన పరీక్షలు షెడ్యూల్ ప్రకారం యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు. వాయిదా వేసిన పరీక్షల కొత్త తేదీలను త్వరలో ప్రకటిస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా, కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో గురువారం జరగాల్సిన బీఎడ్, ఎంఎడ్ పరీక్షలు కూడా వాయిదా పడ్డాయి. వర్షాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని అధికారులు వెల్లడించారు. మిగతా పరీక్షలు యథావిధిగా జరుగుతాయని స్పష్టంచేశారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ మోడల్ స్కూల్స్‌లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి ఆరు నుంచి పదో తరగతి వరకు అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్షలు నిర్వహించినా, ఇంకా సుమారు 48,630 సీట్లు ఖాళీగా ఉన్నట్లు గుర్తించామని ఆయన వెల్లడించారు. ఇంటర్ రెండో సంవత్సరం 13,256 సీట్లు, ఇంటర్ ఫస్ట్ ఇయర్ 12,668 సీట్లు, ఆరో తరగతి 7,543 సీట్లు, ఏడో తరగతి 5,192 సీట్లు, ఎనిమిదో తరగతి 3,936 సీట్లు, తొమ్మిదో తరగతి 2,884 సీట్లు, పదో తరగతి 3,151 సీట్లు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు నేరుగా సంబంధిత మోడల్ స్కూల్ ప్రిన్సిపల్‌ను సంప్రదించి అడ్మిషన్లు పొందవచ్చని సూచించారు.

# వరదలతో అప్రమత్తంగా ఉన్నాం

## ఇప్పటికే పదిమంది మృతి చెందినట్లు సమాచారం



**హైదరాబాద్, ఆగస్టు 28:** ఉత్తర తెలంగాణను భారీ వర్షాలు ముంచెత్తాయి. వరదల కారణంగా ఇప్పటి వరకు 10 మంది చనిపోయినట్టు- సమాచారం ఉందని తెలంగాణ డీజీపీ జితేందర్ తెలిపారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై పూర్తి అప్రమత్తంగా ఉన్నట్టు- చెప్పారు. ఇప్పటి వరకు వరదల్లో చిక్కుకున్న దాదాపు 2వేల మందిని రక్షించినట్టు- చెప్పారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్, ఆర్మీ సాయంతో రెండు హెలికాప్టర్ల ద్వారా బాధితులను రక్షించినట్టు డీజీపీ వివరించారు. రెండు వేల మంది సిబ్బందితో ఎస్డీఆర్ఎఫ్ ఏర్పాటు- చేసి రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్టు- చెప్పారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వరద ప్రభావిత ప్రాంతాల్లో కలిసి పనిచేస్తున్నాయన్నారు. ఒకవైపు గణేష్ ఉత్సవాలు ఉన్నప్పటికీ.. వరదలపై పోలీసు శాఖ పోరాటం చేస్తోందని తెలిపారు. వరద ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం తరలించేందుకు డీజీపీ కార్యాలయంలో కూడా అత్యవసర బృందాలను సిద్ధంగా ఉంచామని డీజీపీ తెలిపారు. హైదరాబాద్‌లో భారీ వర్షాలు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

# అల్పపీడనంతో అతలాకుతలం

## కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో తీరని నష్టం

## రోడ్లకు గండ్లు.. రాకపోకలు అంతరాయం

## ముమ్మరంగా సహాయక కార్యక్రమాలు



**నిజామాబాద్, ఆగస్ట్ 28:** అల్పపీడనం అతలాకుతలం చేసింది. అల్పపీడన ప్రభావంతో కామారెడ్డి, మెదక్, నిర్మల్ జిల్లాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు కుంభవృష్టి కురియడంతో భారీ నష్టం జరిగింది. చెరువుల, కాలువులు పొంగిపొర్లాయి. కల్వర్లు, రోడ్లు తెగాయి. ముఖ్యంగా కామారెడ్డి, మెదక్ జిల్లాలు భారీ వర్షాలతో ఉక్కిరిబిక్కిరి అయ్యాయి. తెలంగాణలోని పలు ప్రాంతాల్లోనూ అత్యంత భారీ వర్షాలు కురిశాయి. భారీ వర్షాల నేపథ్యంలో కామారెడ్డి, మెదక్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. కామారెడ్డి జిల్లాలో కురిసిన భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పంట పొలాలు, నివాస ప్రాంతాలు చెరువులను తలపించాయి. దాదాపు పంటలన్నీ దెబ్బతిన్నాయి. కామారెడ్డి -భిక్కనూర్ మార్గంలో రైలు పట్టాల కింద వరద పోటెత్తడంతో భారీ గండిపడింది. దీంతో అధికారులు రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో వాగు పొంగడంతో కార్లు వరద ప్రవాహంలో కొట్టుకుపోయాయి. హౌసింగ్ బోర్డు కాలనీలో ఇళ్లలోకి నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కామారెడ్డి, మెదక్ జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో గురువారం ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు అధికారులు సెలవులు ప్రకటించారు. మెదక్, నిర్మల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ పేర్కొంది. మరోవైపు భారీ వర్షాల దృష్ట్యా తెలంగాణ వర్సిటీ పరిధిలో పరీక్షలు వాయిదా పడ్డాయి. శుక్రవారం యథాతథంగా పరీక్షలు నిర్వహించనున్నట్లు వీసీ యాదగిరిరావు పేర్కొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో అధికంగా వరద రావడంతో పోచారం ప్రాజెక్టు కట్ట కోతకు గురి అయింది. దోమకొండ మండలం సంగమేశ్వర్ ఎడ్లకట్ట వాగు సమీపంలో వరదలో చిక్కుకొని కారుతో సహా తండ్రీకొడుకులు వాగులో కొట్టుకుపోయారు. దోమకొండకు చెందిన ఆర్ఎంపీ డాక్టర్ మేక చిన్న హరిశంకర్, ఆయన కుమారుడు మహేశ్ తమ కారులో.. గోడకూలి మృత్యువాత పడ్డ తన మేనల్లుడి అంత్యక్రియల కోసం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. కారుపై కూర్చొని సాయం చేయాలంటూ సైగలు, అరుపులు చేశారు. ఇది గమనించిన సంగమేశ్వర్ గ్రామస్థులు జేసీబీ సాయంతో కాపాడేందుకు ప్రయత్నించారు. కానీ సాధ్యం కాలేదు. ప్రవాహంలో కొట్టుకుపోతూ చివరకు చెట్టును పట్టుకొని అలాగే ఉండిపోయారు. దాదాపు 9 గంటల నరకయాతన అనుభవించిన అనంతరం వరద ఉధృతి తగ్గడంతో వ్యవసాయ భూముల నుంచి పాక్కుంటూ బయటకు వచ్చారు. వారు సురక్షితంగా బయటపడటంతో గ్రావ స్థులు ఊపిరి పీల్చుకున్నారు. కామారెడ్డి-ఎల్లారెడ్డి మార్గంలో లక్ష్మాపూర్ గ్రామం వద్ద రోడ్డు కోతకు గురైంది. రాజంపేట మండల కేంద్రంలో వర్షానికి గోడ కూలి యువ వైద్యుడు మృతి చెందాడు. రాజంపేటకు చెందిన వినయ్ (28) గుండారం పల్లె దవాఖానాలో వైద్యుడిగా పని చేస్తున్నారు. భారీ వర్షానికి రాజంపేటలోని దేవుని చెరువు కట్ట తెగి వినయ్ ఇంట్లోకి వరద నీరు చేరింది. నీటిని బయటకు మళ్లించేందుకు గడ్డపారతో గోడకు రంధ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తూ గోడ కూలి మీద పడటంతో వైద్యుడు వినయ్ అక్కడిక్కడే మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.కామారెడ్డి జిల్లా తిమ్మారెడ్డిలోని కల్యాణి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగుపై బొగ్గు గుడిసె సమీపంలో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్న ఆరుగురు కార్మికులు వరదలో చిక్కుకున్నారు. ఈ వరద కారణంగా కామారెడ్డి- భిక్కనూర్ సమీపంలో రైలు పట్టాల కింద గండిపడింది. దీంతో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. గురువారం ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు అధికారులు సెలవులు ప్రకటించారు. కడెం ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తి 20వేల క్యూసెక్కుల నీటిని కిందికి విడుదల చేస్తున్నారు. సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ఎగువ మానేరు ప్రాజెక్టు వద్ద చిక్కుకున్న వారికోసం డ్రోన్ సహాయంతో ఆహార పదార్థాల చేరవేత చేపట్టారు. అల్పపీడన ప్రభావంతో మెదక్ జిల్లాలో భారీ వర్షాలు దంచికొట్టాయి. దీంతో వరద ఉధృతికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. హవేలిఘనపూర్ మండలం రాజపేటతండాలోని వాగులో 10 మంది స్థానికులు చిక్కుకుపోయారు. అధికారుల సూచనతో లెఫ్టినెంట్ కల్నల్ నిఖిల్ ఆధ్వర్యంలో ఆర్మీ బృందం రంగంలోకి దిగింది. 30 మంది జవానులు రాజాపేటకు చేరుకొని సహాయ చర్యలు చేపట్టారు. పాపన్నపేట మండలం ఎల్లాపూర్ వంతెన వద్ద మంజీరా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నది ప్రవాహదాటికి వంతెన పైకి వరద నీరు చేరింది.

### వరద ముంచెత్తడంతో గ్రామాలు ఖాళీ

భారీ వర్షాల కారణంగా కామారెడ్డి జిల్లాలోని పలు గ్రామాలను వరద ముంచెత్తుతోంది. ఈక్రమంలో డోంగ్లి మండలంలోని సిర్పూర్, హాసన్ టాక్లి, పెద్దటాక్లి గ్రామాల్లోని ప్రజలు ఇళ్లు ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. పొరుగు గ్రామాల్లోని తమ బంధువుల ఇళ్లలో తలదాచుకుంటున్నారు. చిన్నారులు, వృద్ధులు మద్నూర్ మండలంలోని మిర్జాపూర్ (సలాబత్ పూర్) ఆంజనేయస్వామి ఆలయంలో తలదాచుకున్నారు. పెద్ద టాక్లీలోని కొన్ని కుటుంబాలు డోంగ్లి మండల కేంద్రానికి వెళ్లాయి. సిర్పూర్‌లో 246, పెద్దటాక్లిలో 190, హాసన్ టాక్లిలో 120 కుటుంబాల వారు తమ ఇళ్లకు తాళాలు వేశారు. పిట్లం మండలం కుర్తి గ్రామం పూర్తిగా జల దిగ్బంధంలో చిక్కుకుంది. జుక్కల్ ఎమ్మెల్యే బాధితులకు పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. ఇళ్లు వదిలి ఆలయాల్లో తలదాచుకున్న వాళ్లతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# గోదావరి జలాల తరలింపులో శ్రీపాద కీలకం

మొదటి పేజీ తరువాయి

ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలించిన అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు. స్ట్రాటజిక్ లోకేషన్‌తో కట్టిన ప్రాజెక్టు శ్రీపాద ఎల్లంపల్లి అని.. కూలిపోయిన ప్రాజెక్టు, నిలబడిన ప్రాజెక్టుకు మధ్య తేడా ఉందన్నారు. నిపుణులు కట్టిన ప్రాజెక్టు కాబట్టే ఎల్లంపల్లి దశాబ్దాలుగా నిలబడిందని పేర్కొన్నారు. మేడిగడ్డ పనికిరాకుండా పోయింది. మేడిగడ్డ రిపేరు చేయకుండా.. అన్నారం, సుందిళ్లలో నీరు నిల్వ చేయొచ్చు కదా? అని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సీఎం సమాధానమిచ్చారు. అతి తెలివితేటలతో మామ, అల్లుడు.. ఒకరు స్వాతి ముత్యం, మరొకరు ఆణిముత్యం అనుకుంటారు. మేడారం, అన్నారం, సుందిళ్ల.. మూడు బ్యారేజీలు ఒకే రకమైన సాంకేతిక నైపుణ్యంతో నిర్మించారు. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తి అన్నారంలో పోయాలి, అక్కడి నుంచి సుందిళ్ల, శ్రీపాద ఎల్లంపల్లిలో పోయాలి. 3 బ్యారేజీల డిజైన్‌లో, నిర్మాణంలో, నిర్వహణలో లోపం ఉంది. ఏదైనా ప్రమాదం జరిగేతే గ్రామాలకు గ్రామాలు తుడిచిపెట్టుకుపోతాయి. మేం.. 80వేల పుస్తకాలు చదవలేదు. 80 వేల పుస్తకాలు చదివిన మేధావిని సలహా అడుగుతున్నాం ఏం చేద్దామని. మేడిగడ్డ విషయంలో సాంకేతిక కమిటీ- సూచనల ప్రకారం వెళ్తాం. కాళేశ్వరం



కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చించి ముందుకెళ్తాం అని సీఎం స్పష్టం చేశారు. వరద పరిస్థితిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్న సీఎం.. పలు సూచనలు చేశారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు పడుతున్నాయి. కుండపోతగా కురుస్తున్న వానలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతకుముందు కామారెడ్డి జిల్లాలో భారీ వర్షాలపై సమీక్షించారు సీఎం రేవంత్‌రెడ్డి. అనంతరం మెదక్, పెద్దపల్లి జిల్లాలో సీఎం బృందం ఏరియల్ సర్వే చేసింది. అనంతరం వరదలపై అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు గోదావరి జలాలు గుండెకాయ అని ఉద్ఘాటించారు. కాళేశ్వరం ఘోష్ నివేదికపై అసెంబ్లీలో చర్చిస్తామని, మామ అల్లుడు ఎన్ని కుట్రలు చేసిన పాపాలు పోవని విమర్శించారు. అల్లుడు స్వాతిముత్యం.. మామ ఆణిముత్యమని ఎద్దేవా చేశారు. నీళ్లు నింపితే గ్రామాలే కొట్టుకపోతాయని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ అన్నారం, సుందిళ్ల ప్రాజెక్ట్‌లో లోపాలు ఉన్నాయని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో సాంకేతిక వైఫల్యం ఉందని తెలిపారు. డిజైన్లు, నిర్మాణం, నిర్వహణ లోపం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సిఎం, ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద నుంచి కామారెడ్డికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ బయలు దేరారు. కామారెడ్డిలో ముంపు పరిస్థితులను పరిశీలించారు. 3 బ్యారేజీల్లో నీటినిల్వ, ఎత్తిపోత క్షేమం కాదని ఎన్డిఎస్ఎ చెప్పిందని, నిర్మాణం, నిర్వహణలో లోపం ఉందని నిపుణుల కమిటీ- చెప్పిందని అన్నారు. నీరు నిల్వ చేశాక మొత్తం కూలిపోతే.. గ్రామాలు కొట్టు-కుపోతాయని, కాళేశ్వరం కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చించి ముందుకెళ్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# భారీ వర్షాలపై ప్రభుత్వం అప్రమత్తం

## తక్షణ చర్యలకు సీఎం రేవంత్ ఆదేశం



**హైదరాబాద్, ఆగస్టు 28:** హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. పురాతన ఇళ్లలో ఉన్న వారిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సీఎం అధికారులను ఆదేశించారు. వినాయక మండపాల సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లతో భక్తులకు ప్రమాదం వాటిల్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్ కో సిబ్బందిని ఆదేశించారు. హైదరాబాద్‌లో హైడ్రా, జీహెచ్ఎంసీ, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక, పోలీసు సిబ్బంది సమన్వయం చేసుకుంటూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సీఎం పేర్కొన్నారు. నదులు, వాగులపై ఉన్న లోతట్టు- కాజ్‌వేలు, కల్వర్టులపై నుంచి నీటి ప్రవాహాలు ఉంటే అక్కడ రాకపోకలు నిషేధించాలని సీఎం ఆదేశించారు. చెరువులు, కుంటలకు గండి పడే ప్రమాదం ఉన్నందున నీటి పారుదల శాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున నగర పాలక, పురపాలక, గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి నిల్వ నీటిని తొలగించడంతో పాటు ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. వైద్యారోగ్య శాఖ సిబ్బంది ఆసుపత్రుల్లో సరిపడా మందులు అందుబాటులో ఉంచుకోవడంతో పాటు అవసరమైన చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. వర్షాలు ఎక్కువగా కురుస్తున్న కామారెడ్డి, మెదక్ జిల్లాల కలెక్టర్లను అలర్ట్ చేసిన రేవంత్ రెడ్డి. వెంటనే అక్కడ అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని, ఎలాంటి విపత్కర పరిస్థితులు వచ్చినా ఎదుర్కునేందుకు అన్ని విభాగాల అధికారులు సిద్ధంగా ఉండాలని, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాల సాయం తీసుకోవాలని సీఎస్‌కు ఆదేశాలు.



# సిరిసిల్లలో వరద సందర్శనలు

## ఎదురుపడ్డ కేటీఆర్, బండి.. పలకరింపులు

**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 28:** రాజన్న సిరిసిల్ల జిల్లా నర్మాలలో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. నర్మాలలో వరద బాధితులను పరామర్శించి వస్తుండగా కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎదురుపడ్డారు. బండి సంజయ్‌ను చూడగానే ఆయన కాన్వాయ్ వద్దకు కేటీఆర్ వచ్చారు. వాహనం దిగి కేటీఆర్ వద్దకు వచ్చిన బండి సంజయ్ అభివాదం చేశారు. బాగున్నారా అంటూ ఒకరికొకరు పలుకరించుకున్నారు. కష్టపడుతున్నవంటూ ఈ సందర్భంగా బండి సంజయ్‌ను ఉద్దేశించి కేటీఆర్ వ్యాఖ్యానించారు. అనంతరం నర్మాల బాధితులను పరామర్శించేందుకు కేటీఆర్ వెళ్లిపోయారు.

# క్రీడా ప్రపంచానికి హైదరాబాద్ వేదికగా మారాలి

- గ్రామస్థాయి నుంచి క్రీడాకారులకు తర్ఫీదు
- తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు మొదటి సమావేశంలో సిఎం రేవంత్



**హైదరాబాద్, ఆగస్ట్ 28:** క్రీడా ప్రపంచానికి హైదరాబాద్ వేదికగా మారాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. తెలంగాణకు ఐటీ సంస్కృతి ఉందని... రాష్ట్రంలోని ప్రతి కుటుంబం తమపిల్లలు ఐటీ రంగంలో ఉండాలని కోరుకుంటున్నారని.. అలానే క్రీడా సంస్కృతి రావాలని తాను అభిలషిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఖేలో ఇండియా, కామన్ వెల్త్, ఒలింపిక్స్ ఇలా ఏ పోటీలు నిర్వహించినా వాటిలో తెలంగాణకు అవకాశం కల్పించాలని తెలంగాణ స్పోర్ట్స్ హబ్ తీర్మానం చేసింది. రాష్ట్రంలో స్టేడియాల నిర్వహణ, వసతులు మెరుగుపర్చడం, కోచ్‌లు, -ట్రైనర్‌లకుశిక్షణ, క్రీడా పాలసీలో వివిధ అంశాలపై ప్రణాళికరూపకల్పన, అమలుకు సబ్‌మిటీల ఏర్పాటుకు బోర్డు తీర్మానాలు చేసింది. తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు మొదటి సమావేశం హైదరాబాద్‌లో గురువారం జరిగింది. సమావేశంలోముఖ్యమంత్రి మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడా విధానం, క్రీడల ప్రోత్సాహం విషయంలో ప్రతిఒక్కరూ హైదరాబాద్ గురించి మాట్లాడుకోవాలనేదే తన లక్ష్యమన్నారు. క్రీడా రంగం ప్రోత్సాహానికి గానూ గతంతో పోల్చితే 16రెట్లు- బడ్జెట్ పెంచామని సీఎం వివరించారు. హైదరాబాద్‌తో పాటు- తెలంగాణ వ్యాప్తంగా పెద్ద ఎత్తున స్టేడియాలు, అధునాతనపరికరాలు అందుబాటులో ఉన్నా ఆశించిన స్థాయిలో ఫలితాలులేవని, వాటిని సమగ్రంగా సద్వినియోగం చేసుకోవడం తో పాటు క్రీడా రంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు బోర్డు తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎం కోరారు. ఇప్పటివరకు ఉన్న క్రీడా పోటీల విధానాన్ని మార్చుతూ గ్రామ, మండల, శాసనసభ నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. క్రీడా సామగ్రిపై ఉన్న పన్నుల తగ్గింపునకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతామని... తమ స్థాయిలో అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో ఫిజియోథెరపీ, ఇతర క్రీడా సంబంధిత కోర్సులు ప్రవేశపెడతామని బోర్డు సభ్యులకు తెలియజేశారు. స్టేడియాలు పెద్ద సంఖ్యలో ఉన్నా తగిన సంఖ్యలో కోచ్‌లు లేరని, ఉన్న కోచ్‌లకుఅంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు తగినట్లు శిక్షణ ఇప్పించాల్సి ఉందన్నారు. ఇండియా క్రికెట్ టీమ్ మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ మాట్లాడుతూ తొలుత క్రీడా సంస్కృతిని పెంపొందిం చాలని... ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలోపాల్గొనేలా చూస్తే ఫలితాలు వాటంతటవే వస్తాయని అభిప్రాయపడ్డారు. ప్రముఖ షూటర్ అభినవ్ భింద్రా మాట్లాడుతూ ప్రతిపాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు, వ్యాయామ సంచాలకుడు ఉండేలా చూడాలన్నారు. ఆధాని ఫౌండేషన్ శతాధానీ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని... వ్యాయామ అక్షరాస్యత పై అవగాహన పెంపొందించాల్సి ఉందన్నారు. బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి క్రీడా పోటీలు దశలవారీగా ఉండాలని.. అప్పుడు మెరుగైన క్రీడాకారుల ఎంపిక సాధ్యమవుతుందన్నారు. హబ్ కో ఛైర్‌పర్సన్ ఉపాసన కొణిదెల మాట్లాడుతూ ఫిజియోథెరపిస్టు కోర్సులను క్రీడా యూనివర్సిటీలో ప్రారంభించాలని కోరారు. అలాగే స్పోర్ట్స్ సామగ్రిపై పన్నుల భారం భారీగా ఉందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో క్రీడా వ్యవహారాల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వప్రత్యేక ముఖ్య కార్యదర్శిజయేశ్రంజన్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ- ఛైర్మన్శివసేనా రెడ్డి, ఎండీ సోని బాల దేవి తదితరులు పాల్గొన్నారు.



# గేట్లపై నుంచి వరద ప్రవాహం

**వరదను తట్టుకున్న 103 ఏళ్ల నాటి పోచారం ప్రాజెక్టు**

**కామారెడ్డి ,ఆగస్టు 28:** కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం డ్యామ్ సామర్థ్యానికి మించి వరద పోటెత్తడంతో గేట్లు తెరిచి ఉంచినా డ్యాంపై నుంచి వరద ఉప్పొంగింది. భయానకంగా ప్రవహిస్తున్న వరదతో బుధవారం రాత్రి అంతా పరిసర ప్రాంతాల ప్రజలు టెన్షన్‌తో గడిపారు. కట్ట తెగే ప్రమాదం పొంచి ఉండటంతో అధికారులు సైతం స్థానిక ప్రజలను అప్రమత్తం చేశారు. అయితే పోచారం డ్యామ్ విషయంలో నరాలు తెగే ఉత్కంఠతో బిక్కుబిక్కుమంటూ గడిపినా భారీ వరదను ఈ డ్యామ్ తట్టుకుని నిలబడింది. గురువారం ఉదయం వరద తగ్గడంతో పరిస్థితి అంతా చేతులోనే ఉందని అధికారులు చెబుతున్నారు. పోచారం డ్యామ్ వరదను తట్టుకుని నిలబడడంపై తాజాగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. 103 సంవత్సరాల పురాతన పోచారం ప్రాజెక్ట్ 1,82,000 క్యూసెక్కుల భారీ వరద ప్రవాహాన్ని త ట్టుకుని సురక్షితంగా నిలబడిందని ఉత్తమ్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ఎంఎఫ్ డీ 70,000 క్యూసెక్కుల కంటే ఈ వరద చాలా ఎక్కువ అని తెలిపారు. బుధవారం ఉద్రిక్త క్షణాల తర్వాత, ప్రాజెక్ట్ బలంగా నిలబడటం, చూడటం తనతో పాటు మా నీటి పారుదల శాఖ సహచరులకు గొప్ప ఉపశమనం కలిగించిందని.. నిజంగా ఇది గర్వించదగ్గ మరియు భావోద్వేగ సమయం అన్నారు.

**నిజాం నాటి కట్టడం..**

మెదక్ పట్టణానికి సమీపంలో ఉన్న ఈ పోచారం డ్యామ్‌కు ఘనమైన చరిత్ర ఉంది. చివరి నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్ కామారెడ్డి జిల్లాలోని మంచిప్ప చెరువుపై నాగిరెడ్డిపేట మండలం పోచారం గ్రామంలో 1917లో పోచారం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాలు, మెదక్ జిల్లాలోని మెదక్ మండలాల నీటి అవసరా. లను తీర్చేందుకు రూ.27.11 లక్షల వ్యయంతో 2.423 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు నిర్మాణం 1922లో పూర్తయింది. గత 103 ఏళ్లుగా నిజామాబాద్, మెదక్ జిల్లాల ప్రజల సాగు, తాగునీటి అవసరాలను ఈ పోచారం డ్యామ్ తీరు స్తోంది. సున్నపురాయితో నిర్మించిన ఈ ప్రాజెక్టు పొ డవు 1.7 కిలోమీటర్లు, మంచిప్ప వాగుపై 21 అడు గుల ఎత్తైన కట్ట, దాని చుట్టూ 58 కిలోమీటర్ల పొడ వైన కాలువలు తవ్వారు. ఈ ప్రాజెక్టుకు 73 డిస్ట్రి బ్యూటరీలు ఉన్నాయి. ఇదీలా ఉండగా అప్పట్లో నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్ హైదరాబాద్ నుంచి విడిది కోసం పోచారం డ్యామ్ వద్దకు వచ్చే వారని స్థానికులు అంటున్నారు. అప్పట్లోనే డ్యామ్ వద్ద రెండు అతిథి గృహాలను నిర్మించారు. డ్యాము. సమీపంలోనే పోచారం అభయారణ్యం ఉంది. అభయారణ్యంలో వేటకు వచ్చి డ్యామ్ వద్ద రాజు సేద తీరేవాడని చెబుతున్నారు.



# బాధితులకు తక్షణ సాయం అందించాలి

**కామారెడ్డి వరద ప్రాంతాల్లో మంత్రి సీతక్క పర్యటన**

**కామారెడ్డి,ఆగస్ట్28:** జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని సదుపాయాలు కల్పించాలని అన్నారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, మంచినీరు, వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉంచాలని, అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి ప్రజలకు భరోసా కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందని అధికారులు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉండి ప్రతి కుటుంబానికి అవసరమైన సాయం అందించాలన్నారు. ఈ పర్యటనలో ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్టర్ జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ పాల్గొన్నారు. వరుసగా కురుస్తున్న అధిక వర్షాల కారణంగా ముంపునకు గురైన కామారెడ్డి పట్టణంలోని జి.ఆర్ కాలనీని మంత్రి స్వయంగా పరిశీలించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో రవాణా అంతరాయాలు, విద్యుత్ సమస్యలు, త్రాగునీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. సహాయక చర్యలు నిరంతరంగా కొనసాగుతాయన్నారు. ప్రభుత్వం, అధికారుల అప్రమత్తత వల్ల ప్రాణనష్టాన్ని నివారించగలిగామని, వరద ముంపులో చిక్కుకున్న చాలామందిని రక్షించామని సీఎం గారు వర్షాలు వరదల మీద వరుస సమీక్షలు నిర్వహిస్తూ మంత్రులను, అధికార యంత్రాంగాన్ని గైడ్ చేస్తున్నారన్నారు. అర్ధరాత్రి అకస్మాత్తుగా క్లౌడ్ బరస్ట్ జరగటం వల్ల వరద ఉధృతి పెరిగిందని, వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని అంచనావేస్తున్నామని బాధితులు ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందన్నారు. ప్రభుత్వం వరద బాధితులకు స్థానిక అధికారుల ద్వారా ఆహారాన్ని సరఫరా చేస్తున్నామని ప్రకృతి విపత్తుల సమయంలో రాజకీయాలు చేయకుండా ఎవరికి తోచినట్టుగా వారు బాధితులకు అండగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు దయచేసి పునరావాస కేంద్రాల్లోకి వెళ్లాలని కోరారు. ఎలాంటి విపత్కాల పరిస్థితులు తలెత్తిన ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగమంతా సిద్ధంగా ఉందన్నారు.

# సీఎస్ రామకృష్ణారావు సర్వీసు పొడిగింపు

**వచ్చే ఏడాది మార్చి వరకు కొనసాగింపే**



**హైదరాబాద్, ఆగస్టు 28:** తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామకృష్ణారావు సర్వీసును పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎస్ రామకృష్ణారావు పదవీకాలం ఈ నెల 31తో ముగియనుంది. పదవీ విరమణ చేయవలసి ఉండగా, ఆయన సర్వీసును పొడిగించాలని డీవోపీటీని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోరింది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు కేంద్రం మరో ఏడు నెలల పాటు రామకృష్ణారావు సర్వీసును పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీనితో 2026 మార్చి వరకు రామకృష్ణారావు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కొనసాగనున్నారు.

# పలురైళ్లు రద్దు.. పలు దారిమళ్లింపు

**హైదరాబాద్, ఆగస్టు 28:** తెలంగాణలో భారీ వర్షాల నేపథ్యంలో పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసింది. దీంతో పాటు కొన్ని రైళ్లు దారి మళ్లించినట్లు-, మరికొన్నింటిని పాక్షికంగా రద్దు చేసినట్లు- దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. 36 రైళ్లు రద్దు, 25 రైళ్లు దారి మళ్లింపు, 14 రైళ్లను పాక్షిక్షంగా రద్దు చేసినట్లు- ఆయన వివరించారు. కామారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురు-స్తున్నాయి. పలుచోట్ల రైలు మార్గంలో వరద నీరు ముంచెత్తింది. దీంతో రైల్వే శాఖ ఈ నిర్ణయం తీసుకుంది.

# నష్టాలపై ప్రాథమిక అంచనా వేయండి

**సంబంధిత శాఖల అధికారులకు సిఎస్ సూచన**

**హైదరాబాద్, ఆగస్ట్ 28:** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రాథమిక నివేదికను వెంటనే సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణారావు సంబంధిత శాఖల కార్యదర్శులను ఆదేశించారు. రాష్ట్రంలో గత కొద్దీ రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలవలన జరిగిన నష్టాలపై వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో గురువారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అరవింద్ కుమార్, వికాస్ రాజ్, సబ్యసాచి ఘోష్, ముఖ్య కార్యదర్శులు రాహుల్ బొజ్జ, రఘునందన్ రావు, శ్రీధర్ , పోలీస్ శాఖ ఉప మరియు అడిషనల్ డీజీ మహేష్ భగవత్ తదితర ఉన్నతాధికారులు ఈ టెలీ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రధానంగా నిర్మల్, కామారెడ్డి, మెదక్, సిరిసిల్ల జిల్లాలు అధికంగా నష్టాన్ని చవి చూశాయని, వీటితో పాటు- ఇతర జిల్లాల్లో కూడా గణనీయమైన నష్టం వాటిల్లిందని అన్నారు. ఈ నష్టాలకు సంబంధించి ప్రాథమిక నివేదికను వెంటనే సమర్పించాలన్నారు. ఈ ప్రాథమిక నివేదికలతో పాటు- జరిగిన నష్టాలను తెలియచేసే ఫోటోలు,వీడియో క్లిప్పింగులు, పత్రిక క్లిప్పింగులు కూడా జతపర్చాలని సి.ఎస్ పేర్కొన్నారు. వివిధ శాఖల కార్యదర్శులు, సంబంధిత జిల్లా కలెక్టర్లు నష్టాలపై పంపిన ఈ ప్రాథమిక నివేదికలను సంకలనం చేయాలని విపత్తుల నిర్వహణ శాఖ కు తెలిపారు. ఇప్పటికే పలు జిల్లాల్లో భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, చెరువులు, విద్యుత్ లైన్లను యుద్ధ ప్రాతిపదికన పునరుద్దరించాలని రామకృష్ణారావు ఆదేశించారు. వర్షాలు మరికొన్ని రోజులు వచ్చే అవకాశం ఉన్నందున మరింత అప్రమత్తతతో ఉండాలని స్పష్టం చేశారు. దురదృష్టవశాత్తు మరణించిన వారి కుటు-ంబాలకు నిబంధనలను అనుసరించి ఎక్స్ గ్రేషియా ను అందచేయాలని అన్నారు. గౌరవ ముఖ్యమంత్రివర్యులు పూర్తి స్థాయిలో సమీక్షించనున్నందున సంబంధిత శాఖలన్ని వివరాలతో, తీసుకున్న చర్యల నివేదికలతో సిద్ధంగా ఉండాలని కోరారు.

# ఆలస్యంగా విధులకు ఉద్యోగులు

**చర్యలు తప్పవని హెచ్చరించిన మంత్రి తుమ్మల**

**హైదరాబాద్, ఆగస్టు 28:** ఉద్యోగలు తరచూ ఆలస్యంగా విధులకు రావడంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయంలో తన మంత్రిత్వ శాఖ పరిధిలోని శాఖలు, కార్పోరేషన్ల ఉద్యోగుల హాజరుపై మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. ఉదయం 10.40 వరకు కూడా తమ విధులకు హాజరుకాక పోవడంపై మంత్రి తుమ్మల ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరుకాని ఉద్యోగుల నుండి వివరణ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రేపటి నుండి ఉద్యోగులంతా ఉదయం 10.30 గంటలకు వరకు విధులకు హాజరుకావాలని, హాజరుకాని ఉద్యోగులపై శాఖ పరమైన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఉద్యోగులంతా రైతులకు అందుబాటులో ఉండేవిధంగా పనిచేయాలని, రైతులకు కావాల్సిన టార్పలిన్లు అందుబాటులో ఉంచాలని, పంటలు తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. యూరియా పరిస్థితులపై సమీక్ష నిర్వహించిన మంత్రి.. రాష్ట్రానికి వస్తున్న యూరియాను డిమాండ్ ఎక్కువగా ఉన్న జిల్లాల వారిగా కేటాయించాలని, అలాగే నిన్న జిల్లాలలో కురిసిన భారీ వర్షాలకు జరిగిన పంట నష్టం వివరాలు త్వరగా సేకరించాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపిని ఆదేశించారు.




# ముఖ్యమంత్రి రేవంత్ నీరో చక్రవర్తి

- ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టింపులేదు
- వరదలు ముంచెత్తుతున్నా మూసీ, క్రీడలపై సమీక్షలా?
- సీఎంపై కేటీఆర్‌ఫైర్



**సిరిసిల్ల,ఆగస్టు 28 :** భారీ వర్షాల కారణంగా ప్రజలు ఇంత అవస్థలు పడుతుంటే సిఎం రేవంత్ రెడ్డికి పట్టింపులేనట్లుగా ఉందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. దోమకొండ చెరువు తెగిపోయి కామారెడ్డి రాకపోకలు నిలిచిపోయాయన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ సిరిసిల్లలో మీడియాతో మాట్లాడుతూ.. రోమ్ నగరం తగలపడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించినట్లుగా ఉందని, వరదలు ముంచెత్తుతుంటే మూసీ సుందరీకరణ గురించి, ఒలింపిక్స్ క్రీడల గురించి సమీక్ష చేస్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలో ఖమ్మంలో వరదలు వస్తే కూడా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 25 లక్షల చొప్పున పరిహారం ప్రకటించాలని, రైతులకు ఎకరాకు 25 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పనిచేయక పోయినా.. అధికారులు, పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని కెటిఆర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా వరదలు ముంచెత్తుతుంటే.. మూసీ సుందరీకరణపై సమీక్షనా.. అంటూ రేవంత్ రెడ్డిపై కేటీఆర్ నిప్పులు చెరిగారు. సిరిసిల్లలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రాబోయే నాలుగు రోజుల పాటు- వర్షాలు విస్తారంగా కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతుంది. ప్రస్తుతం పంట నష్టం ఎంత జరిగింది..? ఆస్తి, ప్రాణ నష్టం ఎంత జరిగింది? ఎంత మంది విపత్తుల్లో ఉన్నారు? అని చూడడం ముఖ్యమా అని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో మంచిర్యాల, భూపాలపల్లి జిల్లాల్లో వరదలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు హెలికాప్టర్‌లను పంపి సామాన్యుల ప్రాణాలను కాపాడడం జరిగింది. ఇవాళ మన రాష్ట్రానికి చెందిన హెలికాప్టర్లు బీహార్ ఎన్నికల ప్రచారంలో తిరుగుతున్నాయి. ఇంకా ఎక్కడెక్కడ్నో తిరుగుతున్నయ్ తప్ప సామాన్యులకు అందుబాటులో లేవు. ఖమ్మంలో వరదలు వస్తే పట్టించున్న నాథుడు లేడు. ముగ్గురు మంత్రులున్నా ఖమ్మం జిల్లాకు హెలికాప్టర్‌ను పంపలేదు. చివరకు ఇవాళ నర్మాలలో చిక్కుకున్న ఐదుగురిని ఎన్డీఆర్ఎఫ్ హెలికాప్టర్ వచ్చి కాపాడింది. ఒక వ్యక్తి వరదలో కొట్టుకుపోయాడు. కొంత ఆస్తి నష్టం, పంట నష్టం కూడా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని ఉంటే ఇంత నష్టం జరిగి ఉండకపోయేది. ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక లేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని ఎక్కడైతే పంట నష్టం జరిగిందో అక్కడ ఎకరానికి రూ. 25 వేలు పరిహారం ఇవ్వాలి. ప్రాణ నష్టం జరిగిన కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలి. కూలిపోయిన ఇండ్లకు వాటి స్థానంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో మా నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా పర్యటిస్తూ సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారని కేటీ-ఆర్ పేర్కొన్నారు. వరద బాధితులకు ఆహారం, వైద్య సదుపాయాలు అందించేందుకు కృషి చేస్తున్నాం. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజలను ఆదుకునే ప్రయత్నం చేస్తాం. రెవెన్యూ, పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా వారిని అభినందిస్తున్నానని కేటీఆర్ తెలిపారు.

## సంపాదకీయం



# కేసుల విచారణ.. తీర్పుల్లోనూ గడువు విధించాలి!

మన న్యాయవ్యవస్థ ఇంకా బ్రిటిష్ కాలంనాటి పరిస్థితులకు అనుగుణంగానే సాగుతోంది. న్యాయ వ్యవస్థతో పాటు చట్టాలు, శిక్షల్లో భారతీయీకరణ జరగాల్సి ఉంది. కొత్త చట్టాలు ప్రవేశ పెట్టిన దరిమిలా దీనిపై చర్చ చేయాలి. రాజకీయ నాయకుల నేరాలకు సంబంధించి ఇటీవల పార్లమెంటులో రాజ్యాంగ సవరణ ప్రవేశ పెట్టిన దరిమిలా అనేక అంశాలపై చర్చించాలి. అలాగే గవర్నర్లు, రాష్ట్రపతి బిల్లుల ఆమోదంలో కాల పరిమితి విధించిన సుప్రీం కోర్టు, తన విషయంలోనూ పరిమితి విధించుకోవాలి. ఏళ్ల తరబడి కేసులు నడవడం, తీర్పులు వచ్చే సరికి కొందరు మరణించడం జరుగుతోంది. ఒక్కో కేసు పరిమిత కాలంలో ముగించేలా సంస్కరణలు రావాలి. ఏ కేసయినా ఏడాదికి మించకుండా చూడాలి. సిబిఐ, ఇడి దాడుల కేసుల్లో కూడా సత్వర విచారణ జరగడం లేదు. ఎపికి సంబంధించి వివేకా హత్య కేసు ఆరేడేళ్లుగా ఎటూ తేలలేదు. సిబిఐ విచారణ జరిపినా దోషులు ఎవ్వరన్నది తేల్చలేదు. ఇకపోతే జగన్ ఐదేళ్లు బెయిల్ మీద ఉంటూ పాలన చేశారు. అనేక కేసులు ఇంకా కొలిక్కి రాలేదు. కెసిఆర్ అవినీతిపై విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ ఎలూ తేల్చలేదు. సత్వరంగా కేసులను విచారించి దోషులకు కేసు పడేలా చేయాలి. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేసులో పరస్పర విరుద్ధ తీర్పులు ఇవ్వడమే గాకుండా 17 ఏళ్లుగా కోర్టులో నానింది. రాజకీయ నాయకుల కేసుల విషయంలో మరీ త్వరగా తీర్పులు రావాలి.ఎందుకంటే పెరుగుతున్న నేరాలు, కొత్తకొత్త మోసాలు, ఐటి మోసాలు, అత్యాచారాలు వంటి వాటిని పరిశీలించి చట్టాల ను మార్పు చేసుకోవాల్సి ఉంది. హత్యాచారం ఘటనలు మళ్లీ మ్లీ జరుగుతూనే ఉన్నాయి. అత్యాచారాలపై ప్రజల్లో భయం లేకుండా పోతున్నది. లిక్కర్ కేసులో సత్వర విచారణ సాగడం లేదు. నేతల అవినీతిపైనా విచారణ సాగడం లేదు. ఇప్పటివరకు పనిచేసిన న్యాయమూర్తులు ఆయా సందర్భాల్లో తమ విలువైన సూచనలు చేశారు. వాటిని సలహాలుగా తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగాలి. ప్రజలకు ఏంచేస్తే సత్వర న్యాయం అందుతుందో ఆలోచించాలి. అవసరమైతే మాజీ ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తుల సలహాలు తీసుకోవాలి. ప్రతిపేదవాడికి న్యాయం అందించడమే న్యాయమూర్తి ప్రధాన లక్ష్యం కావాలి. దేశంలో న్యాయం పట్ల జరుగుతున్న ఆలస్యాన్ని గుర్తించి సత్వర న్యాయం అందేందుకు అసవరమైన చర్యలను చేపట్టాలి. నిర్ణిత కాలంలోగా న్యాయ విచారణలు, తీర్పులు వచ్చేలా నట్టబద్ధం చేసుకోవాలి. ఇదే సందర్భంలో పెండింగ్ కేసులు సమస్యగా మారాయని కూడా గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలి. ప్రతి తీర్పులోనూ ప్రజలకు న్యాయం జరిగిందన్న భావన కలగించాలి. రాజకీయ నాయకుల కేసుల విషయంలో త్వరగా విచారణ జరిపి శిక్షలు వేస్తే మంచిది. కోర్టు తీర్పులను అమలు చేయని ప్రభుత్వాలపై కఠిన చర్యలకు అవకాశం ఉండాలి. ఇటీవల పలువురు సుప్రీం చీఫ్ జస్టిస్‌లుగా పనిచేసిన వారు న్యాయవ్యవస్థలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇవన్నీ కూడా పేదలకు సత్వర న్యాయం అందాలన్న తపనతో చేసినవే తప్ప మరోటి కాదు. భారత న్యాయ వ్యవస్థ సాధారణ ప్రజలకు ఎంతో దూరంలో నిలిచిందన్న ఆరోపణల్లో వాస్తవాలను గుర్తించాలి. ఇప్పటికీ కోట్ల మంది అణగారిన వర్గాల ప్రజలకు న్యాయ సహాయం అవసరం ఉంది. తమకు అన్యాయం జరిగిందని భావించిన ప్రతి వారూ కోర్టులకు వెళ్లడం లేదు. ఎందుకంటే కోర్టులకు వెళితే తేలేదేమీ లేకపోగా అనవసర కాలయాపన, డబ్బులు దండగ అన్న భావనలో ప్రజలు ఉన్నారు. అవసరమైన వెంటనే న్యాయ వ్యవస్థను ఆశ్రయించడానికి ఇంకా వారు జంకుతూనే ఉన్నారు. న్యాయవ్యవస్థ రాజ్యాంగబద్ధమైన విధులు నిర్వర్తి స్తున్నప్పటికీ నిర్ణీత కాలవ్య వధిలో కోర్టుల్లో కేసులు తేలడంలేదు. తీర్పులు వచ్చాక అమలు కావడం లేదు.అంబేద్కర్ మహాశయుడి ఆలోచనలకు అందని విధంగా మన రాజకీయాలు మారుతున్నాయి. సామాన్యులకు న్యాయం అందకుండా పోతోంది. నిరంతరం రాజకీయ కేసులు తప్ప సామాన్యుల పక్షాన న్యాయవ్యవస్థ బలంగా నిలబడడం లేదు. నేటికీ ఎందరో చేయని నేరాలకు జైళ్లలో మగ్గుతున్నారు. ఇలాంటి వారిని ఎలా బయటకు తీసకుని వస్తారన్నది కూడా ముఖ్యం. అలాగే ఎలాంటి కేసునైనా కనీసం 3నెలల్లో ముగించి తీర్పును ఇచ్చేలా కఠిన చట్టాలను అమలు చేయాలి. తెలంగాణలో పలువురు ఎమ్మెల్యేలపై అనర్హత కేసును మూడు నెలల్లో తేల్చాలని సుప్రీం ఆదేశించింది. నిజానికి ఎన్నికలయిన ఓ నెలరోజుల్లోగా ఎన్నికైన ప్రజాప్రతినిధులపై ఏవైనా కేసులు ఉంటే తేల్చేయాలి. ఏళ్లతరబడి కేసునలు నాన్చేయడం వల్ల ఐదేళ్ల పుణ్యకాలం గడిచిపోతోంది. చిట్టచివరకు ఎన్నికల ముందు తీర్పులు వ్యతిరేకంగా వచ్చినా చేయగలిగేది ఏమీ లేదు. కనుక వీటిపైనా దృష్టి సారించాల్సి ఉంది. న్యాయవ్యవస్థలో సమూల మార్పులు జరగాలని గుర్తు చేసుకోవాలి. ప్రధానంగా స్థానిక భాషల్లో కోర్టు కార్యకలాలపాలు సాగాలి. కోర్టుల్లో న్యాయ చర్చలను స్థానిక భాషల్లో చర్చించేలా చట్టం చేసుకోవాలి. గతంలో ప్రధాని మోడీ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. కాబట్టి ఇప్పుడీ విషయంపై చర్చించాల్సిన అవసరం ఉంది. ప్రజలకు అర్థంకాని భాషలో కాకుండా ప్రజలకు అర్థం అయ్యే భాషలో న్యాయచర్చలు సాగాలి. కోర్టుతీర్పులు స్థానిక భాషల్లో విడుదల చేయాలి. పాలకులు పేదలకు న్యాయన్ని చేరువ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలి. అనేక సంస్కరణలు తీసుకుని వచ్చామని చెబుతున్న ప్రధాని మోడీ ఈ న్యాయవ్యవస్థలో ఉన్న లోటుపాట్లను గుర్తించి తక్షణ చర్యలకు పూనుకోవాలి. పార్లమెంట్ వేదికగా దీనికి శాశ్వత పరిష్కారం చూపాలి. వివేకానందరెడ్డి హ్యాతకేసు, కోడికత్తి కేసులు తీసుకుంటే ఎంతలా జాప్యం జరుగుతుందో చూడవచ్చు. పోలీసుల విచారణలో జాప్యం.. కోర్టుల్లో జాప్యం వంటివన్నీ పోవాలి. కేసు తీవ్రతను బట్టి సత్వర విచారణ, తీర్పులు రావాలి. ఇందుకు అవసరమైతే.. మనదేశం వేల ఏళ్లుగా అనుసరించిన రాజ్యాంగ వ్యవస్థలను, న్యాయవ్యవస్థలను, ఇతర దేశాల్లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలి. నిజానికి కోర్టులు, రాజ్యాంగం పట్ల ప్రజలకు సరైన అవగాహన లేదు. ప్రజలను కోర్టులకు చేరువ చేయడం రాజ్యాంగ విధి కావాలి. రాజ్యాంగం అంటే పాలకులకు సంబంధించిన వ్యవహారంగా ఉండరాదు. న్యాయ వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు, విశ్వాసం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి. ప్రజలకు న్యాయవ్యవస్థ పట్ల విశ్వాసం కలిగించాలి. లోకల్ కోర్టులను పెంచి సత్వర న్యాయం కలిగించాలి. మన న్యాయవ్యవస్థ, ప్రొసీడింగ్స్ ఇంకా ఆంగ్లేయులనాటి విధానాలనే అవలంబిస్తోందన్న ఆరోపణల నుంచి బయటపడి పటిష్టమైన న్యాయ చట్టాలను రూపొందిం చాలి. దీనిని ప్రాతిపదికగా తీసుకుని మన పాలకులు న్యాయవ్యవస్థలో సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి. సత్వర న్యాం అందడం కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి. ఎలాంటి కేసయినా ఓ యేడాదిలోగా ముగిస్తే మంచిదన్న భావనలో విచారణలు సాగాలి.

# వరద బాధితులను ఆదుకుంటాం

- పంట నష్టపోయిన రైతులకు అండగా ఉంటాం
- కేంద్రం నుంచి తక్షణ సాయం పొందేలా చర్యలు
- వరద నష్టంపై వెంటనే నివేదికలు రూపొందించాలి
- మెదక్‌లో సమీక్షించిన సిఎం



**మెదక్,ఆగస్ట్ 28:** వరదల్లో చిక్కుకొని మృతిచెందిన బాధిత కుటుంబాలకు, పంట నష్టపోయిన రైతులకు సహాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీనిచ్చారు. పరిహారానికి సంబంధించి పూర్తి నివేదికలను సిద్ధం చేయాలని ఫోన్‌లో చీఫ్ సెక్రటరీకి ఆదేశాలు ఇచ్చారు. వర్షాలు- వరదలపై మెదక్ ఎస్పీ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. కేంద్రం నుంచి అత్యవసరంగా నిధులు కోరేలా రిపోర్ట్ తయారు చేయాలని జిల్లా అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. వరద తగ్గగానే పంట నష్టంపై క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక తయారు చేయాలని ఆజ్ఞాపించారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల భవనాలను గుర్తించి, వాటిల్లో ఉన్న విద్యార్థులను వేరే చోటకు మార్చాలని సూచించారు. రామాయంపేట ఎస్సీ మహిళా డిగ్రీ కళాశాలకు పక్కా భవనం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు, వరదల నేపథ్యంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరదల్లో నష్టపోయిన వారిని ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుం దని హామీనిచ్చారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క కూడా వరదలపై సమీక్షించారు. కామారెడ్డిలో జరిగింది ప్రకృతి విపత్తని, వర్షాలు తగ్గగానే పంట నష్టాన్ని అంచనా వేసి అందరినీ ఆందుకుంటామని అన్నారు. నష్టంపై సీఎంకు నివేదిక ఇస్తామని, కేంద్రం కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రెండు, మూడ్రోజుల్లో రవాణా మెరుగుపరుస్తామని మంత్రి సీతక్క తెలిపారు. కాగా, వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి బృందం పెద్దపల్లి, మెదక్ జిల్లాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. కామారెడ్డిలోనూ పర్యటించాల్సి ఉండగా.. చివరి నిమిషంలో పర్యటన రద్దు అయ్యింది.



# 20 ఏళ్లలో ఎప్పుడూ ఇంతటి వర్షం చూడలేదు

### సిద్దిపేటలో భారీ వర్షంతో కాలనీల్లోకి నీరు

### ముంపుప్రాంతాల్లో హరీష్ రావు పర్యటన

**సిద్దిపేట, ఆగస్టు 28:** గత 20 సంవత్సరాలలో సిద్దిపేటలో ఇలాంటి వర్షం ఎప్పుడు పడలేదని బిఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలో కురిసిన వర్షాలకు కోమటి చెరువు నాల వరద ఉధృతికి గురైన ముంపు ప్రాంతాలు శ్రీనగర్ కాలనీ, శ్రీనివాస్ నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. క్షేత్రస్థాయి లో పర్యటించి చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ను, మున్సిపల్ అధికారులను హరీష్ రావు ఆదేశించారు. సిద్దిపేట పట్టణ కేంద్రంలో లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. తొగుట మండలంలో 20 సెంటీమీటర్ల వర్షం పడి ప్రజలు ఇబ్బంది పడ్డారని బిఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు తెలిపారు. ఈ సందర్భంగా హరీష్ రావు సిద్దిపేటలో మీడియాతో మాట్లాడుతూ.. భారీ వర్షం వల్ల సిద్దిపేటలో పలు కాలనీలు జలమయమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేటలో వచ్చిన వరదను తగ్గించడానికి నర్సాపూర్ చెరువుకు ఒక మీటర్ తొలిగించామని, నర్సాపూర్ చెరువు నీటిని శనిగరం వాగు, మందపల్లి వాగు వైపు నీళ్లు మళ్లించామని తెలియజేశారు. భవిష్యత్తులో వరద వచ్చినపుడు ఎలా చర్యలు చేపట్టాలో ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికలు చేయాలని సూచించడం జరిగిందని, ప్రజలు కూడా సహకరించాలని నాలాలు కబ్జాలు చేసి సెట్ బ్యాక్ లేకుండా ఇల్లు కట్టడం వల్ల ఇలాంటి ఇబ్బందులు వస్తాయని హెచ్చరించారు. నాలాలు కబ్జాలు చేసి ఇల్లు నిర్మించుకున్నాక వరదలు వస్తే బాధపడితే ఎలా? అని లోతట్టు- ప్రాంతాలలో తక్కువ ధరకు వస్తున్నాయని ఇల్లు నిర్మాణం విషయంలో ప్రజలు ఆలోచించు కోవాలని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు సెట్ బ్యాక్ లేకుండా ఇల్లు నిర్మించుకోకూడదని చెప్పారు. లోతట్టు- ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు పరవేక్షణ చేయాలని సూచించారు. ప్రజలు ఆందోళన చెందొద్దు అని హరీష్ రావు తెలిపారు.

# ప్రతి జంటా ముగ్గురు పిల్లలను కనాలి

### జనాభా తగ్గకుండా కాపాడుకోవాలి

### ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్



**న్యూఢిల్లీ,ఆగస్ట్28 :** ప్రతి భారతీయ జంటకు ముగ్గురు పిల్లలు ఉండాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. ప్రతి మహిళకు 2.1 మంది పిల్లలు అనే ప్రత్యామ్నాయ జనన రేటును ఆయన వెల్లడించారు. గురువారం ఆయన ఢిల్లీలో విలేకరుల సమావేశంలో జనాభా అంశంపై మాట్లాడారు. మూడు కంటే తక్కువ జనన రేటు ఉన్న సమాజాలు నెమ్మదిగా అంతరించిపోతున్నాయని నిపుణులు చెబుతున్నారని భగవత్ అన్నారు. కావున, మూడు కంటే ఎక్కువ జనన రేటును కొనసాగించాలని, ఇది అన్ని దేశాలలో జరుగుతోందని మోహన్ భగవత్ అన్నారు. సరైన వయస్సులో వివాహం చేసుకుని, ముగ్గురు పిల్లలను కనడం వల్ల తల్లిదండ్రులు, పిల్లలు ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు చెబుతున్నారు. ముగ్గురు తోబుట్టువులు ఉన్న ఇళ్లలోని పిల్లలు చక్కని నడవడిక నేర్చుకుంటారు. భవిష్యత్తులో వారి కుటుంబ జీవితంలో ఎటువంటి ఆటంకాలు ఉండవు. వైద్యులు చెప్పింది ఇదే... మన దేశ జనాభా 2.1 జనన రేటును సిఫార్సు చేస్తోంది. ప్రతి భారతీయ జంట, దేశ ప్రయోజనాల దృష్ట్యా ముగ్గురు పిల్లలను కనడానికి ప్రయత్నించాలని అయితే, దీనిలో ఒక ఆందోళనకరమైన అంశం ఉంది. జనాభా ఒక వరం కావచ్చు లేదా భారం కూడా కావచ్చు. అందరికీ ఆహారం పెట్టాలి. అందుకే జనాభా విధానం ఉంది. కావున, జనాభా నియంత్రణలో ఉండేలా చూసుకోవడానికి అదే సమయంలో తగినంతగా ఉండేలా చూసుకోవడానికి ప్రతి కుటుంబానికి ముగ్గురు పిల్లలు ఉండాలి. కానీ అంతకంటే ఎక్కువ మంది ఉండకూడదు. వారి పెంపకం సరిగ్గా ఉండేలా చూసుకోవడానికి ఇది అందరూ అంగీకరించాల్సిన విషయం అని అన్నారు.

# చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకోవాలి

### వరదనష్ట బాధితులకు తోణ సాయం అందించాలి

### పునరావాస బాధితులను పరామర్శించిన రఘునందన్

**మెదక్,ఆగస్ట్28:** వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. వరదల్లో నష్టపోయిన వారిని కూడా ఆదుకోవాలన్నారు. విద్యుత్ పునరుద్ధరణ పనులు తోణం చేపట్టాలన్నారు. మెదక్‌లోని జీకేఆర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో వరద బాధితులను పరామర్శించిన అనంతరం మాట్లాడారు. పోచారంలో ఇద్దరు వ్యక్తులు గల్లంతయ్యారు. వారిలో ఒకరి మృతదేహం లభ్యమైంది.. మరొకరి కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు గాలిస్తున్నాయి. మెదక్‌జిల్లాలో పునరుద్ధరణ పనుల కోసం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వివేక్ రూ. కోటి వరద సాయం ప్రకటించారు.అనేక మంది ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులయ్యారు. లోతట్టు ప్రాంతాలన్నీ ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. విపత్తు సాయం పెంచాలని, మృతుల కుటుంబాలకు రూ.50లక్షల చొప్పున పరిహారం, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేసారు. రాష్ట్ర ప్రభుత్వం హెలికాప్టర్ పంపడంలో ఆలస్యం కావడం వల్లే ఆ ఇద్దరు చనిపోయారని గ్రామస్థులు బాధపడుతున్నారు.



# భారీ వర్షాలతో రోడ్లకు గండ్లు

### తక్షణ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి : మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్,ఆగస్ట్28:** భారీ వర్షాలతో పలుచోట్ల రోడ్లకు గండ్లు పడ్డందున, రోడ్లు దెబ్బతిన్న ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, తక్షణ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆర్ అండ్ బి అధికారులను అలెర్ట్ గా ఉండాలని ఆదేశించారు. గురువారం నాడు ఆర్ అండ్ బి అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్ర స్థాయి పరిస్థితులను ఆర్ అండ్ బి శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి, సిరిసిల్ల, నిర్మల్ జిల్లాల్లో పరిస్థితులపై సమీక్షించిన మంత్రి, కాజ్ వే లు, కల్వర్టులు, బ్రిడ్జిలు, కోతకు గురైన రోడ్ల వివరాలు అధికారులను అడిగితెలుసుకున్నారు. అదేవిధంగా ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా చూడాలని, తెగిన రోడ్లు, కల్వర్టుల వద్ద వర్షాలు తగ్గుముఖం పట్టగానే తాత్కాలిక మరమ్మతులు చేపడతామన్నారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపు చేయాలని అధికారులకు సూచించారు. ప్రాణ నష్టం జరగకుండా పోలీస్, ఎలక్ట్రిసిటీ-, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. డైన రోడ్లు, వంతెనలకు సంబంధించి శాశ్వత నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఆర్ అండ్ బి హెడ్ ఆఫీస్ లో కంట్రోల్ సెంటర్ కు వస్తున్న ఫిర్యాదులు,



సమాచార వివరాలపై మంత్రి ఆరా తీయగా.. స్టేట్ రోడ్స్ సి.ఈ ఆధ్వర్యంలో షిఫ్టుకు నలుగురు చొప్పున 24 గంటలు మానిటరింగ్ చేస్తున్నట్లు- చెప్పారు. మొత్తంగా 206 చోట్ల సిడి వర్క్స్ దెబ్బతిన్నాయని, రోడ్లు, కాజ్ వే,మైనర్ బ్రిడ్జిలు, కల్వర్టులు తాత్కాలికంగా, శాశ్వతంగా పునరుద్ధరించాలని ప్రాథమికంగా గుర్తించినట్లు- పేర్కొన్నారు. తాత్కాలిక పునరుద్ధరణకు 53.76 కోట్లు- వరకు ఖర్చు అవుతుందని, శాశ్వత పునరుద్ధరణ కోసం 1157.46 కోట్లు- అవసరమవుతాయని అంచనా వేసినట్లు- పేర్కొన్నారు.

# ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కార్డు

మొదటి పేజీ తరువాయి

పథకాలను సంతృప్తి స్థాయిలో అందించాలి. అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించాలి. ప్రతి కుటుంబానికి ఒక ఫ్యామిలీ స్కోరు కేటాయించాలి. ఆయా కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోన్న ప్రయోజనాలపై పారదర్శకంగా ఉండాలి. దీని కోసం ఫ్యామిలీ కార్డును తీసుకురండి. ప్రతి కుటుంబానికి ఆ ఫ్యామిలీ కార్డు అందించాలి. ప్రభుత్వ పథకాలను ఆ ఫ్యామిలీ కార్డులో పొందుపర్చడంతో పాటు... పూర్తి వివరాలు ఆ కార్డులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. అంతే కాకుండా... కుటుంబంలో ఎంత మంది ఉంటే.. వారందరికీ ఆ కార్డును ఇస్తే.. ఆధార్ కార్డు తరహాలో వారి అవసరాలకు ఉపయోగించుకుంటారు. ఆ కుటుంబాలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయాలి" అని సీఎం సూచించారు. "క్షేత్ర స్థాయిలో వివిధ అంశాలకు సంబంధించిన సమాచారం ప్రభుత్వం వద్ద పూర్తి స్థాయిలో ఉండాలి. ప్రతి శాఖకు సంబంధించిన సమాచారాన్ని క్రోడీకరించుకోవాలి.. వాటిని అనుసంధానం చేసుకోవాలి. అప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలం. పదే పదే డేటా గురించి, డేటా అనుసంధానం గురించి మాట్లాడ్డానికి బలమైన కారణం ఉంది. క్షేత్ర స్థాయికి సంబంధించిన పక్కా సమాచారం ప్రభుత్వం వద్ద ఉంటే.. దానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవచ్చు. ఇప్పుడు సోషల్ రీ-ఇంజినీరింగ్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. బీసీ, ఎస్సీల్లో ఉన్న కొన్ని కులాలు చాలా వెనుకబడి ఉన్నాయి. ఆర్థికంగా,



సామాజికంగా, రాజకీయంగా వారికి లబ్ధి అందడం లేదు. ఓసీల్లో కూడా ఇంకా ఆర్థికంగా వెనుకబడి వారున్నారు. వారి అవసరాలను గుర్తించాలి. అలాంటి వారిని గుర్తించాలన్నా... వారి వెనుకబాటుతనాన్ని రూపుమాపాలన్నా... సమాచారం అవసరం. రాజకీయంగా పార్టీ యంత్రాంగం నుంచి నేను చేయాల్సింది చేస్తున్నాను. వారిని ఆర్థికంగా, సామాజికంగా ఆదుకోవాలంటే ప్రభుత్వ యంత్రాంగం సమర్థవంతంగా పని చేయాలి. దాని కోసమే సమాచారాన్ని అనుసంధానించే అంశం మీద ఫోకస్ పెట్టాలని చెబుతున్నాను" అని చంద్రబాబు వెల్లడించారు. "ప్రజలే ఆస్తి. వారి ద్వారానే రాష్ట్రాభివృద్ధి, దేశాభివృద్ధి. జనాభా పెరిగితే... సంపద పెరిగే రోజులు వచ్చాయి. ఇది కొనసాగాలంటే.. చక్కటి కుటుంబ వ్యవస్థ ఉండాలి. కలిసి ఉంటే కలదు సుఖం అనే మన సంస్కృతిని మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. కానీ ప్రభుత్వ పథకాల కోసం కుటుంబాలు విడిపోయే పరిస్థితి కొన్ని చోట్ల కనిపిస్తోంది. అలా జరగడం బాధాకరం. ప్రతి కుటుంబ సంతోషాన్ని కోరుకుంటున్న ప్రభుత్వమిది. పథకాల కోసం కుటుంబాలు విచ్ఛిన్నమయ్యే పరిస్థితిని తప్పించాలని భావిస్తున్నాం. దీని కోసం పాపులేషన్ పాలసీని త్వరలో తెస్తాం. అధికారులు ఆ దిశగా కసరత్తు చేయాలి. ఉమ్మడి కుటుంబాలు ఉంటే.. పథకాలు రావనే ఆందోళన లేకుండా ఉండేందుకు అవసరమైతే ప్రభుత్వ సంక్షేమ పథకాలను రీ-డిజైన్ చేస్తాం. లబ్దిదారులకు మరింత మేలు చేకూర్చడంతోపాటు... కుటుంబాలు విడిపోకుండా చూస్తాం" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్ విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక ప్రాజెక్టులకు ఫాస్ట్ ట్రాక్

- ఏరో స్పేస్, ఐటీ, ఇంధనం, ఫుడ్ ప్రాసెసింగ్, ఎంఎస్ఎంఈ రంగాల్లో పెట్టుబడులు
- రూ.53,922 కోట్ల మేర పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం
- ఈ ప్రాజెక్టులతో 83,437 మందికి ఉద్యోగ అవకాశాలు
- నవంబర్ 15లోగా ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు
- బిజినెస్ సెంటర్ల తరహాలో పారిశ్రామిక పార్కులతో ఎకో సిస్టం
- చంద్రబాబు అధ్యక్షతన 10వ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం

అమరావతి: రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్న పారిశ్రామిక ప్రాజెక్టులు ఫాస్ట్ ట్రాక్ లో పూర్తి కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో త్వరగా అనుమతులిస్తున్నామని... అదే తరహాలో ప్రాజెక్టుల గ్రౌండింగ్ కూడా అంతే వేగంగా జరిగేలా చూడాలని సీఎం ఆదేశించారు. సచివాలయంలో గురువారం సీఎం అధ్యక్షతన 10వ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశమైంది. రూ. 53922 కోట్ల మేర పెట్టుబడులు పెట్టే 30 ప్రాజెక్టులకు సీఎం ఆధ్వర్యంలోని ఎస్ఐపీబీ ఆమోదించింది. ఈ ప్రాజెక్టుల ద్వారా 83,437 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న ప్రాజెక్టుల పురోగతిపై ఇక నుంచి ప్రతీ నెలా సమీక్షిస్తానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుల్లో స్థితిగతులపై క్షేత్రస్థాయిలో మంత్రులు కూడా పరిశీలించాలని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ అనుమతులిచ్చిన ప్రాజెక్టుల వివరాలను, ఉత్పత్తి ప్రారంభించేందుకు ఎంత సమయం పట్టిందన్న అంశాలను విశ్లేషించాలని సీఎం సూచించారు. ఏ ప్రాజెక్టు అయినా ఆలస్యం అవుతుంటే సంబంధిత సంస్థల ప్రతినిధులతో మాట్లాడి పనులు వేగంగా పూర్తి చేసేలా చూడాలన్నారు. రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అమలు చేస్తున్నామని.. అధికారులు కూడా అదే వేగంతో పనిచేయాలని సూచించారు. మహింద్రా ఈవీ వాహనాల ఉత్పత్తి ప్లాంట్ ను ఏపీలో ఏర్పాటు చేసేలా తానే స్వయంగా సంప్రదిస్తున్నానని.. దీనికి అనుగుణంగా అధికారులూ స్పందించాలని సీఎం అన్నారు.

**ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలదే ప్రధాన భూమిక**

వ్యవసాయ ఆధారిత రాష్ట్రమైన ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలే కీలకమని.. వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపుతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇవి ప్రధాన భూమిక పోషిస్తాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హార్టీకల్చర్ హబ్ గా రాయలసీమతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు పుష్కలంగా అవకాశాలున్నాయని అన్నారు. పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించేందుకు అధికారులు ప్రముఖ కంపెనీలతో సంప్రదింపులు చేయాలని సీఎం సూచించారు. చిత్తూరు, అన్నమయ్య తదితర జిల్లాల్లో స్థానికంగా ఉన్న మ్యాంగో ప్రాసెసింగ్ పరిశ్రమల వల్లే రైతులకు ఎక్కువ ఇబ్బంది లేకుండా చూడగలిగామని అన్నారు. పొరుగున తమిళనాడు, కర్ణాటకలలో ఈ తరహా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు లేవన్నారు.

**బిజినెస్ సెంటర్ల తరహాలో ఎంఎస్ఎం ఈ పార్కులతో ఎకో సిస్టం**

రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు పూర్తి కావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇప్పటికే ప్రారంభించిన ప్రాంతాల్లో మినహా మిగతా నియోజకవర్గాల్లో మూడు నెలల్లో ఈ పార్కులు అందుబాటులోకి రావాలన్నారు. ఈ పారిశ్రామిక పార్కులన్నీ బిజినెస్ సెంటర్లలా చేసి.. ఒక ఎకో సిస్టంను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతులు, భూ యజమానుల్ని కూడా ఈ పారిశ్రామిక పార్కుల్లో భాగస్వాములను చేయాలని సీఎం స్పష్టం చేశారు. తద్వారా వారికి ఆదాయం వచ్చేలా చేయాలని అన్నారు. అలాగే రాష్ట్రంలో మెగా, మీడియం స్థాయిలో పారిశ్రామిక పార్కులను నియోజకవర్గాల వారీగా మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. ఈ పారిశ్రామిక పార్కులకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్లను అనుసంధానించటంతో పాటు వాటికి ప్రామాణిక మార్గదర్శకాలను నిర్దేశించాలన్నారు.



పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో ఆర్టీఐహెచ్ ద్వారా జరిగే కార్యకలాపాలను సమీక్షించాలని సీఎం సూచించారు. మరోవైపు రాష్ట్రంలోని ఆటోనగర్ లలో రెడ్, ఆరెంజ్ కేటగిరీ పరిశ్రమలకు తదుపరి అనుమతులు రాకపోవటంపై సమీక్షించిన సీఎం దీనికి తగిన కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. ఏపీకి పరిశ్రమలు రావటం ముఖ్యమన్న సీఎం.. ఇంధన ఉత్పత్తి, ఐటీ, టూరిజం, ఫుడ్ ప్రాసెసింగ్, మైనింగ్ ఆధారిత వాల్యూ చైన్ పరిశ్రమల్లో పెట్టుబడులు రావాల్సి ఉందన్నారు. అలాగే ఐటీ రంగంలో వర్క్ ఫ్రమ్ హోమ్, కో-వర్కింగ్ స్పేస్ లను ఏర్పాటు చేయాలన్నారు. మరోవైపు గత పాలకులు తిరుపతి వేంకటేశ్వరస్వామి ఏడుకొండల పవిత్రతను దెబ్బతీసేలా ప్రవర్తించారని.. కొండను ఆనుకుని హోటల్ నిర్మాణానికి స్థలం కేటాయించిందన్నారు. కూటమి అధికారంలోకి రాగానే భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయంగా స్థలం చూపామని అన్నారు. దీనిపై కొందరు దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని సీఎం వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, వాసంశెట్టి సుభాష్, సీఎస్ కె.విజయానంద్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**10వ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదించిన ప్రాజెక్టులు**

1. మథర్ డెయిరీ లిమిటెడ్ రూ.427 కోట్లు పెట్టుబడులు, 180 మందికి ఉద్యోగాలు, చిత్తూరు జిల్లా.
2. ఏసీఈ ఇంటర్నేషనల్ లిమిటెడ్ రూ.786 కోట్ల పెట్టుబడులు, 1000 మందికి ఉద్యోగాలు, చిత్తూరు జిల్లా.
3. అపోలో టైర్స్ రూ.1110 కోట్ల పెట్టుబుడులు, 500 మందికి ఉద్యోగాలు, చిత్తూరు జిల్లా.
4. స్కై రూట్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.400 కోట్ల పెట్టుబుడలు, 300 మందికి ఉద్యోగాలు, తిరుపతి.
5. హెచ్ఎఫ్‌సీఎల్ రూ.1197 కోట్ల పెట్టుబడులు, 870 మందికి ఉద్యోగాలు, మడకశిర.
6. వరాహ్ ఆక్వా ఫార్మ్స్ రూ.32 కోట్ల పెట్టుబడులు, 3,500 మందికి ఉద్యోగాలు, అనకాపల్లి.
7. జె.కుమార్ ఇన్ ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ రూ.237 కోట్ల పెట్టుబడులు, 5000 మందికి ఉద్యోగాలు, విశాఖపట్నం.
8. అలీప్ సంస్థ, రూ.45 కోట్ల పెట్టుబడులు, 2,500 మందికి ఉద్యోగాలు, చిత్తూరు.
9. ఇఫ్కో కిసాన్ సెజ్ రూ.870 కోట్ల పెట్టుబడులు, 25,000 మందికి ఉద్యోగాలు, నెల్లూరు.
10. ధీరూభాయ్ అంబానీ గ్రీన్ టెక్ పార్క్ రూ.1843 కోట్ల పెట్టుబడులు, 19,000 ఉద్యోగాలు, కృష్ణపట్నం.
11. ఎన్.కామ్ వైజాగ్ హోటల్ రూ.178 కోట్ల పెట్టుబడులు, 250 మందికి ఉద్యోగాలు, భోగాపురం.
12. మంజీరా హాస్పిటాలిటీ, రూ.276 కోట్ల పెట్టుబడులు, 225 మందికి ఉద్యోగాలు, అమరావతి.
13. శ్రీ వెంకటేశ్వర లాడ్జి రూ.96 కోట్ల పెట్టుబడులు, 300 మందికి ఉద్యోగాలు, మంత్రాలయం.
14. సోలార్ ఎనర్జీ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) రూ.1500 కోట్ల పెట్టుబడులు, 950 మందికి ఉద్యోగాలు, కొలిమిగుండ్ల, నంద్యాల జిల్లా.
15. సోలార్ ఎనర్జీ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా రూ.800 కోట్లు, 200 మందికి ఉద్యోగాలు, రామగిరి, ముత్తవకుంట్ల, సత్యసాయి జిల్లా.
16. సెరెంటికా రెన్యూవబుల్స్ ఆఫ్ ఇండియా రూ.2000 కోట్లు పెట్టుబడులు, 320 మందికి ఉద్యోగాలు, అనంతపురం.
17. సెరెంటికా రెన్యూవబుల్స్ ఆఫ్ ఇండియా రూ.2,400 కోట్ల పెట్టుబడులు, 380 మందికి ఉద్యోగాలు, కర్నూలు.
18. హెక్సా ఎనర్జీ బీహెచ్ ఫైవ్ ప్రైవేట్ లిమిటెడ్, రూ.1,200 కోట్ల పెట్టుబడులు, 400 మందికి ఉద్యోగాలు, కడప.
19. రెఫెక్స్ సోలార్ ఎస్పీవీ ఫైవ్ లిమిటెడ్, రూ.480 కోట్ల పెట్టుబడులు, 345 మందికి ఉద్యోగాలు, శ్రీ సత్యసాయి జిల్లా.
20. బ్రైట్ ఫ్యూచర్ పవర్ లిమిటెడ్, రూ.3,286 కోట్ల పెట్టుబడులు, 440 మందికి ఉద్యోగాలు, అనంతపురం.
21. నవయుగ ఇంజనీరింగ్ లిమిటెడ్, రూ.15,455 కోట్ల పెట్టుబడులు, 8,400 మందికి ఉద్యోగాలు, పాడేరు.
22. చింతా గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, రూ.15,050 కోట్ల పెట్టుబడులు, 8,400 మందికి ఉద్యోగాలు, కడప.
23. సిర్మా ఎస్జీఎస్ టెక్నాలజీ రూ.1595 కోట్ల పెట్టుబడులు, 2,170 మందికి ఉద్యోగాలు, నాయుడుపేట.
24. హిందాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్ రూ.586 కోట్ల పెట్టుబడులు, 613 మందికి ఉద్యోగాలు, కుప్పం.
25. బాలాజీ యాక్షన్ బిల్డ్ వెల్, రూ.485 కోట్ల పెట్టుబడులు, 500 ఉద్యోగాలు, అనకాపల్లి.
26 అదాని విల్మర్ లిమిటెడ్, రూ.578 కోట్లు, 285 మందికి ఉద్యోగాలు, నెల్లూరు జిల్లా.
27. టైరోమెర్ టెక్నాలజీ లిమిటెడ్, రూ.85 కోట్లు పెట్టుబడులు, 120 మందికి ఉద్యోగాలు, చిత్తూరు.
28. ర్యామ్ శీ బయో ప్రైవేట్ లిమిటెడ్, రూ. 356 కోట్ల పెట్టుబడులు, 600 ఉద్యోగాలు, కడప జిల్లా.
29. శ్రీ సర్వారాయా షుగర్స్ లిమిటెడ్, రూ.161 కోట్ల పెట్టుబడులు, 189 మందికి ఉద్యోగాలు, కోనసీమ.
30. పట్టాభి ఆగ్రోఫుడ్స్, రూ.408 కోట్ల పెట్టుబడులు, 500 మందికి ఉద్యోగాలు, కాకినాడ.

# ఉల్లి రైతులకు భరోసా

**క్వింటాకు రూ.1200 చెల్లించి కొనుగోలు**

**ఉల్లి రైతులు నష్టపోకూడదు.. కష్ట పడకూడదు**

**కొనుగోలు చేసిన ఉల్లిని రైతు బజార్లకు తరలించండి**

**ఉల్లి రైతుల ఇబ్బందులపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష**



**అమరావతి:** ఇబ్బందుల్లో ఉన్న ఉల్లి రైతును ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. రైతుల నుంచి ఉల్లిని తక్షణమే కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం నుంచే క్వింటాకు రూ.1200 చెల్లించి ఉల్లిని కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో రైతుల నుంచి ఉల్లి కొనుగోళ్లపై గురువారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, మార్కెటింగ్ విభాగం అధికారులు హాజరయ్యారు. ఉల్లి రైతుల పరిస్థితి, ఉల్లి ధరలు ఏ మేరకు ఉన్నాయనే అంశంపై చంద్రబాబు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఉల్లి పంటకు సంబంధించిన క్రయ విక్రయాలపై అంశంపై చర్చించారు. ఉల్లి పంట దెబ్బతిన్న కారణంగా.. మహారాష్ట్ర ఉల్లి పంట ఎక్కువగా ఉన్న కారణంగా ధరల విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులు తెలిపారు. వచ్చే పది రోజుల్లో 5 వేల మెట్రిక్ టన్నుల ఉల్లి పంట వచ్చే అవకాశం ఉందని సీఎంకు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "ఉల్లి రైతులకు నష్టం వాటిల్లకూడదు. క్వింటా ఉల్లిని రూ. 1200 చొప్పున కొనుగోలు చేయండి. తక్షణం కొనుగోళ్లు ప్రారంభించాలి. మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ నుంచి నష్టాన్ని భరించాలి. కమ్యూనిటీ హాళ్లల్లో అద్దెకు తీసుకుని ఆరబెట్టాలి. ఆరబెట్టిన ఉల్లిని రైతు బజార్లకు పంపిణీ చేయాలి. ఉల్లికి రేటు వచ్చేంత వరకూ కమ్యూనిటీ హాళ్లల్లో నిల్వ చేసుకునేందుకు రైతులకు అవకాశం కల్పించాలి. రైతు నష్టపోకూడదు.. వినియోగదారుడు ఇబ్బంది పడకూడదు. అన్ని పంటల ధరల స్థిరీకరణ కోసం వేర్ హౌసింగ్ సదుపాయం కల్పించాలి" అని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలోని రైతు బజార్ల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టాలని సీఎం మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న రైతు బజార్ల సంఖ్యను పెంచాలని సూచించారు. వీటిని 150 నుంచి 200 వరకూ చేసేలా ప్రణాళిక చేయాలని అన్నారు. దీనిపై సీఎం మాట్లాడుతూ "రైతు బజార్లను నెక్స్ట్ లెవల్ కు తీసుకెళ్లాలి. మార్కెట్ యార్డుల్లోని 2-3 ఎకరాల భూమిని వినియోగించుకుని కొత్తగా ఆధునిక రైతు బజార్లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేపట్టాలి. మార్కెట్ యార్డుల్లో వేర్ హౌసింగ్, కోల్డ్ చైన్ లను కూడా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చేయండి. రైతులకు, వినియోగదారులకు ఉపయోగపడేలా మార్కెట్ యార్డు స్థలాలు వినియోగించాలి. ధరల నియంత్రణకు.. ద్రవ్యోల్బణం పెరగకుండా ఈ చర్యలు ఉపకరిస్తాయి" అని సీఎం అన్నారు.

# యూరియా వచ్చేసింది



మొదటి పేజీ తరువాయి

రావలసిన యూరియా, వారం ముందుగానే రాష్ట్రానికి సరఫరా చేసినందుకు కేంద్రానికి మంత్రి అచ్చెన్న ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో త్వరితగతిన యూరియా రాష్ట్రానికి చేరుకుంటుందని అన్నారు. ఇండియన్ పొటాష్ లిమిటెడ్ కంపెనీ ద్వారా ఈ ఎరువులను గంగవరం పోర్టులో దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లోని వ్యవసాయ పంటల సాగు పరిస్థితి, వాటి దశలను బట్టి యూరియా అవసరాలను శాస్త్రీయంగా బేరీజు చేసుకుంటూ,ప్రణాళిక బద్ధంగా అత్యంత అవసరం ఉన్న ప్రాంతాలకు, తక్షణ పంట అవసరాలకు అనుగుణంగా మాత్రమే, వ్యవసాయ అధికారుల పూర్తి పర్యవేక్షణలో రైతులకు యూరియా ను సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ కమీషనర్ డిల్లీ రావుకు మంత్రి ఆదేశించారు. సెప్టెంబర్ నెల మొదటి వారంలో కాకినాడ పోర్ట్ కు సుమారు మరొక 25 వేల మెట్రిక్ టన్నుల యూరియాకు తక్కువ కాకుండా సరఫరాకు కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి తెలిపారు. రైతులు యూరియా సరఫరా విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ ఖరీఫ్ సీజన్ కు యూరియా పుష్కలంగా లభిస్తుందని హామీ ఇచ్చారు. రైతులు వారి పంట తక్షణ అవసరాలకు మాత్రమే యూరియాను కొనుగోలు చేయాలని, వచ్చే రబీ సీజన్ కు ముందుస్తు కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని రైతులను మంత్రి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎరువులను ఇతర రాష్ట్రాలకు, పక్కదారి పట్టకుండా అధిక ధరలకు అమ్మకుండా, నిఘా ఎన్ఫోర్స్మెంట్ ను మరింత కట్టుదిట్టం చేసి, కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. ప్రతి జిల్లాలో కలెక్టర్, ఎస్పీల ఆధ్వర్యంలో వ్యవసాయ, పోలీసు, విజిలెన్స్, రెవెన్యూ, పరిశ్రమల అధికారులతో సంయుక్త టీమ్ లను ఏర్పరిచి తనిఖీలను చేస్తున్నామని తెలిపారు.

# ఏపీ వ్యాప్తంగా భారీ వర్షాలు



**అమరావతి :** ఏపీలో భారీ వర్షాలు బీభత్సంగా కురుస్తున్నాయి. వర్షాలు ఎడతెరిపి లేకుండా కురవడం వల్ల అనేక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. నదులు, వాగులు పొంగిపొర్లు తున్నాయి. రోడ్లు నీటితో నిండిపోయి, రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అప్రమత్తమైన ప్రభుత్వం ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే పనిలో ఉంది. మత్స్యకారులు సముద్రానికి వెళ్లకూడదని హెచ్చరికలు జారీ చేశాయి. అవసరం లేకుండా బయటకు రావొద్దని అధికారులు కోరుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. గురువారం నాడు హోంమంత్రి అనిత ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో ఫోన్ చేసి మాట్లాడారు. వర్షాలపై అధికారులను అప్రమత్తం చేశారు. కృష్ణా నది పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు హోంమంత్రి అనిత. ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ కీలక ప్రకటన చేశారు. కృష్ణా నది వరద ప్రవాహం భారీగా పెరుగుతుందన్నారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద వరద ఉధృతంగా వస్తోందని చెప్పారు. మధ్యాహ్నం లోపు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందన్నారాయన. ప్రస్తుత ఇన్ఎ÷-లో, ఔట్ ఫ్ల 3.62 లక్షల క్యూసెక్కులు ఉందన్నారు. ప్రభావిత జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారాయన. కృష్ణానది పరీవాహక ప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లంక గ్రామ ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. వినాయక నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భారీ వరదలు వస్తున్న నేపథ్యంలో వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయరాదని హెచ్చరించారు ప్రఖర్ జైన్.



వరంగల్ 33 వ డివిజన్ పెరుకవాడ లో కార్పొరేటర్ కాంటెస్ట్ కాండేట్ ముద్దసాని రాధిక శ్రీనివాస్ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆ వినాయకుడిని కోరుకుంటూ గురువారం గణపతి విగ్రహాన్ని ప్రతిష్టించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంవత్సరం వర్షాలు నిండుగా ఉండి రైతులు ఆనందంగా ఉండాలని, ఈ నవరాత్రి ఉత్సవాలను ఇలాంటి అపసృతులు జరగకుండా నిర్విఘ్నంగా పూర్తి చేసుకోవాలని ప్రార్థించారు.

- వరంగల్, ఆగస్టు 28 (సమయం న్యూస్)

## పత్తిపై సుంకాల మినహాయింపు



**న్యూ ఢిల్లీ, ఆగస్టు 28 ( సమయం న్యూస్):** భారత వస్త్ర రంగానికి పత్తి లభ్యతను పెంచడానికి, కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 19, 2025 నుండి సెప్టెంబర్ 30, 2025 వరకు పత్తిపై దిగుమతి సుంకాన్ని తాత్కాలికంగా మినహాయించింది. ఎగుమతిదారులకు మరింత మద్దతు ఇవ్వడానికి, కేంద్ర ప్రభుత్వం పత్తిపై దిగుమతి సుంకం మినహాయింపును (HS5201) సెప్టెంబర్ 30, 2025 నుండి డిసెంబర్ 31, 2025 వరకు పొడిగించాలని నిర్ణయించింది.

## భారీ వర్షాలు పడుతున్నా మొద్దు నిద్రలో ప్రభుత్వం

- వంటేరు ప్రతాపరెడ్డి



**గజ్వేల్, ఆగస్టు 28 (సమయం న్యూస్):** రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల పట్ల రేవంత్ సర్కార్ నిర్లక్ష్యం వహిస్తుందని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గం ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి విమర్శించారు. గురువారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో భారీ వర్షాలు పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా మొద్దు నిద్రలోనే ఉందని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు రైతులకు నష్టం జరుగుతుంటే ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. అదే విధంగా భారీ వర్షాలు కురిసి చెరువులు, కుంటలు మత్తడి దూకి చెరువులకు గండ్లు పడుతుంటే అధికారులు కూడా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. భారీవర్షాలతో వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. వెంటనే ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు ప్రతి ఎకరానికి 25వేల రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌పక్షాన అండగా నిలవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ.రాజమౌళి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నమాజ్ మీరా, మండల పార్టీ అధ్యక్షుడు బెండే మధు, వర్గల్ మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఖాజా విరాసత్ అలీ, రాష్ట్ర యూత్ వింగ్ నాయకుడు జుబేర్ భాష, మాజీ జడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం, పంగ మల్లేశం, వర్గల్ మాజీ ఎంపీపీ లతా రమేష్ గౌడ్, కొండపాక మండల మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, జిల్లా యువజన అధ్యక్షుడు దేవ గనిక నాగరాజు, మాజీ కౌన్సిలర్ బొగ్గుల చందు, సీనియర్ నాయకులు నర్సింగరావు, మరికంటి కనకయ్య, మామిడి శ్రీధర్, అహ్మద్ తదితరులున్నారు.

## బాన్సువాడలో బాలరాజు పర్యటన


తక్షణ చర్యలకు ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ ఆదేశాలు



**బాన్సువాడ, ఆగస్టు 28(సమయం న్యూస్):** బాన్సువాడ పట్టణంలో రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అనేక ప్రాంతాలు నీట మునిగి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వర్షపు నీరు రహదారులపై చేరి రాకపోకలకు అంతరాయం కలిగించడంతో పాటు, కాలనీల్లో నిలిచిపోయి ప్రజల జీవన విధానాన్ని దెబ్బతీస్తోందని ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పలు ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, మున్సిపల్ ఇంజనీర్లు మరియు పలువురు స్థానిక నాయకులు, సిబ్బంది కూడా ఉన్నారు. మొదటగా పట్టణ ప్రధాన రహదారిపై ఉన్న ఎస్‌బీఐ సమీపం, హీరో షోరూమ్ పరిసరాలు పరిశీలించారు. అక్కడ రహదారిపై వర్షపు నీరు నిలిచి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని గుర్తించారు. వెంటనే మున్సిపల్ సిబ్బందిని పిలిచి తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తరువాత ఆయన సాయి కృపా నగర్‌లో పర్యటించారు. కల్కి చెరువును పరిశీలించారు. పర్యటన అనంతరం అధికారులతో సమావేశమై, సమస్యలపై సమీక్ష నిర్వహించారు. వర్షాకాలంలో పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# యూరియా దుర్వినియోగం కాకుండా చూడాలి

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్, ఆగస్టు 28 (సమయం న్యూస్):** గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ లో జిల్లాలో యూరియా లభ్యత,నానో యూరియా వాడకం, చెక్ పోస్ట్ ల ఏర్పాటు తదితర అంశాలపై వ్యవసాయ అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూరియా బ్లాక్ మార్కెట్ కాకుండా జాగ్రత్త తీసుకోవాలని, యూరియా లభ్యతపై రైతులు ఎలాంటి ఆందోళన చెందకూడదనే భరోసా ఇవ్వాలన్నారు. రైతులకు యూరియా లభ్యతకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 20124 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయడం జరిగిందని, వారం రోజుల్లోగా జిల్లాకు అదనంగా 640 మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉందని ఆయన తెలిపారు. మండల సొసైటీల్లో 184 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని అదేవిధంగా ప్రైవేటు డీలర్ల వద్ద 596 బట్టి టన్నుల యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ తెలిపారు. మార్క్ ఫెడ్ సొసైటీ లకు 100 మెట్రిక్ టన్నుల యూరియాను తరలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మండల వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులు యూరియా విక్రయ కేంద్రాల వద్ద ఉంటూ క్షుణ్ణంగా పరిశీలిస్తూ రైతులకు యూరియా అందే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లా నుండి యూరియా అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించకుండా ఉండేందుకు సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులను నిర్వహించి తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి యూరియా ఇతర ప్రాంతాలకు తరలకుండ అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. నానో యూరియా పై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.నానో యూరియా వాడకంపై రైతులకు తెలియజేస్తూ వారిని ప్రోత్సహించాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాజారత్నం, ఏడిఏ సందీప్ కుమార్, ఏడిలు సౌభాగ్య లక్ష్మి, శంకర్ నాయక్, వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

## సైద్ధాంతిక విభేదాలే న్యూ డెమోక్రసీ నుంచి మాస్ లైన్ ఆవిర్భావం

మాస్ లైన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు సీవై పుల్లయ్య



**ఖమ్మం, ఆగస్టు 28 (సమయం న్యూస్):** నిన్న మొన్నటి వరకు న్యూ డెమోక్రసీగా తదనంతరం మాస్ లైన్ గా ఆవిర్భవించటం వెనుక సైదాంతిక విభేదాలు దారి తీశాయని సిపిఐ ( ఎం ఎల్ ) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు , రాష్ట్ర కమిటీ సభ్యులు సి. వై . పుల్లయ్య తెలిపారు. సమయం ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి యం డి. షఫీ యు జమ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాస్ లైన్ ఆవిర్భావం , విభేదాలు , తమ కార్యాచరణ గురించి ఇంటర్వ్యూలో వివరంగా తెలిపారు. నూతన ప్రజా స్వామిక విప్లవం విషయంలో న్యూ డెమోక్రసీ మెజార్టీ భావన మైనార్టీ వర్గ భావన మధ్య విభేదాలు తలెత్తడం , మైనార్టీ వర్గ ఆలోచనలకు కమిటీలలో ప్రాధాన్యత లభించకపోవడం.. దేశం ఇంకా అర్ధ వలస భూస్వామ్య వ్యవస్థ గా ఉందని , రైతాంగ పోరాటం ప్రధానంగా కొనసాగాలని న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ మెజార్టీ వర్గ భావన. మాస్ లైను గా ఆవిర్భవించిన మైనార్టీ వర్గం..... దేశం పెట్టుబడిదారీ భూస్వామ్య వ్యవస్థగా ఉందని , కార్మిక వర్గ పోరాటం ప్రధానంగా సాగాల్సిన అవసరం ఉందనే ఆలోచన కారణంగా సైదాంతిక విభేదాలు పురుడు పోసుకున్నయన్నారు. దేశంలో మాస్ లైన్ తెలంగాణ కర్ణాటక తమిళనాడు ఆంధ్ర ప్రదేశ్ కేరళ పశ్చిమ బెంగాల్ న్యూఢిల్లీ మణిపూర్ అస్సాం జార్ఖండ్ బీహార్ మహారాష్ట్ర మేఘాలయ గుజరాత్ ఒరిస్సా వంటి 17 రాష్ట్రాలలో బలంగా ఉందన్నారు. మాస్ లైన్ గా ప్రస్తుతం ఉన్న వర్గం గతంలో ప్రజాపంథా గా ఉండేదని , ఆనాడు..... ప్రస్తుత న్యూడెమోక్రసీ లో మెజార్టీ వర్గం , తమ వర్గం సైదాంతిక ఆలోచనలు , కార్యాచరణ పై అభిప్రాయాలు మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు ఉండేవి కాదన్నారు. దివంగత మారోజు వీరన్న కులవర్గ పోరాటంపై ప్రశ్నకు జవాబిస్తూ ..... కుల ప్రధానంగా పోరాటాలు ఆచరణ సాధ్యం కావడం లేదన్నారు. కుల పోరాటంపై క్యాడర్ స్పందన ఆశించిన మేర లేదన్నారు. కాబట్టి కార్మిక వర్గ పోరాటం ప్రధానంగా సాగితే ... ఆ వెనుక కుల పోరాటాన్ని ముందుకు తీసుకుపోదాం . 2013 వరకు అంతర్గతంగా న్యూ డెమోక్రసీ లో మెజార్టీ బి మైనార్టీ వర్గాల సైదాంతిక అభిప్రాయ భేదాలు ఆ తర్వాత తీవ్ర స్థాయిలో పెరిగాయి అన్నారు. మైనార్టీ వర్గాల ఆలోచనలకు సైతం ఆనాడు కమిటీలలో ప్రాధాన్యత దక్కకపోవడం నేపథ్యంలో ..... మాస్ లైన్ ఆవిర్భావం జరిగిందన్నారు. ప్రస్తుతం నిర్మాణ పరంగా బలోపేతంపై దృష్టి సారించామని ముఖ్యంగా కార్మిక , విద్యార్థి ,యువజన సమస్యల సాధన పై ఉద్యమాలు నిర్వహిస్తున్నమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంగా ఒక కార్యాచరణ ప్రణాళికతో మాస్ లైన్ ముందుకు సాగుతోందన్నారు.



## గర్భిణిని కాపాడిన 108 సిబ్బంది

**కామారెడ్డి, ఆగస్టు 28(సమయం న్యూస్):** కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం వెల్లుట్లపేట గ్రామానికి చెందిన చందా కౌర్ (23), పవన్ కళ్యాణ్ భార్య, తన మొదటి ప్రసవ వేదనతో తీవ్రమైన పురిటినొప్పులు అనుభవించింది. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్ సేవలకు ఫోన్ చేశారు. వర్షం భీభత్సంగా కురుస్తుండగా, రోడ్లు మునిగిపోయినా, పరిస్థితులు క్లిష్టంగా ఉన్నా 108 సిబ్బంది ధైర్య సాహసాలు చేసి గ్రామానికి చేరుకున్నారు. కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు, గర్భిణిని సురక్షితంగా బాన్సువాడ మాత శిశు సంరక్షణ ఆసుపత్రికి తరలించారు. ఈ సేవలో ముందుండి బాధ్యతగా వ్యవహరించిన వారు ఈఎంటి రమేష్ మరియు పైలట్ పుండరికం గర్భిణిని కాపాడారు. వారికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన



**కామారెడ్డి, ఆగస్టు 28 (సమయం న్యూస్):** కామారెడ్డి జిల్లాలో నిన్న రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అధిక వర్షాల వలన జాతీయ రహదారి 44 పైకి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వరద నీరు రావడంతో వాహనాలు ఆగిపోయి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని గమనించి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ జిల్లా ఎస్పీ రాజేష్ చంద్రతో కలిసి జాతీయ రహదారి వెంబడి పర్యటించి సహా సహాయక చర్యలలో పాల్గొన్నారు. జెసిబిలను తెప్పించి జాతీయ రహదారిపై నిలిచిన నీటిని క్లియర్ చేశారు. అదేవిధంగా వరదల్లో చిక్కుకున్న వాహనదారులకు జాతీయ రహదారి 44 పై జిఆర్ కాలనీ వద్ద 500 మందికి, వ్యాసంపల్లి రోడ్డు వద్ద జాతీయ రహదారి 44 పై 500 మందికి, పాత రాజంపల్లి రోడ్డు వద్ద జాతీయ రహదారి ఎన్ హెచ్ 44 పై 500 మందికి జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ నేతృత్వంలో ఆహారాన్ని ఏర్పాటు చేసి వాహనదారులు ఆహారం కోసం ఎలాంటి ఇబ్బంది పడకుండా ఆహారాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్న అధిక వర్షం వలన ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి అవసరమైన చర్యలను చేపట్టడం జరిగిందని, జిల్లా అధికార యంత్రాంగంతో పాటు పోలీస్, ఫైర్ సేఫ్టీ, ఎస్డిఆర్ఎఫ్, ఎన్డిఆర్ఎఫ్ బృందాలు పూర్తిస్థాయిలో జిల్లాలో సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయని అన్నారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా 500 మంది పైగా ప్రజలను రెస్క్యూ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరిగిందని తెలిపారు. వర్షం విపరీతంగా కురుస్తున్నందున జిల్లాలోని ప్రజలు ఇల్లు వదిలి బయటకు రావద్దని సూచించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైన ఎమర్జెన్సీ హెల్ప్ లైన్ నెంబర్100 నెంబర్ కాల్ చేయడం గానీ, కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నెంబర్ 08468-220069 నెంబర్ కు కానీ సమాచారం అందజేయాలని సూచించారు.

# అన్ని విధాలుగా ఆదుకుంటాం

- యుద్ధ ప్రాతిపదికన సదుపాయాల పునరుద్ధరణ
- ముంపు గ్రామాలను సందర్శించిన ఎమ్మెల్యే, కలెక్టర్, సీపీ



**నిజామాబాద్, ఆగస్టు 28 (సమయం న్యూస్).** ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన గ్రామాలను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య గురువారం సందర్శించారు. వరద నీటి ఉద్ధృతి వల్ల ముత్యాల చెరువు తెగిపోవడంతో ధర్పల్లి మండలం వాడి గ్రామంతో పాటు నడిమి తండా, బీరప్ప తండాలు ముంపునకు గురయ్యాయి. సమాచారం తెలిసిన వెంటనే సహాయక చర్యలకు ఆదేశించిన కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, సీ.పీతో కలిసి వాడి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో వరద తాకిడికి గురైన ప్రాంతాలలో ఎమ్మెల్యేతో కలిసి పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించారు. నీట మునిగిన పంట పొలాలు, తెగిపోయిన రోడ్లు, కూలిన విద్యుత్ స్తంభాలను పరిశీలించి వరద ఉద్ధృతి తీవ్రతను అంచనా వేశారు. ఇళ్లలోకి వచ్చి చేరిన వరద జలాలతో వాటిల్లిన నష్టం గురించి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముంపు బాధిత కుటుంబాలకు ఆశ్రయం కల్పించిన ఒన్నాజిపేట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి ముంపు బాధితులకు కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. ఎలాంటి భయాందోళనలకు గురి కావద్దని, ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి ఆదుకుంటామని బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే, కలెక్టర్ భరోసా కల్పించారు. వారం రోజులకు సరిపడా ఆహార పదార్థాలు, రక్షిత మంచి నీరు అందుబాటులో ఉంచామని అన్నారు. కాగా, విద్యుత్, తాగునీటి వసతి వంటి సదు-పాయాల పునరుద్ధరణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మరో 48 గంటల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినందున మళ్లీ వరద వచ్చినా సమర్థవంతంగా ఎదుర్కొనేలా, ప్రజలకు సహాయక చర్యలు అందించేలా అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉండాలని ఎస్.డీ.ఆర్.ఎఫ్. బృందాలకు, పోలీసులకు సూచించారు. కాగా, వాడి గ్రామాన్ని సందర్శించడానికి ముందు, రామడుగు, లోలం గ్రామాల వద్ద లో లెవెల్ వంతెన పై నుంచి ప్రవహిస్తున్న వరద నీటిని కలెక్టర్, సీపీ పరిశీలించారు. వీరి వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

# వర్షంలోనూ ప్రజలకు అండగా మున్సిపల్ సిబ్బంది

## కంట్రోల్ రూమ్ ద్వారా భరోసా



**కామారెడ్డి, ఆగస్టు 28 (సమయం న్యూస్):** కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో ఉదయం నుండి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో నీరు నిలిచి, లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే మున్సిపల్ సిబ్బంది అప్రమత్తమై అన్ని వార్డుల్లో పర్యటిస్తూ సమస్యలను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టారు. ప్రత్యేకించి డ్రైనేజీలు మూసుకుపోయిన ప్రాంతాల్లో జేసీబీలను వినియోగించి నీరు పారే మార్గాలను త్రవ్వించడం, అడ్డంకులను తొలగించడం చేపట్టారు. కాలువలు బ్లాక్ అయిన చోట్ల వెంటనే క్లియర్ చేయించారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా పంపింగ్ మిషన్లు ఉపయోగించి బయటకు పంపించారు. ఈ చర్యలతో పాటు ప్రజలను అప్రమత్తం చేస్తూ వర్షంలో ఇళ్ల వద్ద జాగ్రత్తలు పాటించాలని, అవసరమైతే కంట్రోల్ రూమ్‌కి సమాచారం అందించాలని సిబ్బంది సూచించారు. స్థానిక ప్రజలు స్పందిస్తూ మున్సిపల్ సిబ్బంది సమయానికి వచ్చి చర్యలు తీసుకోవడం వల్ల మాకు ఉపశమనం కలిగిందని తెలిపారు. ఈ పర్యటనలో మేనేజర్ మల్లికార్జున్ రెడ్డి, సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, సతీష్, హన్మాండ్లు తదితరులు పాల్గొని ప్రజలకు సహాయం అందించారు. అంతేకాకుండా స్థానిక ప్రజాప్రతినిధుల సూచనల మేరకు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే జేసీబీలు, పంపింగ్ మిషన్లు, అవసరమైన వనరులు సమకూర్చి సమస్యలు తక్షణం పరిష్కరించడానికి మున్సిపల్ సిబ్బంది కృషి చేశారు. ప్రజలకు సహాయం అందించేందుకు పురపాలక సంఘ కార్యాలయంలో ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయబడింది. ఏవైనా సమస్యలు తలెత్తిన సందర్భంలో 7386188455 (సతీష్), 7386093132 (హన్మాండ్లు) నంబర్లను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు. అదనంగా పాత ఇళ్లు కూలిపోయే ప్రమాదంలో ఉన్నవారి కోసం పాత పురపాలక సంఘ కార్యాలయ భవనాన్ని పునరావాస కేంద్రంగా సిద్ధం చేశామని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ అత్యవసరం అయితే తప్ప ఇళ్ల నుండి బయటికి రావద్దని, కరెంటు స్తంభాలు, విద్యుత్ తీగలు, వాగులు, చెరువుల వద్దకు వెళ్లరాదని, పిల్లలపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, పట్టణంలో ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలన్నారు. ప్రజల భద్రత కోసం మున్సిపల్ సిబ్బంది అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు.

# బిజెపి విద్యుత్ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించుదాం

## మాలోతు సాగర్ ఎంసిపిఐ యు వరంగల్ నగర కార్యదర్శి




**సమయం న్యూస్ వరంగల్ జిల్లా రిపోర్టర్:** ఈరోజు ఎం సిపిఐయు జిల్లా కార్యాలయం ఓంకార్ భవనం వరంగల్ లో ఎంసీపీఐయు వరంగల్ నగర కమిటీ ఆధ్వర్యంలో బషీర్బాగ్ విద్యుత్ ఉద్యమ అమరవీరుల పోరాట దినోత్సవాన్ని స్మరిస్తూ సుంచు జగదీశ్వర్ నగర సహాయ కార్యదర్శి అధ్యక్షతన సమావేశ జరిగింది ఈ సందర్భంగా ఎం సిపిఐయూ వరంగల్ నగర కార్యదర్శి మాలోతు సాగర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ బషీర్ బాగ్ విద్యుత్ ఉద్యమ నెత్తుటి గాయానికి 25 సంవత్సరాలు అని సాగర్ గుర్తు చేశారు. ఆనాడు కమ్యూనిస్టులు నాయకత్వంలో పెద్ద ఉద్యమాలు చేయబట్టే, విద్యుత్ రంగాన్ని ప్రైవేటుకు సంస్థలను అమ్మకుండా ఆపగలిగాము.అందుకే ఆనాటి విద్యుత్ పోరాట స్ఫూర్తితో తిరిగి ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని సాగర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం సి పి ఐ యు వరంగల్ నగర కార్యదర్శి వర్గ సభ్యులు ముక్కెర రామస్వామి ఎగేని మల్లికార్జున్ ఐత నాగేష్ నగర కమిటీ సభ్యులు గణిపాక ఓదెలు ఎండి మహబూబ్ పాషా సింగారపు దాసు మాలి ప్రభాకర్ ఏ నర్సయ్య ఆర్ ఐలయ్యబాపు రామస్వామి నగర నాయకులు బజ్జ కోటేశ్వర్ అల్లాడి యాకయ్య దామెర రమేష్ రాజు జమునమ్మ తదితరులు పాల్గొన్నారు

# బహిరంగంగా చెత్తను కాల్చడం నిషేధం

## బొల్లారం మున్సిపల్ కమిషనర్ బి కిషన్




**పటాన్ చెరు,జిన్నారం, ఆగస్టు 28,(సమయం):** బహిరంగంగా చెత్తను కాల్చడం నిషేధమని బొల్లారం మున్సిపల్ కమిషనర్ బి కిషన్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 88వ రోజు తెలంగాణ ప్రభుత్వ కార్యదర్శి మున్సిపల్ అర్మినిస్ట్రేషన్ మరియు అర్బన్ డెవలప్మెంట్ డిపార్టెంట్ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు గురువారం సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపల్ పరిధిలోని సూర్యదేవర ఫంక్షన్ హాల్ లో బహిరంగంగా చెత్తను కాల్చడం నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య పి సి బి అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రవీందర్, మండల తహసిల్దార్ దేవదాస్, బొల్లారం సిఐ రవీందర్ రెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు పరిశ్రమ యజమానులకు, పట్టణ ప్రజలకు, మున్సిపల్ సిబ్బందికి, బహిరంగంగా చెత్తను కాల్చడం వల్ల ప్రజలకు కలిగే అనారోగ్యం, కాలుష్యం వల్ల జరిగే అనార్థాలు, వాటి పరిణామాలు ఏ విధంగా ఉంటాయో తెలియజేయడం జరిగింది. బహిరంగంగా చెత్తను కాల్చడం నివారణకు పరిశ్రమ యజమానులు, కార్మికులు, అధికారులు, ప్రజలు, ఆచరించవలసిన విధివిధానాలను, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించడం జరిగింది. పరిశుద్ధమైన వాతావరణ పరిరక్షణకు చేపట్టాల్సిన కార్యక్రమాలను, ఉల్లంఘించిన వారిపట్ల చేపట్టవలసిన చర్యలను మొదలగు విషయాలపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏ డి సిహెచ్ మాధవరావు, ఏ ఈ రామకృష్ణారెడ్డి, మునిసిపల్ మేనేజర్ మల్లికార్జున స్వామి, రెవెన్యూ అధికారి నర్సింలు, వార్డ్ఆఫీసర్స్, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్వో, ఎంపీడీవోకు వినతి




**గజ్వేల్, ఆగస్టు 28 (సమయం న్యూస్):** సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రంలో గురువారం మండల బిజెపి అధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్, ఆధ్వర్యంలో బిజెపి నాయకులతో కలిసి ,మండల కేంద్రంలో ఎమ్మార్వో ,ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసిన అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు, రైతులకు రెండు లక్షల రుణమాఫీ పూర్తిగా కాలేదని, 2000 పింఛన్ నుండి 4000 పెంపుకు ఇంకా ఆమోదం లభించలేదని, వికలాంగుల పింఛన్లు పెంచలేదని, మహిళలకు 2500 గృహలక్ష్మి పథకం అమలు కాలేదని, ఉచిత బస్సు మహిళలు ఇబ్బందులు పడుతున్నారని, 500 గ్యాస్ అనేది పూర్తిగా అమలు కావడంలేదని,అన్నారు, రాష్ట్రంలో అకాల వర్షాలు పడి, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రైతులకు సకాలంలో యూరియా అందక గోసపడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిపాలనపై దృష్టి పెట్టాలని అన్నారు, ఈ కార్యక్రమంలో బిజెపి సిద్దిపేట జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కట్ట భాగ్యలక్ష్మి, బిజెపి జిల్లా నాయకులు రమేష్ యాదవ్, నాయకులు ఆనంద్, నక్క హరికృష్ణ, శ్రీకాంత్, కృష్ణ యాదవ్, జగన్, ఆర్విన్,ప్రవీణ్ గౌడ్, స్వామి, దినేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మానవ హక్కుల సంఘం విచారణ

**హైదరాబాద్, ఆగస్టు 28 (సమయం న్యూస్):** తెలంగాణ మానవ హక్కుల సంఘం చైర్మన్ డాక్టర్జస్టిస్ షమీమ్ అక్తర్ ఆధ్వర్యంలో గురువారం వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, నల్గొండ విద్యా సంస్థలోని తొమ్మిది మంది బీ ఫార్మసీ విద్యార్థులు దాఖలు చేసిన ఫిర్యాదుపై విచారణ చేపట్టింది. విద్యార్థులు సమర్పించిన ఫిర్యాదులో, కళాశాల యాజమాన్యం ప్రభుత్వం నుండి ఫీజు రీయింబర్స్‌మెంట్ రావలసి ఉందనే కారణంతో వారి ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లు అక్రమంగా నిలిపివేస్తున్నారని ఆరోపించారు. స్టడీ సర్టిఫికెట్లను నిలిపివేయడం విద్యార్థుల రాజ్యాంగ, మానవ హక్కులను ఉల్లంఘించేదని పేర్కొంటూ, మానవ హక్కుల రక్షణ చట్టం, 1993 లోని సెక్షన్ 18(సి) కింద ఉన్న అధికారాలను వినియోగించి, సంబంధిత కళాశాల చైర్మన్ మరియు ప్రిన్సిపాల్ తక్షణమే విద్యార్థుల ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లు తిరిగి ఇవ్వడమే కాక, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు (టీసీలు) జారీ చేయాలని కమిషన్ సిఫార్సు చేసింది. అలాగే, కళాశాల చైర్మన్ మరియు ప్రిన్సిపాల్ లను వ్యక్తిగతంగా 02.09.2025న కమిషన్ ముందు హాజరుకావాలని ఆదేశిస్తూ ఉత్తర్వుల ప్రతిని నల్గొండ కలెక్టర్‌కు, తెలంగాణ ఉన్నత విద్యా మండలిక తక్షణ చర్య కోసం పంపించింది.

# నేడు రైతులకు అవగాహన

**కొడంగల్, ఆగస్టు 28 (సమయం న్యూస్):** కొడంగల్ మండలంలో పత్తి పంటతో పాటు ఇతర పంటల యజమాన్య పద్ధతులు, అలాగే ఇటీవల కురిసిన భారీ వర్షాల ప్రభావం వల్ల పంటలు త్వరగ కొలుకోవడానికి తీసుకోవలసిన చర్యలపై శాస్త్రవేత్తలతో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మండల వ్యవసాయ అధికారి తులసి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తలు రాజేష్, మధు శేఖర్ పాల్గొని, రైతులకు సమగ్ర సూచనలు, పరిష్కార మార్గాలు తెలియజేస్తారన్నారు. శుక్రవారం రుద్రారం గ్రామంలోరైతు వేదిక వద్ద ఉదయం 9 గంటల నుండి కార్యక్రమం ప్రారంభం అవుతుంది అన్నారు.రైతు సోదరులు అందరూ కార్యక్రమానికి హాజరై, నిపుణుల సూచనలు పొందవలసిందిగా కోరారు.

# స్థానిక ఎన్నికలకు ముందే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

## సీఎం రేవంత్ రెడ్డిని కోరిన ఆర్టీసీ బీసీ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గొలనకొండ వేణు



**నర్సంపేట(సమయం న్యూస్):** వచ్చే నెల సెప్టెంబర్ లో తెలంగాణ రాష్ట్రంలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆర్టీసీ బీసీ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గొలనకొండ వేణు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని గురువారం పత్రికా ముఖంగా కోరారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఎజెండాలో ఇచ్చిన హామీ ప్రకారం ఆర్టీసీని పూర్తి స్థాయిలో ప్రభుత్వంలో విలీనం చేసి, అపాయింటెడ్ డేట్ ను ప్రకటిస్తామన్న హామీని విస్మరించడం చాలా బాధాకరమన్నారు. అడుగు దూరంలో ఆగిన ఆర్టీసీ కార్మికుల ఆత్మగౌరవం...ఆర్టీసీ ప్రభుత్వ విలీనం 90% శాతం పూర్తి అయ్యిందని, ఒకే ఒక్క కలం పోటుతో విలీనం తేదీ కోసం 40 వేల మంది ఆర్టీసీ కార్మికులు వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నారని అన్నారు. మహిళల ఉచిత ప్రయాణానికి ఆర్టీసీ కార్మికులుగా మేమందరం విజయవంతంగా కృషి చేయడం వలన ప్రభుత్వానికి పేరు, ప్రతిష్టలు తీసుకురావడమే కాకుండా ఇటీవల 200 కోట్ల మంది మహిళా ప్రయాణీకులు ఉచిత రవాణా సౌకర్యాన్ని వినియోగించుకొని 6,700 కోట్ల డబ్బును ఆదా చేసుకొ ని సంబురాలు చేసుకున్నాం. ఒక బస్సులో రెండు బస్సుల మందికి పైగా ప్రయాణీకులు జర్నీ చేస్తున్నా ఓపికతో డ్యూటీలు చేస్తున్నాం. తెలంగాణ రైతంగానికి 9 రోజులలో 9 వేల రూపాయల కోట్లు జమ చేసి రికార్డు సృష్టించిన సీఎం రేవంత్ రెడ్డికి ఆర్టీసీ ప్రభుత్వ విలీన అపాయింటెడ్ డేట్ ను అమలు చేయడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. జీతాల పెరుగుదల లేక నేటి సమాజంలో పెరిగిన ధరలకు తోడు కుటుంబ పోషణ, పిల్లల చదువులకు, పెళ్లిళ్లకు ఆర్టీసీ ఉద్యోగులు అప్పుల ఊబిలోకి నెట్టబడ్డారు. అప్పులకు వడ్డీలు కట్టలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేక తెలంగాణ సాధించుకున్న తర్వాత రాష్ట్రంలో అతి తక్కువ జీతాలతో ఎక్కువ కష్టపడుతున్న ఆర్టీసీ కార్మికులకు సెప్టెంబర్ మొదటి వారంలో విడుదల కానున్న స్థానిక ఎన్నికల కోడ్ ను దృష్టిలో పెట్టుకొని పెండింగ్ లోనున్న రెండు పీఆర్సీలలో ఒక పీఆర్సీ ఏప్రిల్ 2021 తక్షణమే ప్రభుత్వ ఉద్యోగులతో సమాన జీత భత్యాలు ఉండే విధంగా 48% శాతం ఫిట్ మెంట్ ప్రకటించాలని ఆయన అన్నారు. 2021లో 3,800 కోట్ల ఆదాయం, 2025లో 8,700 కోట్ల ఆదాయం 2026లో ఆర్టీసీ ఆదాయం ఏకంగా 10 వేల కోట్ల రూపాయల ఆదాయంతో ఆర్టీసీ సరికొత్త రికార్డు సృష్టించబోతుంది. అంటే ఆర్టీసీ లాభాలు వెయ్యి కోట్ల నుంచి 1500 కోట్ల వరకు ఉంటుంది. 52 నెలల వేతన సవరణ జాప్యానికి ప్రభుత్వానికి రూపాయి ఖర్చు లేదు, వేతన పెంపు భారం పూర్తిగా ఆర్టీసీకే చెల్లుతుందన్నారు. కావున వేతన సవరణ కోసం ఆర్టీసీకి ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని, తద్వార ప్రభుత్వ విలీనం చేస్తే యావత్తు ఆర్టీసీ కార్మికులు కాంగ్రెస్ ప్రభుత్వానికి మరియు సీఎం రేవంత్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని వేణు విజ్ఞప్తి చేశారు.



## గణపతి మండపాలకు క్యారమ్ బోర్డులు

**బాలసముద్రం సమయం న్యూస్:** టిపిసిసి సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి వరంగల్ పార్లమెంట్ ఇంచార్జి మొహమ్మద్ ముస్తాక్ నేహాల్ ఆధ్వర్యంలో గణపతి నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా ఈ రోజు బాలసముద్రం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గౌరవ వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారి చేతుల మీదుగా డివిజన్ కు రెండు చొప్పున గణపతి మండపాలకు క్యారమ్ బోర్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఈ.వి. శ్రీనివాస్ రావు, సోషల్ మీడియా నాయకులు రోషన్ గైక్వాడ్ తదితరులు పాల్గొనారు

## క్షయ వ్యాధిపై ఆందోళన వద్దు

**డాక్టర్.. అమూల్య ప్రియదర్శిని**



**వికారాబాద్: కొడంగల్ నియోజక వర్గం ఆగస్టు,28:** దౌల్తాబాద్ మండలం (సమయం న్యూస్) : క్షయవ్యాధి గ్రస్తులకు ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్యసేవలు అందించడం జరుగుతుందని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అమూల్య ప్రియ దర్శిని వెల్లడించారు దౌల్తాబాద్ మండలం లోని%ఊ% కార్యాలయం లోక్యాంప్ నిర్వహించడం జరిగింది పీహెచ్‌సీ వైద్యాదికారి అమూల్య ఆద్వర్యం లో టీబీ ముక్త భారత్ అభియాన్ లో భాగంగా వైద్య శిభిరం నిర్వహించడం జరిగింది. ఈ క్యాంప్ లో 205 మందిని పరీక్షించగా 14 మంది క్షయ వ్యాధి లక్షణాలు వున్నవారికి కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రి కి పంపి ఎక్స్‌రే పరీక్షలు చేయడం జరిగిందని తెలిపారు. ఇట్టి క్యాంపు లోడాక్టర్ అమూల్య ప్రియదర్శిని తో పాటు డాక్టర్ సంతోష్, రఫీ సూపర్ వైజర్, ఎంఎల్‌హెచ్‌పీ, రాహత్ ఎస్‌టీఎస్, శ్రీధర్ ఎల్‌టీ, ఏఎన్ఎంలు అనురాధ, అనిత, మరియు ఆశ కార్య కర్తలు పాల్గొన్నారు.

## పవిత్ర మదీనాలో ఉమ్రా యాత్రికుల పర్యటన శుభ సూచకం



**ఖమ్మం , ఆగస్టు 28 : ( సమయం న్యూస్ )** ప్రపంచ మానవాళి ఆఖరి ప్రవక్త మహమ్మద్ ( స ) పుట్టినరోజు సెప్టెంబర్ 5 తేదీ మన దేశంలో కాగా సౌదీ అరేబియా దేశంలో ఒకరోజు ముందుకు నాలుగవ తేదీ .. ఆయన పుట్టినరోజు , నేడు హైదరాబాద్ లోని శంషాబాద్ ఎయిర్పోర్ట్ ద్వారా బయలుదేరిన ఉమ్రా యాత్రికుల బృందం .... ప్రవక్త పుట్టినరోజు నాడే పవిత్ర నగరం మదీనా లో పర్యటించనుండటం శుభసూచకమని వై . కే. టూర్స్ అండ్ ట్రావెల్స్ స్పెషలిస్ట్ ఉమ్రా అండ్ హజ్ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్. అబ్దుల్లా అన్నారు. శంషాబాద్ ఎయిర్పోర్టు నుండి మి లా దుల్ నబీ ( మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు ) సెప్టెంబర్ 4వ తేదీ కాగా అదే రోజు ఈ ఉమ్రా యాత్రకు బృందం ఆయన పుట్టిన పవిత్ర ప్రదేశం మదీనాలో పర్యటించనుండటం శుభసూచకం , ఈ సందర్భంగా చెప్పిన విధివిధానాలను యాత్రికులు తప్పనిసరిగా అనుసరించాలని ఆకాంక్షించారు. మక్కా బి మదీనా లో యాత్రికులు ఆయా ప్రదేశాల పవిత్రతను కాపాడుతూ , విధి విధానాలను అనుసరిస్తూ .. మన దేశం ,మన రాష్ట్రం, ప్రపంచ మానవాళి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయాలని కోరారు. 25 సంవత్సరాల తమ సర్వీసెస్ యాత్రికుల పర్యటన కు సేవా దృక్పథంతో తక్కువ ధరలో ఏర్పాట్లు చేస్తుందన్నారు. తెలంగాణ తో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తమ సర్వీసెస్ ఉమ్రా , హజ్ యాత్రలకు ప్రత్యేక శ్రద్ధతో సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. తవాఫ్ టూర్స్ అండ్ ట్రావెల్స్ హజ్ అండ్ ఉమ్రా సర్వీసెస్ నుండి మరో బృందం ఉమ్రా యాత్రకు బయలుదేరింది. ఈ సందర్భంగా నిర్వాహకులు హాఫీజ్ మొహమ్మద్ జవ్వాద్ అహ్మద్ ఈ కార్యక్రమంలో పాల్గొని , యాత్రికులకు శుభాకాంక్షలు ప్రకటించారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**పటాన్ చెరు, ఆగస్టు 28,(సమయం) :** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. వర్షాల కారణంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని ఆయన అన్నారు. ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులు కార్యకర్తలు అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు స్థానికంగా అందుబాటులో ఉండి అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ప్రజలు నదులు వాగులు చెరువులు కల్వర్టులు విడుదల దగ్గరికి వెళ్ళ వద్దని ఆయన తెలిపారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణ ప్రయాణాలు చేయకూడదని అన్నారు. కరెంట్ స్తంభాలు, పాతబడిన వైర్లను తాకవద్దని ఆయన సూచించారు. చిన్న పిల్లలను ఇంటి బయటకు రానివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరుకున్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలో రైతుకు అన్యాయం జరగదు

- సర్వే నంబర్ 1, సర్వే నంబర్ 376 భూ భాదితుల పాపం ముమ్మాటికి బిఆర్ఎస్ దే
- జిన్నారం, జంగంపేట భూ బాధిత రైతులకు తప్పకుండా న్యాయం చేస్తాం
- మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ ,వడ్డే కృష్ణ, శ్రీకాంత్ రెడ్డి



**పటాన్ చెరు,జిన్నారం, ఆగస్టు 28,(సమయం) :** రైతుల పక్షాన నిలబడేది రైతు సంక్షేమం కోరేది కేవలం కాంగ్రెస్ పార్టీ అని, ఇందిరమ్మ రాజ్యంలో రైతుకు ఎలాంటి అన్యాయం జరగదని, జిన్నారం, జంగంపేట భూ బాధిత రైతులకు తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తామని జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన జిన్నారంలో మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వడ్డే కృష్ణ,మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 1, సర్వే నంబర్ 376 భూ బాధిత రైతుల పాపం బిఆర్ఎస్ పార్టీదేనని వారు విమర్శించారు.ఎన్నో సంవత్సరాల నుంచి రైతు పక్షపాతిక ఉంటున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే పేదలకు భూముల పట్టాలు ఇచ్చామని ఆయన తెలియజేశారు. ఇందిరమ్మ రాజ్యంలో నాటి నుంచి నేటి వరకు రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూసింది కాంగ్రెస్ పార్టీ అని వారన్నారు. మండల కేంద్రమైన జిన్నారం సర్వే నంబర్ 1, జంగంపేట సర్వే నంబర్ 376లో భూబాధితులకు తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తామని వారు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జిన్నారం, జంగంపేట రైతుల నుండి 180 ఎకరాల భూమిని తీసుకొని హెచ్ఎండిఏకు అప్పగించడం జరిగిందని వారన్నారు. రైతులను మభ్యపెట్టి 600 గజాల స్థలాన్ని ఇప్పిస్తామనిచెప్పి 121 మంది రైతులను మోసం చేసింది బిఆర్ఎస్ నాయకులు అని వారు విమర్శించారు. మండల బిఆర్ఎస్ నాయకులు జిన్నారం, జంగంపేట రైతుల కోసం కాటా శ్రీనివాస్ గౌడ్ ను విమర్శించడం సిగ్గుచేటని,కాటా శ్రీనివాస్ గౌడ్ వల్లనే రైతులకు పరిష్కారం లభిస్తుందని, ఆయనను విమర్శించే నైతిక హక్కు బిఆర్ఎస్ నాయకులకు లేదని వారన్నారు. పక్క మండలమైన గుమ్మడిదలలో 160 ఎకరాల భూమిని టీఎస్ ఐపాస్ క్రింద గుమ్మడిదల భూబాధిత రైతులకు ఎకరాకు 29.50 లక్షల రూపాయలు పరిహారం ఇప్పించింది కాంగ్రెస్ ప్రభుత్వం అని వారన్నారు. గుమ్మడిదల మండలంలో రైతులకు ఇచ్చిన నష్టపరిహారం కాటా శ్రీనివాస్ గౌడ్ సహకారంతో జిల్లా మంత్రులను కలిసి జిన్నారం జంగంపేట రైతులకు నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. మండలంలో యూరియా పై బిఆర్ఎస్ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని, మండలానికి 920 మెట్రిక్ టన్నుల యూరియా అవసరముందని, ఇప్పటివరకు 783 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేశామని వారు తెలిపారు. ఇంకా రావలసిన 137 మెట్రిక్ టన్నుల యూరియా ఒకటి రెండు రోజుల్లో మండలానికి వస్తుందని వారు తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతుల భూముల సమస్యలు పరిష్కరించుకోవాలంటే చెప్పులు అరిగేదాకా తిరిగిన పరిష్కారం కాలేదని కాంగ్రెస్ హయాంలో వచ్చిన భూభారతిలో వేల సంఖ్యలో సమస్యలు పరిష్కరించబడ్డాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గంగ రమేష్, మాజీ ఎంపిటిసి పుట్టి భాస్కర్, జాకీ,మహేష్ ,రాజు, అందూర్ సత్యనారాయణ, నక్కిర్తి రమేష్,నరేష్,రఘు, నరేష్ గౌడ్,పల్నాటి భాస్కర్, పంబాల గణేష్, రైతులు మేదరి విఠల్, జంగోని దుర్గయ్య,కృష్ణ,నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

## వన మహోత్సవంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

**వికారాబాద్: ఆగస్టు, 28 (సమయం న్యూస్):** జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మరియు జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి ఈ రోజు జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో "వన మహోత్సవం" కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మరియు సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం చాలా ముఖ్యం అని తెలిపినారు. "చెట్లు మన జీవితానికి ఊపిరి వంటివి. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడానికి, భూతాపాన్ని తగ్గించడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించాలి. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, పచ్చని వాతావరణాన్ని అందించాలంటే మొక్కల పెంపకం అత్యవసరం. పోలీస్ శాఖ ఇలాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం అభినందనీయం" అని అన్నారు. ఎస్పీ కె. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణ లో కూడా భాగం అవ్వడం చాలా సంతోషం గా ఉంది. "పోలీస్ సిబ్బంది కేవలం లా అండ్ ఆర్డర్ చూసుకోవడమే కాకుండా, సమాజ శ్రేయస్సు కోసం ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం గర్వకారణం. ప్రతి పోలీస్ స్టేషన్‌లో, పోలీస్ క్వార్టర్స్ లలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి. వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని" తెలిపారు. ఈ కార్యక్రమంలో అస్సిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి గారు, జిల్లా అదనపు ఎస్పీ (డిటిసి ప్రిన్సిపాల్) పివి మురళీధర్ , డిటిసి డిఎస్‌పి శ్రీనివాసులు,ఏఆర్ డిఎస్‌పి వీరేష్ ,ఇతర పోలీస్ అధికారులు,సిబ్బంది అంతా కలిసి మొక్కలు నాటి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





## జిల్లాలో విస్తారంగా వర్షాలు

**పొంగుతున్న వాగులు, చెరువులు : రోడ్లమీద పారుతున్న నీళ్లు**

**ఖమ్మం, ఆగస్ట్ 28 :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల అనేక చోట్ల వాగులు వంకలు చెరువులు నిండి , పొంగి పొర్లుతున్నాయి. రోడ్ల మీద కు కూడా నీళ్లు చేరడంతో పలుచోట్ల రాకపోకలు స్తంభించిపోయాయి. అనేక ప్రాజెక్టులు తమ సామర్థ్యాన్ని మించి నీరు చేరడంతో గేట్లు ఎత్తి కిందికి వదులుతున్నారు. ఖమ్మం బి బోనకల్ మధ్య రహదారి పై రామా కృష్ణాపురం వద్ద చెరువు అలుగు పొంగి , నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఖమ్మం వయా సత్తుపల్లి , రాజమండ్రి పోయే ప్రధాన రహదారి కిష్టారం గ్రామం వద్ద రోడ్డుపై రెండు అడుగుల నీరు చేరడంతో భారీ వాహనాలు తప్ప చిన్న వాహనాలు వెళ్లలేని పరిస్థితి. గత రాత్రి పాల్వంచ సమీపంలోని కిన్నెరసాని ఒక గేటును తెరిచి కిందకు నీళ్లు వదిలారు. భద్రాచలం , దుమ్ముగూడెం గోదావరి నిండుకుండలా తయారయింది. ఉమ్మడి జిల్లాలోని చంద్రుగొండ , అన్నపురెడ్డిపల్లి , దమ్మపేట ,అశ్వరావుపేట, ములకలపల్లి ప్రాంతాలలో భారీ వర్షం కురిసింది. ఫలితంగా జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. జిల్లా కలెక్టర్లతో సహా వివిధ శాఖ అధికారులు ఆయా ప్రాంతాలలో పర్యటిస్తూ సమీక్షిస్తున్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు , విధులపై అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ అన్నపూర్ణ**



**సమయం న్యూస్ గజ్వేల్ ఆగస్టు 28 :** వర్షాల వలన సీజనల్ వ్యాధులు ప్రబలే అవాకాశాలున్నాయని, గజ్వేల్ జిల్లా ఆసుపత్రిలో సరైన వైద్యం చేయడానికి పూర్తీ స్థాయిలో వైద్యులు, మందులు అందుబాటులో ఉన్నాయని వాటిని ప్రజలు సకాలంలో ఉపయోగించుకొని ఆరోగ్యమైన జీవితం కొనసాగించుకోవాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ అన్నపూర్ణ సూచించారు. గజ్వేల్ పట్టణ కేంద్రంలో ఏర్పటు చేసినా మీడియా సమావేశంలో సూపరింటెండెంట్ అన్నపూర్ణ మాట్లాడుతూ సీజనల్ జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,ఎక్కువ రోజులు జ్వరంతో భాదపడితే వెంటనే జిల్లా ఆసుపత్రిలో వైద్యుల సూచన మేరకు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రజలు డెంగ్యూ, మలేరియా లాంటి వ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దని, ఆయా వ్యాధులకు జిల్లా ఆసుపత్రిలో వైద్యం అందుబాటులో ఉందని తెలిపారు. విషజ్వరాలతో అడ్మిట్ అయిన రోగులు డ్యూటీ డాక్టర్ ల పట్ల గాని, ఏవైనా ఇతరత్రా ఇబ్బందులు ఉంటే తనను సంప్రదించాలని, ప్రతివ్యక్తి వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్ర పరుచుకునే బాధ్యత ప్రతిఒక్కరి పై ఉందని సూచించారు. ఈ కార్యక్రమం లో ఆర్ ఏం ఓ డాక్టర్ రాము,ప్రణతి, జయశ్రీ పాల్గొన్నారు

# కష్టపడే తత్వం అలవర్చుకోవాలి

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ఖమ్మం, ఆగస్టు 28 : ( సమయం న్యూస్ )** ఎక్కడ ఉన్న, ఏం చదివిన కష్టపడే తత్వం ఉన్నప్పుడే అనుకున్నది సాధిస్తామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మిషన్ వాత్సల్య ( పీఎం కేర్స్ ) పథకం క్రింద పిల్లలకు ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కోసం గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని, పిల్లలకు మార్గదర్శనం చేశారు. కోవిడ్ సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు పీఎం కేర్స్ క్రింద 10 లక్షల రూపాయల పోస్టల్ డిపాజిట్, వారి చదువు, కెరీర్ పరంగా స్థిర పడే విధంగా ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. ఇట్టి మొత్తం వారికి 23 సంవత్సరాల వయస్సు నిండగానే డ్రా చేసుకొనుటకు అవకాశం కల్పించినట్లు అన్నారు. ఇట్టి డబ్బును వృధా చేయక ఉపాధికల్పనకు, అభివృద్ధి కి సద్వినియోగం చేసుకోవాలన్నారు. విభిన్న కుటుంబ నేపథ్యం, వివిధ స్థాయిలో ఉన్న, ఎక్కడ ఉన్న, ఏం చదివిన కష్టపడే తత్వం ఉన్నప్పుడే మంచి ఫలితం ఉంటుందని అన్నారు. కష్టం ఎప్పుడు వృధా కాదని, సులభంగా వచ్చింది ఏదైనా ఎక్కువ రోజులు నిలవదని అన్నారు. కాలం ఎంతో విలువైనదని, పోయిన కాలం ఎన్నటికీ తిరిగి రాదని అన్నారు. జీవితంలో ఇది సాధించాలన్న కష్టపడాలని అనుకున్న లక్ష్యసాధనపై దృష్టి కేంద్రీకరించాలని తెలిపారు. జీవితంలో అప్ అండ్ డౌన్స్ సహజమని, ఒకే రోజు అన్ని మన దగ్గరకు రావని అన్నారు. తాను 3 సార్లు సివిల్స్ పరీక్షలు రాసిన ఫలితం రాలేదని, నిరుత్సాహం చెందక, ఎక్కడ పొరపాట్లు చేసాను అని దీక్షతో పొరపాట్లు సరిదిద్దుకొని ఐఏఎస్ అయ్యానని కలెక్టర్ అన్నారు. సోషల్ మీడియా నియంత్రణ తో ఉపయోగించాలని, సోషల్ మీడియా తో సమయాన్ని వృధా చేసుకోవద్దని అన్నారు. సర్టిఫికెట్లు భద్రపర్చుకొనే ఫోల్డర్, ఆర్థిక అక్షరాస్యత పై అవగాహనకు సంబంధించి పుస్తకం, పోస్టల్ డిపాజిట్ పుస్తకం లు పిల్లలకు, కలెక్టర్ అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్, పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, జిల్లా బాలల సంరక్షణ కమిటీ చైర్ పర్సన్ భారతి రాణి, జిల్లా బాలల పరిరక్షణ అధికారిణి విష్ణు వందన, సంక్షేమ శాఖ అధికారులు, పిల్లలు, పిల్లల సంరక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో పొంగి పొర్లిన చెరువులు, కుంటలు

**పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం.**

**లోతట్టు ప్రాంతం లోకి చేరిన వర్షం నీరు.**



**రాయపోల్,ఆగస్టు28 :** రాయపోల్ మండల వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఉదయం గురువారం అర్ధరాత్రి మండల వ్యాప్తంగా భారీ వర్షాలు కురవడంతో కాలనీలు,ఇండ్లలోకి భారీగా వర్షం నీరు చేరింది. బుధవారం 69.5 మీ.మీ , 50.4 మీ.మీల వర్షపాతం నమోదయింది. అలాగే అన్ని గ్రామాలలో చెరువులు, కుంటలు నిండి మత్తడి దుంకుతున్నాయి. పలు గ్రామాలకు రోడ్లపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. అనాజీపూర్ చెరువు నిండి మత్తడి దుంకడంతో రాయపోల్,అనాజీపూర్ గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొత్తపల్లి చెరువు నుండి ముత్తటి దుంకడంతో రాంసాగర్,కొత్తపల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిపివేశారు. మంతూర్,అనాజిపూర్ గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం కలిగింది. అలాగే రాయపోల్, మంతూర్ గ్రామంలో పలు కాలనీలు జలమయమయ్యాయి. ఇండ్లలోకి నీరుచేరింది. ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఎక్కడ మురికి కాలువలు ఉన్నాయో, ఎక్కడ రోడ్లపై గుంతలు ఉన్నాయో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. శిథిలావస్థలో ఉన్న ఇల్లు కూలిపోతాయేమోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. చెరువులు,కుంటలను తహసిల్దార్ కృష్ణమోహన్, ఎంపీడీవో బాలయ్య, ఎస్సై మానస పరిశీలించి రోడ్లమీదకు వరద నీరు చేరిన ప్రదేశాలలో ప్రజలను వెళ్లకుండా అప్రమత్తం చేశారు.



# బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో గణేష్ మండపాల సందర్శన

**- రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు వి.చంద్రారెడ్డి**

**పటాన్ చెరు, జిన్నారం, ఆగస్టు 28,(సమయం) :** సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపల్ పరిధిలోని పలు కాలనీలలో ఏర్పాటుచేసిన వినాయక మండపాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు వి.చంద్రారెడ్డి గురువారం సందర్శించి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. గణనాధుని కృపా, కటాక్షాలతో ప్రజలందరికీ విఘ్నాలు తొలగి సంతోషంగా ఉండేలా చూడాలని ఆది దేవుడిని ఆకాంక్షించారు. ప్రజలందరికీ గణేష్ నవరాత్రి ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. నగరంలో కురుస్తున్న భారీ వర్షాలు నేపథ్యంలో వినాయ మండపాల వద్ద తగు జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర కార్మిక నాయకులు వి.వరప్రసాద్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు చంద్రయ్య, నర్సింహారాజు, స్థానిక నాయకులు వెంకటయ్య, దిననాథ్, మాజీ వార్డ్ మెంబర్ భాస్కర్, శేఖర్, నాగిరెడ్డి , యువజన నాయకులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మ రామయ్య కుటుంబానికి పరామర్శ

**సమయం న్యూస్ గజ్వేల్ ఆగస్ట్ 28:** గురువారంరోజు గజ్వేల్ మండలంలోని దాచారం గ్రామానికి చెందిన మాల మహానాడు జాతీయ నాయకుడు తుమ్మ శ్రీను గారి తండ్రి తుమ్మ రామయ్య పరమావదించారు విషయం తెలుసుకున్న గజ్వేల్ నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి తుమ్మ రామయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తూ తుమ్మ శీను కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు వారి వెంట గజ్వేల్ మండల పార్టీ అధ్యక్షుడు బెండే మధు గ్రామస్తులుతుమ్మ యాదగిరి, తుమ్మ కనకయ్య, తుమ్మ మహేష్ గ్రామ పెద్దలు తుమ్మ బాల నర్సయ్య ,తుమ్మ చంద్రయ్య, ఏలేశ్వరం నర్సింలు, తుమ్మ రామయ్య, బలమల్లు తదితరులున్నారు



# మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వర్షం ఇబ్బందులు

**రాయపోల్,ఆగస్టు28:** మండలంలో రెండు,మూడు రోజులుగా కురుస్తున్న బారి వర్షాలకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి ఇబ్బందిగా మారింది. మండల ప్రజా పరిషత్ కార్యాలయం ప్రైవేట్ రేకుల షెడ్డు పైకప్పు రేకులు దెబ్బతినడంతో వర్షపు నీరు లోపలికి చేరి సిబ్బందికి ఇబ్బందులు కలిగిస్తోంది. దస్త్రాలు తడవడం,కంప్యూటర్లపై నీళ్లుపడటం,పనులు అడ్డంకులు ఎదుర్కోవడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వివిధ పనుల నిమిత్తం మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి వచ్చే ప్రజలు మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడానికి వచ్చే మండల కార్యాలయం ఇంత దయనీయ స్థితిలో ఉండటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాయపోల్ మండలం ఏర్పడి దాదాపు 10 సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకు ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించకపోవడం బాధాకరమన్నారు. సంబంధిత అధికారుల తక్షణ చర్యలు తీసుకొని రేకుల షెడ్డుకు మరమ్మతు చేసి సిబ్బంది, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసి రాయపోల్ మండల అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నామన్నారు.



# జిన్నారం మున్సిపల్ కమిషనర్‌గా తిరుపతి



**పటాన్ చెరు, జిన్నారం, ఆగస్టు 28,(సమయం) :** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలో నూతనంగా ఏర్పడిన జిన్నారం మున్సిపాలిటీ కమిషనర్ గా తిరుపతి గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు. జిన్నారం గ్రామపంచాయతీ సెక్రటరీ మాణిక్యం వారి సిబ్బంది కమిషనర్ కు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. తిరుపతి జోగిపేట్(అందోల్) మున్సిపల్ కార్యాలయం నుండి బదిలీపై నూతనంగా ఏర్పడిన జిన్నారం మున్సిపాలిటీకి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతో మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ



**పటాన్ చెరు, గుమ్మడిదల, ఆగస్టు 28,(సమయం) :** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని బొంతపల్లి గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇండ్ల ప్రెసిడెంట్ కాపీలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దశరథ్ మాట్లాడుతూ బొంతపల్లి ఏరియాలో గతంలో ఇందిరమ్మ ఇండ్లు తక్కువగా మంజూరు కావడం జరిగిందని తెలిపారు. దానికి గ్రామ ప్రజలు, నాయకులు నిరసన వ్యక్తం చేశారు. బొంతపల్లి గ్రామంలో తిరిగి సర్వే చేయించి 56 ఇందిరమ్మ ఇళ్లకు మంజూరు రావడం జరిగిందని తెలిపారు. మంజూరు కాపాడిన ప్రొసీడింగ్ పత్రాలను మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నాగేందర్ గౌడ్, వేణు, నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# వలకు చిక్కిన 10 కిలోల చేప



**రాయపోల్, ఆగస్టు 28:** గత రెండు,మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రాయపోల్ మండలం లో చెరువులు,కుంటలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో చెరువులు, కుంటలలో ఉన్న చేపలు బారి యెత్తు చేపలు బయటకువ చాయి. వాటిని పట్టేందుకు ప్రజలు పోటెత్తారు. పెద్ద,పెద్ద చేపలు వలలో పడడంతో జాలరులకు,ప్రజల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. మండల కేంద్రం రాయపోల్ గ్రామానికి చెందిన తుడుం వినోద్,తిప్పారం నవీన్ ల వలకు దాదాపు 10 కిలోల చేప చిక్కింది.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**పటాన్ చెరు, గుమ్మడిదల, ఆగస్టు 28,(సమయం) :** రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు తప్పనిసరిగా అప్రమత్తంగా ఉండాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి సూచించారు. గురువారం గుమ్మడిదల మండల కేంద్రంలోని సిజిఆర్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ, మండల ప్రజలు రహదారులపై నీరు నిలిచిన చోట్ల వాహనాల రాకపోకలు తగ్గించాలని, విద్యుత్ తీగలు తెగిన ప్రాంతాలకు వెళ్లరాదని హెచ్చరించారు. చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో అధికారులు ఇచ్చే సూచనలను పాటిస్తూ, ప్రజలు కలసి ముందుకు సాగితేనే వరద ప్రభావాన్ని తగ్గించుకోవచ్చని స్పష్టం చేశారు. వర్షాలు కొనసాగుతున్నంతవరకు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ గౌడ్, హనుమంత్ రెడ్డి,తుపాకులరాజు, విశాల్ గౌడ్,బాల్ రెడ్డి,కరుణాకర్ రెడ్డి, సాయి రెడ్డి, భార్గవ్ చారి, గోపాల్,యాదిరెడ్డి,లక్ష్మణ్, సత్యనారాయణ, పాల్గొన్నారు.

# కార్మికులకు శ్రమ దోపిడీని ఆపండి

**పటాన్ చెరు, ఆగస్టు 28,(సమయం):** సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోని మెడికల్ డివైస్ పార్క్ సుల్తాన్ పూర్ లోని యస్ ఇంటర్నేషనల్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు జీవో నెంబర్ నాలుగు ప్రకారం కనీస వేతనం 23 వేల రూపాయలు చెల్లించాలని,కార్మికుల శ్రమ దోపిడీని ఆపాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి నాగేశ్వరరావు పరిశ్రమ యాజమాన్యాన్ని, జిల్లా అధికార యంత్రంగాన్ని డిమాండ్ చేయడం జరిగింది. గురువారం పరిశ్రమ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పర్మినెంట్ పేరుతో కార్మికులకు పూర్తిస్థాయిలోపల ఈఎస్ఐ,పిఎఫ్ సౌకర్యాలు, బోనస్ లాంటి సౌకర్యాలు కల్పించడం లేదని అన్నారు. మిగతా 450 మంది మహిళా ఇతర కార్మికులు పనిచేస్తున్న కార్మికుల వద్ద శ్రమదోపిడి గురిచేస్తూ, పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు రావలసినటువంటి చట్టపరమైన సౌకర్యాలు కల్పించకుండా శ్రమదోపిడి గురి చేస్తున్నదని అన్నారు.



## వైద్య శాఖ అప్రమత్తం

**ప్రజలకు అందుబాటులో సేవలు అందించాలి : సంచాలకులు**

**కామారెడ్డి : ఆగస్టు 28, సమయం న్యూస్:** భారీ వర్షాల కారణంగా వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో సేవలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్ ఆదేశించారు. గురువారం ఆయన టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్‌తో కలిసి జిల్లా ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఉన్న అత్యవసర వైద్య సేవల సదు- పాయాలపై వివరాలు తెలుసుకున్నారు. అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. ఆరోగ్య శాఖ మంత్రి ఆదేశాల మేరకు ప్రతి మండల స్థాయి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర స్థాయిలో గ్రామాల వారీగా ప్రత్యేక వైద్య శిబిరాలు ప్రతిరోజూ నిర్వహించాలని ఆదేశించారు. ఈ శిబిరాలపై రోజు వారీగా నివేదికలు ఉన్నతాధికారులకు సమర్పించాలని ఆయన స్పష్టం చేశారు.తదుపరి ఆయన హౌసింగ్ బోర్డు కాలనీ, సత్య గార్డెన్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించారు. అక్కడ ఆరోగ్య శాఖ తరఫున ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించి ప్రజలకు తగిన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. తరువాత దేవునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి మందుల కొరత లేకుండా, మౌలిక అవసరాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. అధిక వర్షాల కారణంగా ఏర్పడే సమస్యల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అత్యవసర వైద్య సేవలు, వైద్య శిబిరాలు, ఇతర ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## యూరియా గోస తీర్చండి




**రాయపోల్,ఆగస్టు28:**ఒకవైపు అకాల వర్షాలు, మరోవైపు యూరియా కొరత మూలంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రం రాయపోల్ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి 560 బస్తాల యూరియా రాగా రైతులు వర్షంలో తడుస్తూ క్యూ లైన్ లో నిల్చున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అక్కడికి వచ్చి రైతులతో మాట్లాడారు. వర్షంలో కూడా రైతులు యూరియా కోసం బారులు తీరుతున్నారంటే ఎంత సమస్య ఉందో అర్థం చేసుకోవాలన్నారు. ఒకవైపు భారీ వర్షాలు పడుతూ చెరువులు కుంటలు నిండి అలుగు పారుతూ పంట నష్టం జరుగుతుంటే మరోవైపు యూరియా దొరకటం రైతులు నానా అవస్థలు పడుతున్నార న్నారు. 1000 మంది రైతులు క్యూలైన్లో నిల్చుంటే 560 బస్తాల యూరియా ఏ మూలకు సరిపోతుందో ప్రభుత్వం చెప్పాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి అవసరమైన మేర యూరియాను అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

## గజ్వేల్ -ప్రజ్ఞాపూర్‌లో పొంగిన చెరువు

**నీట మునిగిన రోడ్లు..కిలో మీటర్ల మేర ట్రాఫిక్..!!**

**సమయం న్యూస్ గజ్వేల్ ఆగస్టు 28** తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడుతున్నాయి. సిద్దిపేట జిల్లా గజ్వేల్- ప్రజ్ఞాపూర్ ఊరు చెరువు నిండి పొంగిపొర్లడంతో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ప్రధాన రహదారి మునిగిపోయింది. పెట్రోల్ బంకులు, రోడ్డుకు ఇరువైపుల లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. రోడ్లపై నీళ్లు చేరడంతో కిలో మీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందివడుతున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ ను క్లియర్ చేశారు.





# గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 74 కృత్రిమ నిమజ్జన కేంద్రాలు

## నిమజ్జనం సజావుగా జరిగేందుకు జీహెచ్‌ఎంసీ ప్రత్యేకంగా ఏర్పాట్లు

**హైదరాబాద్ ఆగస్ట్28( సమయం న్యూస్):** గణేష్ ప్రతిమల నిమజ్జన కార్యక్రమం సాఫీగా, వేగంగా జరిగేలా చూసేందుకు జీహెచ్‌ఎంసీ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోహా74 కృత్రిమ నిమజ్జన కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రతి నిమజ్జన పాండ్ వద్ద ఒక ఇంచార్జీ అధికారి సర్కిక్ కు నోడల్ అధికారితో పాటు ఓవరాల్ ఇంచార్జీగా సంబంధిత డిప్యూటీ కమీషనర్, శానిటేషన్ సిబ్బంది సరిపోను క్రేన్లు, కంట్రోల్ రూమ్, మెడికల్ క్యాంపు, ఎప్పటి కప్పుడు వ్యర్థాలను తొలగించేందుకు శానిటేషన్ సిబ్బంది తో పాటుగా వాహనాలను ఏర్పాటు చేసి సాఫీగా నిమజ్జనం జరిగేలా సిబ్బంది మూడు షిఫ్ట్ లలో పని చేస్తారు. హుస్సేన్ సాగర్, సరూర్ నగర్ చెరువు, ఐడిఎల్ చెరువు, సఫిల్‌గూడ చెరువు, సున్నం చెరువు సహా 20 ప్రధాన చెరువులతో పాటు ఈ 74 కృత్రిమ కుంటలలో నిమజ్జనం జరుగనుంది. తద్వారా ప్రధాన చెరువుల పై ఒత్తిడి తగ్గించడమే కాకుండా సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా సమీపంలో గణేష్ విగ్రహాల నిమజ్జనం కు ప్రజల సౌకర్యం కోసం విస్తృతంగా కృత్రిమ నిమజ్జన పాండ్ లను జిహెచ్‌ఎంసి ఏర్పాటు చేసింది.



### కృత్రిమ నిమజ్జన కేంద్రాలు ఇవే

**తాత్కాలిక పోర్టబుల్ వాటర్ ట్యాంకులు - 24**

1. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, ఏ.ఎస్.రావు నగర్
2. సచివాలయ నగర్, ఆఫీసర్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ గ్రౌండ్స్‌హా
3. ఎంఆర్‌ఓ ఆఫీస్, హయత్‌నగర్
4. క్రికెట్ గ్రౌండ్, స్విమ్మింగ్ పూల్ పక్కన, సుష్మా థియేటర్, వనస్థలిపురం
5. గవర్నమెంట్ కాలేజ్ గ్రౌండ్, మున్సిపల్ ఆఫీస్ వెనుక
6. శివాలయం గ్రౌండ్, రియాసత్నగర్
7. లక్ష్మణేశ్వర ప్లేగ్రౌండ్, జంగం మెట్
8. రామ్ లీలా గ్రౌండ్, చింతల్ బస్తీ
9. SBA గార్డెన్ ఎదురుగా, 100 అడుగుల రోడ్డు
10. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ %- 2
11. అమీర్‌పేట్ ప్లేగ్రౌండ్

**తాత్కాలిక ఎక్స్కవేషన్ పాండ్లు %- 23**

1. దేవేందర్‌నగర్ రోడ్
2. హుడా భారతినగర్ పార్క్, జెడ్‌పిరోడ్, హస్తినాపురం
3. ఎన్.టి.ఆర్.నగర్ వెజిటబుల్ మార్కెట్
4. ఫ్రెండ్స్ కాలనీ షటిల్ కోర్ట్
5. ఎస్‌బిహెచ్ కాలనీ, సైదాబాద్
6. బతుకమ్మ బావి, కందికల్ గేట్, గౌలిపురా
7. వైశాలి నగర్, ఇస్పాదాన్. నర్సాబైకుంట, మైలార్దేవ్‌పల్లి
9. సంజీవిని హిల్స్, మూసీ నది పక్కన, ఉప్పర్ పల్లి

**బేబీ పాండ్లు (శాశ్వతమైనవి) - 27**

**ఎల్.బి.నగర్ జోన్ లో**

1. చర్లపల్లి చెరువు
2. కాప్రా చెరువు
3. నల్ల చెరువుహా
4. నాగోల్ చెరువుహా
5. మన్సూరాబాద్ పెద్ద చెరువుహా

**చార్మినార్ జోన్ లో**

6. పాతి కుంట
7. రాజన్న బావి

**ఖైరతాబాద్ జోన్ లో**

8. నెక్నాంపూర్
9. నెక్లెస్ రోడ్
10. దుర్గం చెరువు
11. మల్కం చెరువు
12. నల్లగండ్ల చెరువు
13. గోపి చెరువు

శేరిలింగంపల్లి జోన్ లో

14. గంగారం చెరువు
15. కైదమ్మ కుంట
16. గురునాథం చెరువు
17. రాయ సముద్రం

**కూకట్ పల్లి జోన్**

18. ముల్కత్వ చెరువు
19. ఐడీఎల్ బేబీ పాండ్, బాలాజీ నగర్, మూసాపేట్
20. బోయిన్ చెరువు బేబీ పాండ్
21. ప్రగతినగర్ బేబీ పాండ్, ఆల్విన్ కాలనీ, హైదర్నగర్
22. వెన్నెల గడ చెరువు
23. లింగం చెరువు, సురారం (మైసమ్మ దేవాలయం పక్కన)
24. కొత్త చెరువు, అల్వాల్ దేవాలయం

**సికింద్రాబాద్ జోన్ లో**

25. సంజీవయ్య పార్క్
26. సఫిల్‌గూడ
27. బండ చెరువు




# రామాయంపేటలో మంత్రి దామోదర్ నరసింహ పర్యటన

**మెదక్ ఆగస్టు28( సంసుదం న్యూస్):** వరద బాధితులతో మాట్లాడారు . లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు సహాయక చర్యలను చేపట్టాలని ఆదేశించారు . గత రెండు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అతి భారీ వర్షాల వల్ల రామాయంపేట జలదిగ్బంధంలో చిక్కుకుందన్నారు . గత రెండు రోజుల నుండి భారీ వర్షాలలో చిక్కుకున్న 60 మందిని జిల్లా డిజాస్టర్ యంత్రాంగం ,రెవిన్యూ , పోలీసులు , వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కాపాడారన్నారు . ఇద్దరూ వ్యక్తులు గల్లంతయ్యారన్నారు . వరదల్లో కొట్టుకుపోయిన ఒకరి మృతదేహం లభించిందని మంత్రి వెల్లడించారు . ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. ప్రభుత్వం పూర్తి అప్రమత్తతో ఉందన్నారు . జిల్లా కు చెందిన ప్రభుత్వ యంత్రాంగం ప్రజలను కాపాడే పనిలో నిమగ్నమై ఉన్నారన్నారు. వరద ప్రాంతాల్లో, లోతట్టు ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలపై జిల్లా కలెక్టర్, ఎస్పీ లతో మంత్రి టెలిఫోన్లో సమీక్షించారు. గత 50 ఏళ్ల లో ఇంతటి భారీ వర్షాలను చూడలేదని స్థానిక ప్రజలు మంత్రికి తెలిపారు. మెదక్ జిల్లాలోని రామాయంపేట లోని కామారెడ్డి రోడ్ లో ఉన్న బీసీ కాలనీ నీటి మునిగిన ఇండ్లను వరదని ఉద్రిత్తిని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పరిశీలించారు. రామాయంపేటలోని వరద ప్రభావిత ప్రాంతాలను లోతట్టు ప్రాంతాలను మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు గారితో కలిసి మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు. లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాలలో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, వారికి నిత్యవసర వస్తువులను భోజనాలను బట్టలను బెడ్ షీట్లను అందజేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. నిజాం పేట మల్క చెరువు , కోనాపూర్ , నందిగామ రోడ్డు లో దెబ్బ తిన్న బ్రిడ్జి , సాయి చెరువు అలుగు లను



క్షేత్ర స్థాయిలో మంత్రి దామోదర్ రాజనర్సింహా పరిశీలించారు. వచ్చే రెండు మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాలలోని ప్రజలు రెవిన్యూ ,పోలీస్ ,డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బందికి సహకరించాలని మంత్రి ప్రజలకు సూచించారు. భారీ వర్షాల కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు సురక్షితమైన ప్రదేశాలలో ఉండాలని సూచించారు. దెబ్బతిన్న ఇండ్లు , పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్లు పరిశీలించారు. ప్రభుత్వం పూర్తి అప్రమత్తతో ఉందన్నారు జననష్టం జరగకుండా నష్ట నివారణ చర్యలను చేపడుతున్నామన్నారు .దెబ్బతిన్న రోడ్లను త్వరలో పునరుద్ధరిస్తామన్నారు. పంట నష్టం .ఆస్తి నష్టం అంశాలను రెవిన్యూ యంత్రాంగం అంచనా లు రూపొందిస్తున్నారన్నారు . గత 50 ఏళ్ల చరిత్రలో ఇంతటి వర్షం కురవలేదన్నారు . రామాయంపేట , కామారెడ్డి, మెదక్ లలోని కొన్ని మండలాలలో, ప్రాంతాలలో సుమారు 200 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదయింద అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందజేస్తుందని మంత్రి వెల్లడించారు. ప్రజలకు పూర్తి అండగా ప్రభుత్వ యంత్రాంగం ఉందన్నారు మంత్రి దామోదర్ రాజనర్సింహ . ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మంత్రులు , రాష్ట్ర , జిల్లాస్థాయి అధికారులు నిరంతరం సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నామన్నారు మంత్రి దామోదర్ రాజనర్సింహ .

## అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.**

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఎటువంటి ఆందోళన చెందవద్దని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడిన కలెక్టర్, అత్యవసరమైతే తప్ప ఎవరూ ఇళ్ల నుండి బయటకు రాకూడదని కోరారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్నవారు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే వారిని గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించామని తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబరు 9100577132 ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. రోడ్లు, వంతెనలు దెబ్బతిన్న ప్రాంతాల్లో తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. లక్ష్మణచందా మండలంలోని మునిపల్లి గ్రామంలో వాగు అవతలి వైపు చిక్కుకుపోయిన శంకర్ అనే పశువుల కాపరిని ఎన్డీఆర్ఎఫ్ బృందాల సహకారంతో సురక్షితంగా రక్షించగలిగామని కలెక్టర్ వివరించారు. జిల్లా ప్రజలంతా సురక్షితంగా ఉండాలని, అధికారులు క్షేత్రస్థాయి-ంలో ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపడుతున్నారని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో డిపిఆర్ఓ విష్ణువర్ధన్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



# అహ్మదాబాద్‌లో 2030 కామన్వెల్త్ గేమ్స్!



## అంతర్జాతీయ క్రీడా వేదికగా భారత్

### యూనియన్ కేబినెట్ మీటింగ్‌లో గ్రీన్ సిగ్నల్

భారతదేశం మరోసారి అంతర్జాతీయ క్రీడా వేదికగా నిలవబోతోంది. 2030 కామన్వెల్త్ గేమ్స్‌ను నిర్వహించేందుకు హోస్ట్ చేయడానికి భారత్ సిద్ధమవుతోంది. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన యూనియన్ కేబినెట్ మీటింగ్‌లో బిడ్ వేసే ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. బిడ్ గెలిస్తే అహ్మదాబాద్‌లో ఈ గ్రాండ్ ఈవెంట్ జరగనుంది. అది కూడా గుజరాత్ సర్కార్‌కి గ్రాంట్ ఇన్ ఎయిడ్‌తో సహా అన్ని సపోర్ట్‌లతో జరగనుంది. ఒకవేళ మన బిడ్ గెలిస్తే, హోస్ట్ కొలాబరేషన్ అగ్రిమెంట్ (%ఎజా%) కూడా సైన్ అవుతుంది. బిడ్ ఆమోదం పొందితే, గుజరాత్ ప్రభుత్వానికి సహకార ఒప్పందం, గ్రాంట్%-%ఇన్%-%ఎయిడ్ మంజూరు చేయడానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కామన్వెల్త్ క్రీడల్లో 72 దేశాల నుంచి అథ్లెట్లు పాల్గొననున్నారు. ఈ క్రీడల సమయంలో దేశాన్ని పెద్ద సంఖ్యలో అథ్లెట్లు, కోచ్‌లు, సాంకేతిక అధికారులు, పర్యాటకులు, మీడియా వ్యక్తులు సందర్శించనున్నారు. దీంతో స్థానిక వ్యాపారాలకు ప్రయోజనం చేకూరడంతో పాటు ఆదాయం కూడా లభించనుంది.





అహ్మదాబాద్?లో వరల్డ్ క్లాస్ స్టేడియంలు, అత్యాధునిక ట్రైనింగ్ ఫెసిలిటీస్, స్పోర్ట్స్ పట్ల ఉన్న ప్యాషన్ సహా అనేకం ఉన్నాయి. నరేంద్ర మోదీ స్టేడియం కూడా ఇక్కడే ఉంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద స్టేడియం. 2023లో ఐసీసీ క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్‌ని సక్సెస్‌ఫుల్‌గా హోస్ట్ చేసిన ఈ స్టేడియం, కామన్వెల్త్ గేమ్స్ 2030కి కూడా రెడీగా ఉంది. ఇక్కడ అథ్లెట్లు, కోచ్‌లు, టెక్నికల్ ఆఫీసర్లు, టూరిస్టులు, మీడియా పర్సన్స్ సహా అందరూ ఒక చోట అందుబాటులో ఉంటారు. "భారతదేశంలో కామన్వెల్త్ గేమ్స్‌ని నిర్వహించడం పర్యాటకాన్ని పెంచడంతో పాటు ఉద్యోగాలను సృష్టించడం, లక్షలాది మంది యువ అథ్లెట్లకు స్ఫూర్తినిచ్చే శాశ్వత ప్రభావాన్ని చూపుతుంది. అంతేకాకుండా స్పోర్ట్స్ సైన్స్, ఈవెంట్ ఆపరేషన్స్, మేనేజ్‌మెంట్, లాజిస్టిక్స్, ట్రాన్స్‌పోర్ట్ కోఆర్డినేటర్లు, బ్రాడ్‌కాస్ట్, మీడియా, %ఐ%, కమ్యూనికేషన్స్, పబ్లిక్ రిలేషన్స్, ఇతర రంగాలలో కూడా పెద్ద సంఖ్యలో నిపుణులు అవకాశాలను పొందుతారు" అని కేంద్ర మంత్రివర్గం తెలిపింది. ఇండియాతో పాటు, నైజీరియా, మరో రెండు దేశాలు కూడా 2030లో బహుళ-క్రీడా మహోత్సవాన్ని నిర్వహించడానికి ఆసక్తిని వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. 2030 కామన్వెల్త్ క్రీడలకు తుది ఆతిథ్య దేశాన్ని నవంబర్ చివరి వారంలో గ్లాస్గోలో జరిగే కామన్వెల్త్ స్పోర్ట్ జనరల్ అసెంబ్లీ నిర్ణయిస్తుంది. ఈ కామన్వెల్త్ గేమ్స్‌లో 72 దేశాల నుంచి అథ్లెట్లు పాల్గొంటారు. ఇది కేవలం స్పోర్ట్స్ ఈవెంట్ మాత్రమే కాదు, ఒక గ్లోబల్ సెలబ్రేషన్ అని కూడా చెప్పవచ్చు. ఈ ఈవెంట్ వల్ల లోకల్ వ్యాపారాలకు కూడా మేలు జరుగుతుంది. హోటల్స్, రెస్టారెంట్లు, టూరిజం... అన్నీ బూస్ట్ అవుతాయి. అంతేకాదు, ఈ ఈవెంట్ వల్ల ఉద్యోగ అవకాశాలు కూడా పెరుగుతాయి. స్పోర్ట్స్, సైన్స్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, లాజిస్టిక్స్, బ్రాడ్‌కాస్ట్, మీడియా, %ఐ%, కమ్యూనికేషన్స్... ఇలా ఎన్నో రంగాల్లో యువతకు అవకాశాలు దొరుకుతాయి. ఈ మెగా ఈవెంట్ ఉద్యోగ అవకాశాలను సృష్టించి, పర్యాటకాన్ని పెంచుతుందని, పెద్ద ఎత్తున జరిగే క్రీడా ఈవెంట్‌లకు సంబంధించిన రంగాలలో నిపుణుల వృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు. కామన్వెల్త్ గేమ్స్ విజయవంతంగా నిర్వహించి ఒలింపిక్స్ కూడా నిర్వహించాలని కేంద్రం భావిస్తోంది.

# ఐపీఎల్‌కు గుడ్‌బై రవిచంద్రన్ అశ్విన్

### నా ఐపీఎల్ ప్రయాణం ఇక్కడితో ముగుస్తోందని పోస్ట్

### చెన్నై, పంజాబ్, ఢిల్లీ, రాజస్థాన్, పుణె జట్లకు ప్రాతినిధ్యం

### ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అశ్విన్



భారత్ స్టార్ బౌలర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఐపీఎల్‌కు గుడ్‌బై చెప్తున్నట్లు ప్రకటించారు. చివరిగా అశ్విన్ చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఐపీఎల్ టోర్నీ ఆడాడు. ఐపీఎల్‌లో పలు ఫ్రాంచైజీల తరఫున కూడా అశ్విన్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 221 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన అశ్విన్ 187 వికెట్లు తీశాడు. ఆయన చెన్నై, పంజాబ్, ఢిల్లీ, రాజస్థాన్, పుణె జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అశ్విన్, తాజాగా ఐపీఎల్ నుంచి కూడా తప్పుకోవడంతో.. అతని ఫ్యాన్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అశ్విన్ తన నిర్ణయాన్ని సోషల్ మీడియా వేదిక %ఠ% లో వెల్లడించారు. "ఒక ప్రత్యేకమైన రోజు, అందుకే కొత్త ఆరంభం. నా ఐపీఎల్ ప్రయాణం ఇక్కడితో ముగుస్తోంది. కానీ, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా వివిధ లీగ్‌ల్లో ఆడేందుకు నా కొత్త అధ్యాయం మొదలవుతోంది" అని ఆయన తెలిపారు. అశ్విన్ తన 16 సీజన్ల ఐపీఎల్ కెరీర్‌లో మొత్తం 221 మ్యాచ్‌లు ఆడారు. ఇందులో 187 వికెట్లు తీశారు. ఆయన బౌలింగ్ సగటు 30.22 కాగా, ఎకానమీ రేట్ 7.20, స్ట్రైక్ రేట్ 25.2. ఉత్తమ బౌలింగ్ ఫిగర్స్ 4/34 వికెట్లు. బ్యాట్స్‌మన్‌గా కూడా అశ్విన్ రాణించారు. 92 ఇన్నింగ్స్‌ల్లో 833 పరుగులు సాధించారు. 118.15 స్ట్రైక్ రేట్, 13.01 సగటుతో తన బ్యాటింగ్ కొనసాగించారు. ఐపీఎల్‌లో అశ్విన్ అత్యధిక వ్యక్తిగత స్కోరు 50 పరుగులు. చెన్నై సూపర్ కింగ్స్ తరఫున అశ్విన్ ఎన్నో మధుర క్షణాలను అందించారు. 2010, 2011లో ఐపీఎల్ టైటిల్ గెలుపులో కీలక పాత్ర పోషించారు. 2010లో ఛాంపియన్స్ లీగ్ టి20లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచారు. 2011 ఐపీఎల్ ఫైనల్లో మొదటి ఓవర్ వేసి, క్రిస్ గేల్‌ను డక్ అవుట్ చేసి జట్టును విజయం వైపు నడిపించారు. 2014లో మరోసారి ఛాంపియన్స్ లీగ్ టైటిల్ గెలిచారు. 2025లో చెన్నై సూపర్ కింగ్స్ టీమ్ అశ్విన్ ను రూ. 9.75 కోట్లు వెచ్చించి తిరిగి జట్టులోకి తీసుకుంది. 38 ఏళ్ల అశ్విన్ పదేళ్ల విరామం తర్వాత 2025లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో చేరాడు. ఎన్నో అంచనాలతో మెగా ఆక్షన్ లోకి అడుగుపెట్టిన అశ్విన్ ను చెన్నై రూ. 9.75 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. లోకల్ ప్లేయర్ కావడంతో ఈ వెటరన్ స్పిన్నర్ పై సీఎస్కె యాజమాన్యం ఎన్నో అంచనాలు పెట్టుకుంది. అయితే ఐపీఎల్ 2025లో అశ్విన్ ఘోరంగా విఫలమయ్యాడు. తొమ్మిది మ్యాచ్‌ల్లో మాత్రమే ఆడి 9.13 ఎకానమీ రేటుతో ఏడు వికెట్లు మాత్రమే తీసుకున్నాడు. బ్యాటింగ్‌లోనూ రాణించింది లేదు. ఐపీఎల్ 2026 సీజన్ లో అశ్విన్ ను రిలీజ్ చేయడం ఖాయమనే హింట్స్ చెన్నై జట్టు నుంచి అందాయి. 2009 నుండి 2015 వరకు ఆరు సీజన్లు సీఎస్కె జట్టు తరఫున ఆడాడు. 2016 నుంచి 2024 మధ్య ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహించాడు.

# నేటి నుంచే కబడ్డీ పండుగ

### పీకేఎల్ సరికొత్త సీజన్ ప్రారంభం

### విశాఖపట్టణం వేదికగా అకురార్పణ




కబడ్డీ క్రీడను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) సరికొత్త సీజన్‌కు సర్వం సిద్ధమైంది. విశాఖపట్టణం వేదికగా దేశీయ కబడ్డీ లీగ్ ప్రారంభం కానుండగా ఈవెంట్‌కు అన్నీ ఏర్పాట్లు పూర్తయ్యాయి. జాతీయ క్రీడా దినోత్సవాన వైజాగ్‌లో కబడ్డీ పండగ ప్రారంభం కానుంది. ప్రొ కబడ్డీ లీగ్ 12వ సీజన్ ప్రారంభానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరులు హాజరుకానున్నాయి. పీకేల్ కొత్త సీజన్ విశేషాలు ఇలా ఉన్నాయి. కోట్లాది మంది కబడ్డీ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. శుక్రవారం ఆరంభ మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్‌తో తెలుగు టైటాన్స్ ఢీ కొట్టనుంది. ఈసారి వినూత్న మార్పులతో సరికొత్త ఉత్సాహం, ఉత్కంఠమైన పోరాటాలతో ఈ సీజన్ ప్రేక్షకులకు కనువిందు చేయనుంది.




ఏడేళ్ల తర్వాత వైజాగ్‌కు ఈ లీగ్ తిరిగి వస్తోంది. జాతీయ క్రీడా దినోత్సవం రోజున ప్రారంభం కానుండడంతో పెద్ద స్థాయిలో క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈ సీజన్ ఆరంభ మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు, ఫేవరెట్ అయిన తెలుగు టైటాన్స్.. తమిళ్ తలైవాస్‌తో తలపడనుంది. రెండో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్, పుణెరి పల్టాన్ జట్లు పోటీపడనున్నాయి. ఈ మ్యాచ్‌లు వైజాగ్‌లోని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌లో జరగనున్నాయి. కొత్త సీజన్ కు శ్రీకారం చుడుతూ గురువారం వరుణ్ బీచ్‌లోని నోవాటెల్‌లో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమం క్రీడాకారులు, నిర్వాహకుల ఉత్సాహంతో నిండిపోయింది.

# 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడటమే నా లక్ష్యం

### నా రిటైర్‌మెంట్ ఎప్పుడనేది ఎవరూ నిర్ణయించలేరు


### ఆటపై విసుగు వచ్చేవరకే ఆడుతూనే ఉంటాను

### టీమ్ ఇండియాకు సీనియర్ ప్లేయర్ మహ్మద్ షమీ



టీమ్ ఇండియాకు సీనియర్ ప్లేయర్ మహ్మద్ షమీ తన రిటైర్‌మెంట్‌పై వస్తున్న వార్తలకు చెక్ పెట్టాడు. ఇప్పటికే ముగ్గురు సీనియర్ క్రికెటర్లు టెస్టులకు వీడ్కోలు పలికిన నేపథ్యంలో తన పేరు కూడా జాబితాలో ఉందన్న రూమర్స్‌పై షమీ స్పష్టతనిచ్చాడు. రెండేళ్లుగా టెస్టు క్రికెట్ ఆడని షమీ గాయాలతో ఇబ్బందులు ఎదుర్కొన్నా, 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడటం తన లక్ష్యమని చెప్పాడు. "నా రిటైర్‌మెంట్ ఎప్పుడనేది ఎవరూ నిర్ణయించలేరు. ఆటపై విసుగు వచ్చేవరకే ఆడతాను. ఒకవేళ అంతర్జాతీయ క్రికెట్‌లో అవకాశం లేకపోతే దేశవాళీ క్రికెట్‌లో కొనసాగుతా. నేను రిటైర్ అయితే ఎవరి జీవితాలు బాగుపడతాయో చెప్పండి అప్పుడు ఆలోచిస్తా. అంతవరకు ఇలాంటి ఊహాగానాలకు విలువే లేదు" అని షమీ స్పష్టం చేశాడు. తాజాగా తన ఫిట్‌నెస్ పరిస్థితిని కూడా వివరించాడు. "గత రెండు నెలల్లో శరీర బరువును కంట్రోల్ చేశా. నైపుణ్యాలను పదును పెట్టా. సుదీర్ఘంగా స్పెల్స్ వేసేలా ప్రాక్టీస్ చేస్తున్నా. ఫీల్డింగ్, బ్యాటింగ్‌లో కూడా కష్టపడి సాధన చేశా. ఇప్పుడు అన్ని విషయాల్లో కంఫర్ట్‌గా ఉన్నా" అని చెప్పాడు. "నాకు ఇప్పటికీ ఒక కల ఉంది వన్డే వరల్డ్‌కప్‌ను సగర్వంగా ఎత్తుకోవాలి. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో ఫైనల్‌కు చేరాం. అభిమానుల మద్దతుతో అక్కడికి వెళ్లాం. కానీ ఫైనల్లో కొంచెం అదృష్టం కలిసి వచ్చుంటే ట్రోఫీ మనదే అయ్యేది" అని షమీ గుర్తు చేసుకున్నాడు. మొత్తానికి షమీ రిటైర్‌మెంట్‌పై వస్తున్న వార్తలు కేవలం గాలివార్తలేనని తాను ఇంకా టీమ్ ఇండియాకు సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశాడు. ఇటీవల షమీ ప్రత్యేక మైలురాయిని చేరుకున్నాడు. వేగంగా 200 వన్డే వికెట్లు తీసిన భారత బౌలర్‌గా రికార్డు క్రియేట్ చేశాడు. మొత్తంగా ఈ ఫీట్ సాధించిన రెండో వేగవంతమైన బౌలర్‌గా నిలిచాడు. కేవలం 104వ మ్యాచుల్లో ఈ ఘనతను సాధించాడు. 133 మ్యాచుల్లో ఈ రికార్డు అందుకున్న భారత మాజీ పేసర్ అజిత్ అగార్కర్‌ను అధిగమించాడు. ఓవరాల్‌గా మిచెల్ స్టార్క్ (102) షమీ కంటే ముందున్నాడు. ప్రపంచ కప్, ఛాంపియన్స్ ట్రోఫీల్లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా రికార్డు క్రియేట్ చేశాడు. తన ఖాతాలో 60 వికెట్లు వేసుకున్నాడు. అతడి తర్వాత జహీర్ ఖాన్ (59), జవగల్ శ్రీనాథ్ (47) ఉన్నారు. షమీ తన చివరి వన్డే మ్యాచ్‌ను 2023 నవంబర్ 19న ఆస్ట్రేలియాతో ఆడాడు. అదే ఐసీసీ వన్డే ప్రపంచ కప్ 2023 ఫైనల్ మ్యాచ్. ఆ మ్యాచ్?లో టీమ్ ఇండియా పరాజయంపాలై వరల్డ్ కప్?ను చేజార్చుకుంది. ఆ తర్వాత గాయం కారణంగా షమీ అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమయ్యాడు. ఇటీవలే ఇంగ్లాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో షమీ మళ్లీ రీఎంట్రీ ఇచ్చాడు. ఆఖరి రెండు మ్యాచ్‌లు ఆడాడు. అయితే ఒక మ్యాచ్‌లో వికెట్లేమీ తీయలేదు. మరో టీ20లో మాత్రం మూడు వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు.

# వేయి మంది డ్యాన్సర్లతో షూట్




రామ్‌చరణ్ 'పెద్ది' సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. వినాయక చవితి వేళ కూడా చిత్ర బృందం షూట్‌లో పాల్గొంది. మైసూరులో మొదలైన తాజా షెడ్యూల్‌లో బుధవారం ఓ మాస్ సాంగ్‌ను చిత్రీకరించారు. జానీ మాస్టర్ ఆధ్వర్యంలో రామ్‌చరణ్‌తోపాటు- 1000 మందికిపైగా డ్యాన్సర్లతో సాంగ్ షూట్ చేపట్టారు. సెట్స్ నుంచే చిత్ర బృందం ప్రేక్షకులకు పండగ శుభాకాంక్షలు తెలిపింది. ఈ మేరకు వీడియో విడుదల చేసింది. గ్రామీణ నేపథ్యంతో తెరకెక్కుతున్న స్పోర్ట్స్ డ్రామా మూవీ ఇది. కొన్ని రోజుల క్రితం రామోజీ ఫిల్మ్ సిటీలో కీలక షెడ్యూల్ షూటింగ్ పూర్తిచేసుకున్న సంగతి తెలిసిందే. 'ఉప్పెన' ఫేం బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్. కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్, బాలీవుడ్ నటు-డు దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. హీరో- డైరెక్టర్, హీరో- హీరోయిన్ కాంబినేషన్లతోపాటు- ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఓ షాట్ మరిన్ని అంచనాలు పెంచింది. వచ్చే ఏడాది మార్చి 27న సినిమా విడుదల కానుంది.




## బాహుబలి ది ఎపిక్

### ప్రభాస్, తమన్నాల రొమాన్స్ కట్

రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కి.. తెలుగు సినిమా ఖ్యాతిని పెంచిన 'బాహుబలి' మరోసారి వండర్స్ సృష్టించడానికి ఒకేచిత్రంగా విడుదలవుతోంది. ఈ చిత్రం విడుదలై పదేళ్లు పూ-ర్తయిన సందర్భంగా మరోసారి ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నట్లు టీమ్ ప్రకటించింది. రెండు భాగాలుగా వచ్చిన సినిమాలను 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో ఒకే భాగంలో తీసుకురానున్నారు. అయితే అందులోని ఏ సన్నివేశాలను కట్ చేస్తారా? అని అందరిలో ఆసక్తి నెలకొంది. తాజాగా ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దర్శకధీరుడు ఈ సినిమాకు సంబంధించిన కొన్ని విషయాలను పంచుకున్నారు. బాహుబలి: ది ఎపిక్' రిలీజ్ విషయంలో అన్నిటికంటే కష్టమైన పని ఎడిటింగ్ అన్నరు. రెండూ కలిపి దాదాపు 5 గంటల 27 నిమిషాల రన్-టైమ్ ఉన్నాయి. వీటిని కట్ చేసి ఒక భాగంగా విడుదల చేయాలి. ఏ సన్నివేశాలను ఉంచాలి? వేటిని తీసేయాలి? అనే విషయంపై మేం తీవ్రంగా చర్చించుకుంటున్నట్లు వెల్డించారు. 'బాహుబలి'లోని ప్రతి సన్నివేశం, పాట నాకు విలువైనదే. దేన్ని తీసేయాలో అర్థం కాలేదు. నిడివి తగ్గించాలంటే కొన్ని కట్ చేయక తప్పదు. అందుకే పాట, కొన్ని సన్నివేశాలను తొలగించాలని నిర్ణయించాం. 'కన్నా నిదురించరా' పాటను కట్ చేశాం. అలాగే, ప్రభాస్-తమన్నా మధ్య సాగే కొన్ని రొమాంటిక్ సన్నివేశాలను కూడా తొలగించాలని నిర్ణయించుకున్నాం. 'బాహుబలి: ది ఎపిక్'తో ప్రేక్షకులకు కొత్త అనుభవాన్ని ఇవ్వాలనుకుంటున్నా అని రాజమౌళి తెలిపారు. అక్టోబర్ 31న ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా ఈ మూవీ విడుదల కానుంది. దీని నిడివి విషయంలో ఎన్నోవార్తలు వస్తున్నప్పటికీ చిత్రబృందం మాత్రం ఇప్పటి వరకూ అధికారికంగా స్పందించలేదు. ఎన్ని గంటలు ఉంటుందనే విషయం రాజమౌళికి తప్ప మరెవ్వరికీ తెలియదని నటు-డు రానా తెలిపారు. తాజాగా విడుదలైన ఈ సినిమా టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది.




## ఓజి సువ్వి..సువ్వి పాట విడుదల

పవన్ కల్యాణ్ హీరోగా దర్శకుడు సుజీత్ తెరకెక్కిస్తున్న సినిమా 'ఓజీ'. పవన్ సరసన ప్రియాంకా మోహన్ నటిస్తున్నారు. గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్‌గా సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. వినాయక చవితి సందర్భంగా తాజాగా ఈ సినిమా నుంచి 'సువ్వి.. సువ్వి' పాటను చిత్రబృందం విడుదల చేసింది. 'ఉండిపో ఇలాగా.. తోడుగా.. నా మూడు ముళ్లలాగా' అంటూ సాగే లిరిక్స్ కల్యాణ్ చక్రవర్తి రాయగా.. శ్రుతి రంజనీ ఆలపించారు.

## మిరాయ్ ట్రైలర్ విడుదల

యువ నటుడు తేజ సజ్జా ప్రధానపాత్రలో రూపొందుతోన్న చిత్రం 'మిరాయ్'.మంచు మనోజ్ ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో ఇది రానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. 2 నిమిషాల 58 సెకన్లు ఉన్న ఈ వీడియోలో సినిమాలో వీఎఫ్ఎక్స్ ఎఫెక్ట్‌లు ఏ స్థాయిలో ఉండనున్నాయో చూపారు. డ్రాగన్‌తో హీరో పోరాటం, 'దునియాలో ఏదీ నీది కాదు..' అంటూ వచ్చే డైలాగులు ఆకట్టుకుంటున్నాయి. సెప్టెంబర్ 12న ఈ సినిమా విడుదల కానుంది. టాలీవుడ్ ప్రేక్షకులు ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నా చిత్రాలో 'మిరాయ్' ఇకటి. తేజ సజ్జా హీరోగా, కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైప ప్రతి ఒక్క అప్‌డేట్ లో యాక్షన్ సన్నివేశాలను మరొక స్థాయికి తీసుకెళ్లగా.. తాజాగా ఈ సినిమా -ట్రైలర్ విడుదల చేశారు. కాగా ఈ -ట్రైలర్ మంచి ప్రామిసింగ్‌గా ఉందని చెప్పాలి. ముఖ్యమైన ఓ 9 శక్తివంతమైన గ్రంథాలు.. వాటి కోసం వెతికే విలన్, వాటిని అతనికి చిక్కకుండా చేసేందుకు పోరాటం చేసే హీరో ఈ మధ్యలో సాలిడ్ యాక్షన్, అడ్వెంచర్ ఎలిమెంట్స్ ఊహించని లెవెల్లో ఉన్నాయి. మొత్తనికి సెపరేట్ ప్రపంచాన్ని చూపిస్తూ మేకర్స్ ఇంప్రెస్ చేశారు. కాగా ఈ కార్యక్రమంలో తేజ సజ్జా మాట్లాడుతూ.. 'నేను పాన్ ఇండియా హీరో కావాలనుకోవడం లేదు. ఎందుకంటే మన తెలుగు ప్రేక్షకుల కోసం మాత్రమే నటిస్తున్నాను. మీ అందరి మెప్పు కోసం వర్క్ చేస్తున్నాను. నా సినిమా మిగతా వారికి నచ్చితే అది బోనస్ మాత్రమే. నేను ఎల్లప్పుడూ మీ దగ్గరే ఉంటాను, మీ కోసం ప్రెస్ మీట్స్ నిర్వహిస్తాను. ఈ సినిమాలో మంచు మనోజ్ కనిపించిన ప్రతిసారీ ఆడియన్స్‌కు గూస్ బంప్స్ వస్తాయి' అని తెలిపారు. అలా తేజ తన అభిమానుల పట్ల

ఉన్న ప్రత్యేక అభిమానాన్ని, వారి కోసం చేస్తున్న కృషిని స్పష్టంగా వ్యక్తం చేశారు. ఆయన చెప్పినట్లు-, ఈ సినిమా పూర్తిగా తెలుగు ప్రేక్షకుల కోసం కట్టు-బడి రూపొందించబడింది. ఈ ప్రాజెక్ట్‌లోని ప్రతి సన్నివేశం ప్రేక్షకులకు కొత్త అనుభవాన్ని ఇవ్వనుందని అర్థం అవుతుంది.



## పచ్చదనంతో అందాల జాన్వీ పులకింపు

అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలుగా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ జాన్వీ కపూర్. తల్లి శ్రీదేవి మరణంకు ముందే జాన్వీ కపూర్ మొదటి సినిమా ప్రారంభం అయింది. కానీ జాన్వీ నటించిన మొదటి సినిమా 'ధడక్' విడుదలకు ముందే శ్రీదేవి చనిపోయింది. హీరోయిన్‌గా జాన్వీ కపూర్‌కి కమర్షియల్ బ్రేక్ రాకున్నా అందం కారణంగా వరుస ఆఫర్లు వస్తున్నాయి. 2018 నుంచి జాన్వీ కపూర్ బ్రేక్ కోసం ఎదురు చూస్తుంది. తెలుగులో మొదటి సినిమా దేవర మంచి విజయాన్ని సొంతం చేసుకుంది, కానీ ఆ సినిమాలో జాన్వీ కపూర్ పాత్ర విషయంలో చాలా మంది విమర్శలు చేశారు, ప్రాధాన్యత లేని పాత్ర అని, హీరోయిన్ పాత్ర కాదు అంటూ జాన్వీ కపూర్‌ను చాలా మంది చాలా రకాలుగా ట్రోల్ చేసిన విషయం తెల్సిందే. అయినా జాన్వీ కపూర్ వాటి గురించి ఎప్పుడూ స్పందించదు. దేవర సినిమా తర్వాత తెలుగులో జాన్వీ కపూర్ చేస్తున్న మూవీ 'పెద్ది'. రామ్ చరణ్ హీరోగా బుచ్చి బాబు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా రంగస్థలం సినిమా రేంజ్‌లో అంతకు మించి అన్నట్లుగా ఉంటుంది అంటూ బుచ్చిబాబు సన్నిహితులు చెబుతున్నారు. రామ్ చరణ్, జాన్వీ కపూర్ కాంబో రొమాంటిక్ లవ్ సీన్స్ సైతం ఆకట్టుకుంటాయి అంటున్నారు. బుచ్చిబాబు దర్శకత్వంలో సినిమా అంటే హీరోయిన్‌కి గుర్తింపు, క్రేజ్ ఉంటుంది. అందుకే ఈ సినిమా తప్పకుండా భారీ విజయాన్ని కట్టబెడుతుంది అనే విశ్వాసం ను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. జాన్వీ కపూర్‌కి మరో బ్లాక్ బస్టర్ విజయాన్ని పెద్ది కట్టబెట్టడం ఖాయం అని ఫ్యాన్స్ నమ్మకంగా ఉన్నారు. సోషల్ మీడియాలో జాన్వీ కపూర్ రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం మనం చూస్తూ ఉంటాం. ఈ మధ్య కాలంలో ఆమె నుంచి వచ్చిన ప్రతి ఫోటో షూట్ వైరల్ అవుతోంది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఔట్ ఫిట్‌ను ధరించడం ద్వారా జాన్వీ కపూర్ ఎప్పటికప్పుడు వైరల్ కావడం మనం చూస్తూ ఉంటాం. తాజాగా మరోసారి జాన్వీ కపూర్ తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. ఈసారి గ్రీన్ డ్రెస్‌లో చూపు తిప్పనివ్వడం లేదు అన్నట్లుగా ఉంది. జాన్వీ కపూర్ ఎప్పుడు ఎలాంటి ఫోటోలు షేర్ చేసినా చాలా స్పెషల్‌గా అనిపిస్తాయి. ఈసారి కూడ ఆ గ్రీన్ డ్రెస్‌లో ఒక మూవీ ప్రమోషన్‌లో పాల్గొన్న జాన్వీ కపూర్ అక్కడి ప్రకృతికి పులకించినట్లుగా ఫోటోలకు ఫోజ్ ఇచ్చింది. పెద్దగా స్కిన్ షో చేయకున్నా కూడా ఇలాంటి అందంతో కన్నుల విందు చేస్తుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.



## ఘాటి ప్రమోషన్లలో కనిపించని అనుష్క

పాన్-ఇండియా స్థాయిలో భారీ అంచనాలతో 'ఘాటి' అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమా సెప్టెంబర్ 5న థియేటర్లలో రిలీజ్‌కి సిద్ధమవుతోంది. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో యాక్షన్ క్ఐమ్ డ్రామా, గంజాయి మాఫియా నేపథ్యంలో రూపొందుతున్న ఈ మూవీలో అనుష్క ఓ శక్తివంతమైన గిరిజన మహిళ గా కనిపించనుంది. ఇప్పటికే ఈ సినిమా ఫస్ట్ లుక్‌లో అనుష్క అదిరిపోయే గెటప్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఫ్యాన్స్‌లో ఫుల్ హైప్ నెలకొంది. అయితే ఈ మధ్య కాలంలో సినిమా తో పాటు- ప్రమెషన్స్ విషయంలో కూడా ప్రతి ఒక్క మూవీ టీం చాలా కష్టపడుతున్నారు. కానీ, 'ఘాటి' ప్రమోషన్స్‌లో అనుష్క కనిపించకపోవడం సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయింది. అయితే.. ఈ విషయంపై నిర్మాత స్పష్టత ఇచ్చారు.. అనుష్క ప్రమోషన్స్‌లో పాల్గొనబోనని షూటింగ్‌కు ముందే స్పష్టంగా తెలిపింది. ఆ మేరకు ఒప్పందం కూడా కుదిరిందని తెలిపారు. దీంతో ఆమె ఎందుకు ప్రమోషన్స్‌కు దూరంగా ఉన్నది? అనే ప్రశ్న పై టాలీవుడ్ వర్గాల్లో రూమర్లు వినిపిస్తున్నాయి. వ్యక్తిగత కారణాలా, లేదా ఇతర సినిమాల కమిట్‌మెంట్స్ కారణమా అన్నది తెలిడం లేదు. ప్రీరిలీజ్ ఈవెంట్‌కు అయినా అనుష్క హాజరేయేనా? అనే అంశం ఫ్యాన్స్‌లో చర్చనీయాంశంగా మారింది. అంటే దీని బట్టి సినిమా షూటింగ్ వరకు మాత్రమే అనుష్క కమిటైనట్లు-, ప్రమోషన్, సక్సెస్ మీట్‌లకు హాజరు కారని స్పష్టంగా తెలుస్తోంది. కానీ అనుష్క హాజరు కాలేకపోయినా, ఘాటి టీమ్ దేశవ్యాప్తంగా ప్రమోషన్లకు సిద్ధంగా ఉంది.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**